www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 13-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 328 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: చవితి రా. 1.27 తదుపరి పంచమి; నక్షత్రం: అశ్విని రా. 6.25 తదుపరి భరణి; వర్జ్యం: ప. 2.45-4.13, తె. 3.25-4.55; దుర్ముహూర్తం: మ. 12.01-4.13, అమృతఘడియలు: ఉ. 11.50-1.18; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.29; సూర్యాస్తమయం: 6.22 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


వర్చువల్‌గా బటన్ నొక్కుతున్న మోదీ


విశాఖ-భువనేశ్వర్ వందేభారత్ ప్రారంభం సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శన

కొత్త వందే భారత్ రైళ్లు ప్రారంభం

ఏలూరులో రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు శంకుస్థాపన

తిరుత్తణి-తిరుపతి అనుసంధానం

పవిత్ర నగరాల మధ్య రవాణా మెరుగుదలకు భారీ ఎత్తున విస్తరణ పనులకు శ్రీకారం 3

ఒకే పథకానికి ఏడాదిలో నాలుగుసార్లు బటన్ నొక్కి... నొక్కిన ప్రతిసారీ ప్రకటనల రూపంలో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని సొంత రోత పత్రికకు కుమ్మరించడం... ఒక స్కామ్!

'ఏపీ డిజిటల్ కార్పొరేషన్' పేరుతో ఒక ప్రభుత్వ సంస్థను ఏర్పాటు చేసి దాని ద్వారా 'పేటీఎం' బ్యాచ్‌కు జనం సొమ్ము పందేరం చేయడం మరో స్కామ్!



జనం డబ్బు.. జగన్ డప్పు!

డిజిటల్ కార్పొరేషన్‌కు సొమ్ములు కుమ్ముడు

ఈ ఏడాది ఇప్పటికే రూ.100 కోట్లు

మరో రూ.40 కోట్లు కావాలన్న ఎండీ

వెంటనే రూ.20 కోట్లు ఇచ్చేసిన సర్కారు

ప్రభుత్వ సంస్థగా 'డిజిటల్ కార్పొరేషన్'

చేసేది జగన్ భజన, విపక్షాలపై దూషణలు

పేటీఎం బ్యాచ్, కూలి మీడియాకు ఇక్కడి నుంచే సొమ్ములు

ఇక్కడా వైసీపీ సోషల్ మీడియా ఉద్యోగులే!

ప్రభుత్వ ధనంతో వైసీపీ ప్రచారం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అటు సొంత మీడియాకు, ఇటు బాకా ఊదే కూలి మీడియాకూ జనం సొమ్మును దోచిపెడుతున్నారు. అసలు లక్ష్యాలు, ఉద్దేశాలు ఏవైనా జగన్‌కు భజన చేయడం, వైసీపీకి బాకాలూదడం, ప్రత్యర్థులను ట్రోల్ చేయడం కోసమే ఏపీ డిజిటల్ కార్పొరేషన్ (ఏపీడీసీ) ఏర్పాటు చేశారు. వైసీపీ 'పేటీఎం బ్యాచ్'గా పేరొందిన వారందరికీ ఈ సంస్థ ద్వారానే జీతాలు, ప్రకటనల రూపంలో సొమ్ములు అందుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే ఈ కార్పొరేషన్ ద్వారా రూ.100 కోట్లు పంచిపెట్టారు. ఎన్నికలు ముంచుకొస్తున్నందున ధాటిగా పేటీఎం బ్యాచ్ మరింత 'కష్టపడాల్సి' ఉందని మళ్లీ జనం సొమ్ముకు టెండర్ పెట్టారు. తమకు మరో రూ.40 కోట్లు ఇవ్వాలని ఏపీడీసీ

మిగతా 11వ పేజీలో...

సర్వం మాయ

హైకోర్టు జడ్జీలను దూషించి... జైలుకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులే.

తాడేపల్లి వైసీపీ ఆఫీసు వద్ద కూల్‌డ్రింక్ షాప్ నడుపుతున్న దంపతులకు డిజిటల్ కార్పొరేషన్ ద్వారా జీతాలు అందుతున్నాయి.

ముఖ్యమంత్రి భద్రతా విభాగంలో పనిచేసే ఒక అధికారి సోదరుడికి కార్పొరేషన్‌లో కొలువు ఇచ్చారు.

సుమారు 50 మంది ఎలాంటి పనీ చేయకుండా... కేవలం 'థంబ్' వేసి వెళ్లిపోతూ జీతాలు తీసుకుంటున్నట్లు సమాచారం.

డబ్బుతో 'సిద్ధం'!

ఓటరుకు రూ.వెయ్యి.. ఎంపీ ఎంవీవీ ఫొటోతో ఇంటింటికీ కార్డుల పంపిణీ

ఆ కార్డు తీసుకుని 'సిద్ధం' సభా వేదిక వద్దకు వచ్చే పురుషులకు డబ్బులిస్తామని హామీ 11

బీసీని మార్చేసి ఓసీకి!

వైసీపీలో మార్పులే మార్పులు!

ఎన్నికలకు ముందు నిలకడలేని జగన్ నిర్ణయాలు

'పేట'కు మేయర్ మనోహర్.. గాజువాకకు గుడివాడ

ఇద్దరితో తాజాగా లిస్ట్ విడుదల

టీచర్లకు 'నగదు' బదిలీలు!



ఒక్కో బదిలీకి రూ.5 లక్షల ముడుపు

ఎన్నికల ముందు రూ.కోట్లలో వ్యాపారం

కీలక నేత, అధికారుల హస్తం.. 1400 మందికి స్థానచలనం

నేడో, రేపో ఉత్తర్వులు.. బదిలీల మార్గదర్శకాలకు పాతర

గతేడాది జరిగిన బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందంటూ చాలామంది టీచర్లు ఆ కీలక నేత వద్దకు వెళ్లారు. న్యాయం చేయాలంటూ వినతిపత్రాలు ఇచ్చారు. అయితే మహిళా టీచర్ల వినతులను మాత్రమే పరిశీలిస్తానని అప్పట్లో ఆ నేత ఆర్భాటం చేశారు. ఉపాధ్యాయ సంఘాల నేతల ముందు అలా మాటలు చెప్పిన నేత... ఆ తర్వాత అక్రమ బదిలీలకు తలుపులు తెరిచారు. మహిళా టీచరైనా, పురుష టీచరైనా ముడుపులిస్తేనే వారి వినతులు తీసుకున్నారు. సరిగ్గా ఎన్నికల వేళ 'నగదు బదిలీ'లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయుల అక్రమ బదిలీలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. గతేడాది బదిలీలు పూర్తికాగా ఇప్పుడు విద్యా సంవత్సరం మధ్యలో 'సిఫారసు బదిలీలు' పేరుతో ముడుపుల వేటకు తెరతీసింది. ఒక్కో బదిలీకి రూ.5 లక్షలకు పైగా వసూలు చేస్తూ సార్వత్రిక

మిగతా 2వ పేజీలో...

దిగొచ్చిన ఎస్‌బీఐ

సుప్రీం ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్ల వివరాలు ఎన్నికల కమిషన్‌కు సమర్పణ

ఆ వివరాలు బయటపెడితే అంతర్జాతీయ సమాజంలో మన పేరు ప్రతిష్ఠలకు దెబ్బ

సుప్రీం తీర్పుపై ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్ కోరండి.. రాష్ట్రపతికి ఎస్‌సీబీఏ చీఫ్ లేఖ

న్యూఢిల్లీ, మార్చి 12: సుప్రీంకోర్టు దెబ్బకు ఎస్‌బీఐ దిగొచ్చింది. వివరాల సమర్పణకు గడువు పెంచేది లేదని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తేల్చిచెప్పడంతో.. ఎలక్టోరల్ బాండ్ల వివరాలను మంగళవారం సాయంత్రం ఎన్నికల కమిషన్‌కు సమర్పించింది. ఇక, ఇప్పుడు ఆ వివరాలను ప్రజాబాహుళ్యం ముందు ఉంచాల్సిన బాధ్యత ఈసీ మీద ఉంది. సుప్రీం ఆదేశాల మేరకు శుక్రవారం (మార్చి 15) సాయంత్రం 5 గంటల్లోగా ఎన్నికల కమిషన్ ఆ వివరాలను

మిగతా 12వ పేజీలో...

హరియాణా సీఎంగా నాయబ్ సైనీ

మనోహర్‌లాల్ ఖట్టర్ అనూహ్య రాజీనామా

ఆయన స్థానంలో సీఎంగా ఓబీసీ నేత సైనీ

ప్రస్తుతం కురుక్షేత్ర నియోజకవర్గం ఎంపీ..!

జననాయక్ జనతా పార్టీతో బీజేపీ కటీఫ్

లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుపై విభేదాలతోనే.. 12

ఇది నవశకం పొత్తు!



వైసీపీ కబంధ హస్తాల నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకే: పవన్

అసాధ్యాన్ని సుసాధ్యం చేశా.. పొత్తు కుదర్చడంలో కీలక పాత్ర పోషించా

ఎవరికి ఎన్ని సీట్లన్నది ముఖ్యం కాదు

175 సీట్లలో 3 పార్టీలూ పోటీ చేస్తున్నట్లే

జగన్‌కు మరచిపోలేని యుద్ధాన్ని ఇద్దాం

మే 15లోపు వైసీపీ విముక్త ఆంధ్ర

కలిసి పనిచేసి ఈ కల సాకారం చేద్దాం

భీమవరాన్ని ఓ రౌడీ చేతిలో పెట్టారు

అక్కడ ఇల్లు కొందామంటే.. భయంతో ఎవరూ అమ్మడం లేదు

ఈసారి సీటు కొట్టి తీరతాం: జనసేనాని

జనసేనలో చేరిన మాజీ ఎమ్మెల్యే పులపర్తి

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 'ఎవరికి ఎన్ని సీట్లు అనేది ప్రధానం కాదు. 175 సీట్లలో మూడు పార్టీలు పోటీ చేస్తున్నట్లే. కచ్చితంగా ఈ నవశకం పొత్తు రాష్ట్రానికి మేలు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల తలరాతను మారుస్తుంది' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రాన్ని వైసీపీ కబంధ హస్తాల నుంచి బయటకు తీసుకొచ్చి నవ శకంలోకి

మిగతా 2వ పేజీలో...

రాష్ట్ర క్షేమం కోసం అసాధ్యమైన పొత్తును మనం సాధించగలిగాం. ఇది గర్వకారణమని చెప్పను గానీ.. ఇది రాష్ట్రానికి చాలా కీలకం. -పవన్

టార్గెట్ 160

లక్ష్య సాధనకు కలిసి పనిచేద్దాం: చంద్రబాబు

ప్రతి ఓటూ, ప్రతి సీటూ ముఖ్యమే

విభేదాలు విడనాడి ఐక్యంగా ఉండాలి

విధ్వంస పాలనతో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి

మళ్లీ పైకి లేపడానికే 3 పార్టీల పొత్తు

ఇది జగన్‌ను ఓడించడానికి కాదు.. మన రాష్ట్రాన్ని గెలిపించడానికే


పోలవరం పూర్తిచేయాలి.. రాజధాని కట్టాలి

పెట్టుబడులు, పరిశ్రమలు రాబట్టాలి

వీటన్నిటికీ కేంద్ర సాయం కావాలి

అభ్యర్థులు ప్రజల్లో లేకపోతే మార్చేస్తా: బాబు

56 వేల మంది పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్



అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించాలని.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కనీసం 160 అసెంబ్లీ సీట్లు సాధించాలని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. విభేదాలను పక్కన పెట్టి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఓటూ.. ప్రతి సీటూ ముఖ్యమేనని.. వాటిని

మిగతా 11వ పేజీలో...

ఉమ్మడి సభను జయప్రదం చేయాలి

శిథిల రాష్ట్రాన్ని నిలబెట్టడానికి ఇది తొలి అడుగు: బాబు

పేట సభకు భారీ ఏర్పాట్లు

ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 3 పార్టీలు

ఉమ్మడి కమిటీలతో లోకేశ్ భేటీ

సభాస్థలికి నేడు భూమిపూజ


పోఖ్రాన్‌లో భారత్ శక్తి విన్యాసాలను తిలకిస్తున్న ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 12

రక్షణలో స్వావలంబన

దేశీయంగా రక్షణ పరికరాల తయారీ రెట్టింపు

'భారత్ శక్తి' విన్యాసాల్లో ప్రధాని వెల్లడి

టికెట్ ఇప్పిస్తానని రజని 6.5 కోట్లు తీసుకున్నారు




మల్లెల రాజేశ్

ఇప్పుడు 'పేట' నుంచి తప్పించారు

డబ్బులు తిరిగి ఇవ్వాలని సజ్జల వద్ద పంచాయితీ పెడితే 3.5 కోట్లు ఇచ్చారు

మంత్రి విడదలపై రాజేశ్‌నాయుడు ఫైర్

పార్టీ బతకాలంటే సజ్జలనూ మార్చండి

మర్రి రాజశేఖర్‌ను జగన్ మోసం చేశారు

మంత్రి పదవి ఇస్తానని మడమ తిప్పారు

వైసీపీ సమన్వయకర్త మల్లెల ధ్వజం

గుంటూరు వైసీపీలో ముసలం 11

తిరగబడ్డ వలంటీరు!

ఇంటి స్థలం ఇవ్వకుండానే.. ఇచ్చినట్లు కరపత్రం 11

తనకు అందలేదంటూ నిరసన

జత కలిసిన మరికొందరు

18 నుంచి ఒంటిపూట బడులు! 2


అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్ బంధువుకు సంబంధించిన గ్రానైట్ ఫ్యాక్టరీలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మళ్లీ తనిఖీల వేట!

వందల్లో గ్రానైట్ ఫ్యాక్టరీలు, పదుల్లో క్వారీలు..

అయినా టీడీపీ మద్దతుదారులపైకే విజిలెన్స్

ఎమ్మెల్యే గొట్టిపాటి లక్ష్యంగా దాడులు ముమ్మరం

ఆయన బంధువు ఫ్యాక్టరీల్లో మళ్లీ సోదాలు

గత మూడు నెలల్లో ఇది మూడోసారి

యజమానులంతా తన వద్దకు రావాలంటూ అద్దంకి వైసీపీ నేత హుకుం 2

ఎన్ని కలల డీఎస్సీ

పోలింగ్ సమయంలో పరీక్షలు.. ఈనెల 30 నుంచి ప్రారంభం

ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో చిత్తశుద్ధి లేదు. సకాలంలో, అంతరాయాలు లేకుండా పరీక్షలు నిర్వహించే ఉద్దేశం కనిపించదు. నోటిఫికేషన్ ఇచ్చాం.. అది పూర్తయితే అవుతుంది. లేదంటే నిరుద్యోగుల ఖర్మ అన్నట్టుగా ఉంది జగన్ సర్కారు తీరు.



ప్రచార హోరు మధ్యలో డీఎస్సీ

టీచర్ల భర్తీ ఇష్టంలేని ప్రభుత్వం

సాధ్యంకాని విధంగా షెడ్యూలు

పదే పదే మార్పులతో విన్యాసాలు

అభ్యర్థులతో ఆడుకుంటున్న జగన్

ప్రభుత్వ తీరుపై అభ్యర్థుల ఆగ్రహం

14 రోజులు.. రెండు సెషన్లు

సవరణ షెడ్యూలు విడుదల

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

డీఎస్సీని సక్రమంగా నిర్వహించే ఉద్దేశం ప్రభుత్వానికి ఉన్నట్లు కనిపించడం లేదు. దీనికి సంబంధించి ముందుగానే అనేక మెలికలు పెట్టడమే ఇందుకు కారణం. ఆ మెలికలపై ఏర్పడిన న్యాయపరమైన చిక్కుల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. డీఎస్సీని పూర్తిచేస్తే అది ప్రభుత్వ క్రెడిట్, ఒకవేళ పూర్తిచేయలేకపోతే అది ప్రతిపక్షాల కుట్ర అని ప్రచారం చేసుకోవడానికి అధికార పార్టీ సిద్ధమైంది. తాజాగా డీఎస్సీ షెడ్యూలు మార్పు చూస్తే నిజంగా టీచర్ పోస్టుల భర్తీలో ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఎంతో ఇట్టే అర్థమవుతుంది. సరిగ్గా పోలింగ్ జరిగే సమయంలో, పార్టీలు ప్రచారంతో ఊదరగొట్టే సందర్భంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 30 మధ్య డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. విచిత్రం ఏంటంటే ఎన్నికల కోసం ఇంటర్, టెన్త్ పరీక్షలను

మిగతా 12వ పేజీలో...

విజిలెన్స్‌కు అపరిమిత అధికారాలొద్దు!

పిటిషన్ దాఖలు చేసిన లోకేశ్





అక్రమ కేసుల్లో ఇరికించాలనేదే ఉద్దేశం

పిటిషనర్ పార్టీ, నేతల హక్కులకు విఘాతం

స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు భంగం

విజిలెన్స్ ఐజీ కొల్లి ప్రతిపాదనను రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించండి 11

ఆయన లేఖపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వండి

వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా జగన్, కొల్లి

ఆరోగ్యశ్రీలో సమ్మె సైరన్

18 నుంచి సేవలు బంద్

- ప్రభుత్వానికి నెట్‌వర్క్ ఆసుపత్రుల నోటీసులు

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు మరోసారి సమ్మె సైరన్ మోగించాయి. గడిచిన ఆరు నెలల్లో మూడోసారి ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చాయి. ఈ వ్యవధిలో దాదాపు రూ.1,400 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయినట్లు పేర్కొన్నాయి. నోటీసులు ఇచ్చిన ప్రతిసారీ ఆసుపత్రుల యాజమాన్యాలను పిలిపించి, సర్దిచెప్పి పంపించడం తప్ప, సమస్యను మాత్రం పరిష్కరించడం లేదు. దీంతో విసిగిపోయిన ఆసుపత్రులు ఈ నెల 18 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించలేమని నేరుగా ట్రస్ట్ సీఈవోకి లేఖ రాశాయి. ఆరోగ్యశ్రీ పుణ్యమా అని నెట్‌వర్క్ ఆసుపత్రులన్నీ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయని, నెలకు రూ.270 కోట్లు చొప్పున ఆరు నెలల బిల్లులు బకాయిలున్నాయని పేర్కొన్నాయి. మొత్తంగా రూ.1400 కోట్లు ట్రస్ట్ చెల్లించాల్సి ఉందని తెలిపాయి. సేవలు నిలిపివేస్తున్నట్లు గతంలో అనేకసార్లు నోటీసులు అందించినా ప్రభుత్వం, ట్రస్ట్ ఇచ్చిన హామీలతో వెనక్కి తగ్గామని లేఖలో పేర్కొన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించలేమని తేల్చిచెప్పాయి. ఇప్పటికిప్పుడు కనీసం రూ.1,000కోట్లు విడుదల చేస్తే తప్ప తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేమని తేల్చిచెప్పాయి. తమపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని, కేవలం ఆస్పత్రుల స్వీయరక్షణ కోసమే నోటీసులు ఇచ్చామని స్పష్టం చేశాయి.

చేయి దాటుతున్న పరిస్థితి

ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో పరిస్థితి చేయిదాటుతోంది. కొత్త సీఈవో వచ్చిన తర్వాత తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. నెట్‌వర్క్ ఆసుపత్రులను అనునయించడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారు. సీఎస్, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నుంచి స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ ఆర్థికశాఖ నుంచి ట్రస్ట్ బకాయిలు విడుదల చేయించుకోలేకపోయారు. దీంతో ఆసుపత్రుల యాజమాన్యాలు ఆయనపై నమ్మకం కోల్పోయాయి. నెట్‌వర్క్ ఆసుపత్రులు సమ్మె నోటీసును నేరుగా సీఈవోకే రాయడంతో ప్రభుత్వమే రంగంలోకి దిగి, వ్యవహారాన్ని చక్కదిద్దాల్సిన పరిస్థితి నెలకొంది.

డ్వాక్రా ఆర్పీలు, యానిమేటర్లకు కోన రఘుపతి తాయిలాలు!

బాపట్ల, మార్చి 12: జిల్లా కేంద్రమైన బాపట్ల పట్టణంలోని ఆర్పీలు, బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లోని డ్వాక్రా యానిమేటర్లకు మహిళా దినోత్సవం పేరిట ఎమ్మెల్యే కోన రఘపతి మంగళవారం చీరలు పంపిణీ చేశారు. ఇటీవల వలంటీర్లకు నూతన వస్త్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోన ఇప్పుడు చీరలు పంపిణీ చేసి తన గెలుపునకు సహకరించవలసినదిగా కోరినట్టు సమాచారం. కార్యక్రమంలో మెప్మా, వెలుగు సిబ్బంది కూడా పాల్గొన్నట్టు తెలిసింది.



ఆర్పీలకు వైసీపీ నేతలు పంపిణీ చేసిన చీరలు

వైసీపీ ప్రచారార్భాటానికే గీతాంజలి బలి!

- టీడీపీ, జనసేన నేతలు ఆలపాటి, నాదెండ్ల మనోహర్ ప్రకటన

తెనాలి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రచార దాహానికే గీతాంజలి బలైపోయారని టీడీపీ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ మండిపడ్డారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మహత్యకు టీడీపీ, జనసేన సోషల్ మీడియా పోస్టులే కారణమంటూ జగన్ పత్రిక, ఆయన పార్టీ సోషల్ మీడియా చేస్తున్న ప్రచారాన్ని వారు ఖండించారు. గీతాంజలి కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయం, ఆమె భర్తకు ఉద్యోగం, సొంత ఇంటిని అందించాలని డిమాండ్ చేశారు. దీనిపై మంగళవారం ఆలపాటి రాజేంద్రప్రసాద్, నాదెండ్ల మనోహర్ ప్రకటనలు విడుదల చేశారు. "ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని రాజకీయం చేసింది వైసీపీనే. గీతాంజలికి పదే పదే రాజకీయాన్ని అంటగట్టే ప్రయత్నం చేశారు. ప్రతిపక్షాలను తిట్టించాలని చూశారు. ఆమెతో అనేక అబద్ధాలు చెప్పించేందుకు అత్యుత్సాహం ప్రదర్శించారు. వైసీపీ ఎమ్మెల్యే శివకుమార్‌ను ఓడిస్తానని మనోహర్ శపథం చేస్తున్నారు కదా! జగన్‌ను ఓడించటానికి ఐదారు పార్టీలు కలసి వస్తున్నాయి కదా! పవన్ కల్యాణ్, చంద్రబాబు ఒకటయ్యారు కదా! దీనికి మీరేమంటారు అంటూ పదేపదే ప్రశ్నించి, రాజకీయ విమర్శల కోసం ఒత్తిడి తీసుకురావటమే అసలు నేరం. మహిళలకు పథకాలు అవసరమా అని ప్రతిపక్షాలు అన్నట్టుగా ఆమెను అడగడం మరీ దారుణం. సోషల్ మీడియాలో ఆమెను నేరుగా కించపరుస్తూ కామెంట్స్ లేవు. జగన్‌పై మాత్రమే మాటల దాడి ఉంది! అమాయకులను తప్పుదారి పట్టించి వారితో అబద్ధాలు చెప్పించవద్దు" అని ఆ ప్రకటనల్లో పేర్కొన్నారు. గీతాంజలిపై నిజంగా అభిమానం ఉన్నవారు... ఆమె ఆత్మహత్యకు ప్రయత్నించి, తీవ్రగాయాలతో ప్రాణాలకోసం పోరాడుతున్నప్పుడు ఏం చేశారని టీడీపీ, జనసేన నేతలు ప్రశ్నించారు.



మంగళవారం తెనాలిలో మంత్రులు, వైసీపీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలతో సజ్జల భార్గవ రెడ్డి (నీలి చొక్కా)

సజ్జల భార్గవ రెడ్డి 'సమన్వయం'

పరామర్శల నుంచి ప్రెస్‌మీట్ దాకా...

తెనాలి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న గీతాంజలి కుటుంబాన్ని పరామర్శించేందుకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మహిళా కమిషన్ ప్రతినిధులు, వైసీపీ నేతలు మంగళవారం తెనాలికి పోటెత్తారు. వీరందరి రాక, పరామర్శ మీడియాతో మాట్లాడటం... ఇలా అన్ని కార్యక్రమాలను వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి సజ్జల భార్గవ రెడ్డి దగ్గరుండి చూసుకున్నారు. భార్గవ రెడ్డే తమను అప్రమత్తం చేసి, దీనిని తిప్పి కొట్టాలని చెప్పారని మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ తెలిపారు. గీతాంజలి మరణాన్ని వైసీపీ రాజకీయ లబ్ధికి ఉపయోగించుకునే ప్రణాళికలో ఇదంతా ఒక భాగమని టీడీపీ, జనసేన నేతలు విమర్శిస్తున్నారు.

వీడియో కలకలం..: మరోవైపు... ఈనెల 7న రైలు కింద పడిన గీతాంజలిని అదే రైలులో తెనాలి రైల్వేస్టేషన్ వద్దకు తీసుకొచ్చి, ఆ తర్వాత ఆస్పత్రికి తరలించారు. ఆ సమయంలో అక్కడ గుమికూడిన జనం మాట్లాడుకుంటున్న మాటలంటూ ఒక వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. అక్కడ ఏమైంది మావయ్యా అని ఒకరు అడగ్గా... ఆ అమ్మాయిని ఇద్దరు వ్యక్తులు రైలు కిందికి తోసేశారట అని మరొకరు చెప్పడం వినిపించింది. ఈ వీడియోలో మాటలు ఎంతవరకు నిజమో తేలాల్సి ఉంది.

లోకం తీరు



అనంతపురంలో 41 డిగ్రీలు

విశాఖపట్నం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాయలసీమ మంగళవారం అగ్నిగుండంగా మారింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2నుంచి 4డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. అనంతపురంలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వరుసగా ఎనిమిదో రోజు అనంతపురంలో దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

ఎమ్మెల్సీలు రామచంద్రయ్య, వంశీకృష్ణపై అనర్హత వేటు

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎమ్మెల్సీలు సీ రామచంద్రయ్య, చెన్నుబోయిన వంశీకృష్ణ యాదవ్‌పై అనర్హత వేటు వేస్తూ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ విప్ మేరిగ మురళీధర్ ఇచ్చిన ఫిర్యాదుపై న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపాక, అనర్హత వేటువేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చైర్మన్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు.

పతంజలి శాస్త్రికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న పతంజలిశాస్త్రి

న్యూఢిల్లీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తెలుగు రచయిత, నాటకకర్త తలావజ్ఝల పతంజలి శాస్త్రి 2023కి గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. ఢిల్లీలో జరుగుతున్న సాహిత్యోత్సవాల్లో భాగంగా మంగళవారం.. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ చేతుల మీదుగా ఆయన అవార్డును స్వీకరించారు. 'రామేశ్వరం కాకులు మరి కొన్ని కథలు' కథాసంపుటికి గాను ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆయన పిఠాపురానికి చెందినవారు.

ఇది నవశకం పొత్తు!

(మొదటి పేజీ తరువాయి)

అడుగుపెట్టడానికి పొత్తు ఎంతో ఉపకరిస్తుందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మాజీ ఎమ్మెల్యే పులవర్తి రామాంజనేయులు తన అనుచరులతో కలిసి మంగళవారమిక్కడ జనసేన రాష్ట్ర కార్యాలయంలో పవన్ సమక్షంలో పార్టీలో చేశారు. ఆయన వీరందరికీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. 'ఒక అసాధ్యమైన, అసాధారణమైన రాజకీయ కలయికను రాష్ట్రంలో సాకారం చేయగల శక్తిని మీ అభిమాన బలమే నాకు అందించింది. గత ఎన్నికల్లో రెండు చోట్లా ఓడిపోయినా ప్రజల గుండెల్లో నాకు అత్యున్నత స్థానం ఇచ్చారు. ఆ బలంతోనే రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడుకోవాలనే తపనతో కేంద్ర పెద్దలను ఒప్పించి మరీ అసాధ్యంగా కనిపించిన పొత్తును సుసాధ్యం చేశాను' అని తెలిపారు. పొత్తులో భాగంగా జనసేన తీసుకున్న సీట్లపై చాలా రకాలుగా మాట్లాడుతున్నారని, 2019లో తాను ఒక్కచోట గెలిచినా ఇప్పుడు పరిస్థితి వేరుగా ఉండేదని చెప్పారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే జగన్‌తోపాటు జగన్ జలగలను ఏరిపారేద్దామని పిలుపిచ్చారు. ఇంకా ఏమన్నారంటే..

వ్యతిరేక ఓటు ఒక్కటీ చీలకుండా...

రాష్ట్ర భవిష్యత్ కోసం, వైసీపీ పాలనలో దశాబ్దాలు వెనక్కి వెళ్లిన ఆంధ్రప్రదేశ్‌కు దశ, దిశ చూపేందుకు మూడు పార్టీలు ఒకే వేదికపైకి వచ్చాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఒక్కటి కూడా చీలకుండా, బయటకు వెళ్లకుండా సంపూర్ణంగా ప్రజలంతా ఒకే తాటిపైకి రావాలని తీసుకున్న నిర్ణయమిది. ఒకడి దగ్గరే అధికారం, డబ్బు, అవినీతి, కిరాయి సైన్యం, అరాచకం ఉంటే ప్రజలెవరూ బతకలేరు. రాష్ట్రంలో పెరిగిపోయిన క్రిమినల్ చెట్లను కూకటివేళ్లతో పెకిలించాలి. మే 15లోపు మనం కలలు కన్న వైసీపీ విముక్త ఏపీ దగ్గరలోనే ఉంది. రానున్న నెల రోజులపాటు కష్టపడి పనిచేసి మన కలను సాకారం చేసుకుందాం. రౌడీల చేతిలో రాజ్యం ఉండకూడదనే నినాదంతో వైసీపీని తరిమేద్దాం.

> భీమవరానికి వచ్చి శాశ్వతంగా ఉండేందుకు 2019 నుంచీ ప్రయత్నిస్తున్నాను. కానీ అక్కడ ఎమ్మెల్యేకు భయపడి స్థలం లేదా ఇల్లు అమ్మడానికి, లీజుకు ఇవ్వడానికి స్థానికులు భయపడుతున్నారు. నాలాంటి వ్యక్తికే ఇలా ఉంటే సాధారణ ప్రజల పరిస్థితి ఊహించుకోవచ్చు. - పవన్ కల్యాణ్

కుబేరుల పట్టణంలో..

రాష్ట్రంలో కుబేరులు ఎక్కువగా ఉండే పట్టణంగా భీమవరానికి పేరు ఉంది. అలాంటి పట్టణాన్ని 2019లో ఒక రౌడీ (వైసీపీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్) చేతిలో పెట్టారు. వీధి రౌడీని ఎమ్మెల్యేను చేస్తే ఎలా ఉంటుందో అక్కడి ప్రజలు ఇప్పుడు స్వయంగా తెలుసుకుంటున్నారు. భీమవరంలో ఈ ఎమ్మెల్యే వల్ల అక్రమ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెరిగిపోయాయి. రామాంజనేయుల్ని ఒక్కటే కోరుతున్నాను. భీమవరంలో నాకో స్థలం చూపిస్తే కొనుక్కుంటాను. అక్కడే కార్యాలయం ఏర్పాటు చేసుకుందాం. అక్కడి రౌడీయిజాన్ని కట్టడి చేయడంపై దృష్టిపెడతాను. భీమవరాన్ని గుండెల్లో పెట్టుకుంటాను. అది నాది.. దానిని వదలను. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఇలాంటి వ్యక్తిని ఎన్నుకోకుండా ధైర్యంగా పనిచేద్దాం. గత ఎన్నికల్లో గ్రంధి శ్రీనివాస్ మా బంధువు.. మా కులపు వ్యక్తి అనే కోణంలో చాలామంది అతడికి మద్దతుగా నిలిచారు. రాజకీయాల్లో యుద్ధం మాత్రమే ఉంటుంది. బంధుత్వం ఉండదు. మన బంధువయినా ప్రజలపై అన్యాయంగా దాడులు చేస్తే అతడికి మద్దతుగా ఉంటామా..? శ్రీనివాస్ చేసే తప్పుడు పనులు కులానికి చుట్టుకునే దుస్థితి వచ్చింది. వైసీపీ ఎన్ని కోట్లు కుమ్మరించినా ఈసారి ఈ సీటు కొట్టి తీరుతాం. ప్రతిసారి కోకిలలా సిద్ధం.. సిద్ధం అంటున్న జగన్‌కు మరచిపోలేని యుద్ధం ఇద్దాం. యుద్ధం అంతిమ లక్ష్యం రాజకీయ ప్రక్షాళన, ప్రభుత్వ మార్పు.



పవన్ సమక్షంలో చేరిన మాజీ ఎమ్మెల్యే పులవర్తి రామాంజనేయులు





ద్వారకాతిరుమలలో మాంసాహార భోజనం వడ్డిస్తున్న హోంమంత్రి వనిత; బహుమతులు అందుకుని బయటకు వస్తున్న సిబ్బంది

ఆత్మీయ సమావేశాల పేరుతో ప్రలోభాలు


- ఓటర్లను ఆకట్టుకునే పనిలో హోంమంత్రి వనిత

ద్వారకాతిరుమల, మార్చి 12: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే తాయిలాల పంపిణీలకు వైసీపీ నేతలు శ్రీకారం చుట్టారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలో హోంమంత్రి తానేటి వనిత కొద్దిరోజులుగా ఈ పంపిణీని ముమ్మరంగా సాగిస్తున్నారు. సోమవారం రాత్రి ద్వారకాతిరుమలలోని శేషాచలంపై ఉన్న కాపు కల్యాణమండప ఆవరణలో అంగన్వాడీ, వలంటీర్లు, ఆశా కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిపారు. వారికి మాంసాహార భోజనాలతోపాటు, వెయ్యి మందికి హాట్ బాక్సులు, ఫ్లాస్కులు అందజేశారు.

ఉద్యోగులకు ఎమ్మెల్యే ద్వారంపూడి విందు

కాకినాడ కార్పొరేషన్, మార్చి 12: ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా నిలబడాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఉద్యోగులను కోరారు. ఏపీఎన్జీవో ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం పేరిట మంగళవారం కాకినాడ డీ కన్వెన్షన్‌హాల్‌లో సమావేశం జరిగింది. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, ఏపీఎన్జీవోలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ద్వారంపూడి మాట్లాడుతూ మరోసారి వైసీపీ ప్రభుత్వం ఏర్పడేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. సమావేశం అనంతరం ఘుమఘుమలాడే వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. సుమారు 600 మంది ఉద్యోగులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

సచివాలయాల్లో వైసీపీ కార్యక్రమాలు



శ్రీసత్యసాయి జిల్లా ముష్టూరు సచివాలయంలో సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బత్తలపల్లి, మార్చి 12: శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలోని పలు సచివాలయాల్లో మంగళవారం వైసీపీ శ్రేణులు, వలంటీర్లు.. 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' కార్యక్రమాన్ని నిర్వహించారు. బత్తలపల్లి-1,2, ముష్టూరు, మాల్యవంతం, పోట్లమర్రి, దంపెట్ల, అప్రాచెరువు, సంజీవపురం, ఓబులాపురం సచివాలయాల్లో వైసీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, సచివాలయాల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంగల్‌రెడ్డి, ఆ పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు కలిసి సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు.

అధికారిక కార్యక్రమాల్లో మంత్రి జోగి తనయుడు

ఉయ్యూరు/పెనమలూరు, మార్చి 12: కృష్ణాజిల్లా పెడన ఎమ్మెల్యే, మంత్రి జోగి రమేశ్ ఈసారి పెనమలూరు నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన కుమారుడు జోగి రాజీవ్ ఈ నియోజకవర్గంలోని అధికారిక కార్యక్రమాలన్నీ తానై నడిపిస్తున్నారు. మంగళవారం ఆకునూరులో జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు సర్పంచ్‌తో కలిసి రాజీవ్ పట్టాలు పంపిణీ చేశారు. పోరంకిలో సీసీ రోడ్డు, శాలిపేట ఆర్చి నిర్మాణానికి శంకుస్థాపనచేశారు. అధికారులు కూడా ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి మంత్రి గారి తనయుడితో కార్యక్రమాలు జరిపించారు.



ఆకునూరులో జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న జోగి రమేశ్ కుమారుడు

టీచర్లకు 'నగదు' బదిలీలు!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలకు ముందు కోట్ల రూపాయల వ్యాపారం మొదలుపెట్టింది. ఇందులో ఓ కీలక నేత, కొందరు అధికారులు ఉన్నట్లు టీచర్లు చెబుతున్నారు. సుమారు 1400 మందికి నేడో, రేపో ఉత్తర్వులు జారీచేసేందుకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. నాలుగైదు రోజుల్లో ఎన్నికల షెడ్యూలు వస్తుందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని భావిస్తోంది. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ, సచివాలయంలోని అధికారులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. గత వారంరోజుల నుంచి జరుగుతున్న ఈ కసరత్తు ఇప్పుడు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. ఎలాగూ అందరూ ఎన్నికల హడావిడిలో ఉంటారని, ఇప్పుడు బదిలీలు చేసినా రాద్ధాంతం అయ్యే అవకాశం లేదనే ఉద్దేశంతో ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు అర్థమవుతోంది.

ముడుపులన్నీ ఆ నేతకే....

అధికార పార్టీలో ఓ కీలక నేతకు ముడుపులన్నీ చేరుతున్నట్లు తెలిసింది. జగన్ ప్రభుత్వం అంటే పారదర్శకత అంటూ కబుర్లు చెప్పే ఆ నేత...ఇప్పుడు ముడుపుల బదిలీల విషయంలో మాత్రం ఎక్కడా వెనక్కి తగ్గడంలేదు. తన కార్యాలయంలో తాను చెప్పిన అధికారిని కలిసిన వారికే బదిలీలు అని తేల్చేస్తున్నారు. ఎవరైనా దరఖాస్తు చేసుకుని, ఆ అధికారిని కలవకపోతే మాత్రం ఆ వినతిపత్రాన్ని తీసి పక్కన పెడుతున్నారు. వాస్తవానికి గతేడాది టీచర్లకు సాధారణ బదిలీలు జరిగిన వెంటనే సిఫారసు బదిలీల పేరుతో కొంతమందికి కోరుకున్న చోట పోస్టింగ్‌లు ఇచ్చారు. అప్పట్లో ఉపాధ్యాయ సంఘాలు, టీచర్లు దీనిని వ్యతిరేకించినా ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా 'ఎమ్మెల్యేలు సిఫారసు చేస్తే కొన్ని బదిలీలు చేసుకోకూడదా? ఆ మాత్రం బదిలీలు కూడా చేసుకోలేకపోతే ప్రభుత్వంలో ఉండి ఏంటి ఉపయోగం?' అని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బహిరంగంగా వితండవాదం చేశారు. అంటే సిఫారసు బదిలీల పేరుతో అక్రమ బదిలీలు చేసుకోవచ్చని ముందుగానే ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నమాట. దీనికోసం గత నెలలో పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ నుంచి వివరాలు సేకరించారు. ఎక్కడా లిఖితపూర్వక ఆదేశాలు లేకుండా మౌఖిక ఆదేశాలతో డీఈవోల నుంచి వివరాలు తెప్పించుకున్నారు. ఇంత కాలం దానిపై వేచిచూసిన ఆ నేత, ఇప్పుడు ఎన్నికల హడావిడి ప్రారంభం కావడంతో ఉత్తర్వులు ఇవ్వాలని ఆదేశించారు.

అధికారుల ప్రమేయం

కీలక నేతతోపాటు కొందరు అధికారులు కూడా ముడుపుల వ్యవహారంలో తలదూర్చారు. కమిషనరేట్‌లోని ఓ అధికారి, సచివాలయంలోని ఓ అధికారికి బదిలీల బాధ్యతను అప్పగించగా, 'మాకేంటి' అంటూ వారూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు టీచర్లే చెబుతున్నారు. కీలక నేతకు ఇచ్చిన దాంట్లో 10శాతం అయినా ఇవ్వాలని ఓ అధికారి డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అంటే ఆ నేతకు రూ.5లక్షలు ఇస్తే, ఆ అధికారికి రూ.50వేలు ఇవ్వాలి. దాంతోపాటు మాకూ అంటూ సచివాలయంలోని అధికారీ ఇందులో జోక్యం చేసుకుంటున్నారని, టీచర్లు లబోదిబోమంటున్నారు.

హెచ్‌ఆర్ఏ కోసం...

వాస్తవానికి టీచర్ల బదిలీలకు గతంలో ఎప్పుడూ ఇంత పెద్దమొత్తంలో ముడుపులు సమర్పించుకోలేదు. కానీ ఎలాగైనా పట్టణ ప్రాంతాల్లోనే ఉండిపోవాలని పట్టుబట్టిన టీచర్లు ఎంతైనా ఇవ్వడానికి సిద్ధం అంటూ పోటీపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 10శాతం హెచ్‌ఆర్ఏ వస్తే, పట్టణ ప్రాంతాల్లో 16శాతం వస్తుంది. ఐదేళ్లపాటు ఈ హెచ్‌ఆర్ఏ లెక్కలు వేసుకుని మరీ ముడుపులు ఇస్తున్నారని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ సాగుతోంది. పట్టణాలు దాటి బయటకు వెళ్లడం ఇష్టంలేని వారు ఎంతైనా ఇస్తామంటూ పోటీపడటం వల్లే, ఇలా భారీగా ముడుపులు వసూలు చేస్తున్నారన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

మళ్లీ తనిఖీల వేట!

- గొట్టిపాటి బంధువు ఫ్యాక్టరీల్లో సోదాలు

బాపట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి)/మార్టూరు: పేరుకు మాత్రమే గ్రానైట్ ఫ్యాక్టరీలు, క్వారీలపై దాడులంటూ ఉత్తర్వులు... అంతా పారదర్శకం.. కక్షసాధింపులకు తావులేదంటూ ప్రభుత్వం ప్రగల్భాలు.. అయితే, ఇవన్నీ ఉత్తమాటలేనని తేలిపోయింది. టీడీపీ మద్దతుదారులను టార్గెట్ చేసి వారి ఆర్థికమూలాలపై గురిపెట్టి తనిఖీల వ్యూహానికి తెరతీశారు. టీడీపీ అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ లక్ష్యంగా మళ్లీ తనిఖీల వేట మొదలుపెట్టారు. బాపట్ల జిల్లా మార్టూరు మండలం జొన్నతాళి సెంటర్ వద్ద ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీలో మంగళవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ ఫ్యాక్టరీ యజమాని రవికమార్ బంధువు కామేపల్లి లక్ష్మీప్రసాద్. గతంలో రెండుసార్లు ఆయన ఫ్యాక్టరీలపై దాడులు చేశారు. ఐటీని ఉసిగొల్పారు. ఈ క్రమంలో ఆయన దాదాపు రూ. 2.5కోట్ల వరకు ప్రభుత్వానికి జరిమానా కూడా కట్టారని తెలుస్తోంది. అధికారులు మంగళవారం చేసిన దాడులు కూడా ఆయనకు సంబంధించిన ఫ్యాక్టరీలపైనే నిర్వహించారు. తనిఖీల నేపథ్యంలో అక్కడకు చేరుకున్న ఆ యజమాని అన్నింటిని వదిలేసి తన వాటినే ఎందుకు లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారని ప్రశ్నించగా, పైనుంచి వచ్చిన జాబితా ఆధారంగానే తాము దాడులు చేస్తున్నామని అధికారులు చెప్పడం గమనార్హం. ఈ తనిఖీల్లో కృష్ణాజిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ ప్రతాప్‌రెడ్డి, నెల్లూరు విజిలెన్స్ ఏడీ బాలాజీనాయుడు నేతృత్వంలోని రెండు బృందాలు పాల్గొన్నాయి. 2గ్రానైట్ ఫ్యాక్టరీలు, 5క్వారీల్లో తనిఖీలు జరపడానికి వచ్చినట్టు లక్ష్మీప్రసాద్‌కు నోటీసు ఇచ్చారు. కామేపల్లి ఫ్యాక్టరీల్లో తనిఖీలు జరపడం గత 3నెలల్లో ఇది మూడోసారి.

ఆ ఐదుగురే లక్ష్యంగా..: వందల సంఖ్యలో ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీలు, పదుల్లో ఉన్న క్వారీలను వదిలిపెట్టి, ఎంపిక చేసుకున్న ఐదుగురి లక్ష్యంగానే ఈ దాడులకు వైసీపీ పెద్దలు వ్యూహరచన చేశారని సమాచారం. బుధవారం మరో ఇద్దరు లక్ష్యంగా తన కక్షసాధింపును కొనసాగించనుందని తెలుస్తోంది. అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్ లక్ష్యంగా ప్రభుత్వం అనేక రకాలుగా వేధింపులకు దిగిన సంగతి తెలిసిందే. వందల కోట్లు జరిమానాల రూపంలో చెల్లించాల్సి వచ్చినా ఎమ్మెల్యే పోరుబాట వీడలేదు. ఇప్పుడు ఆయన బంధువులు, అనుచరులపై కక్షసాధింపులకు దిగడం వేధింపులకు పరాకాష్ఠగా అభిప్రాయపడుతున్నారు. ఎమ్మెల్యే రవికుమార్ లక్ష్యంగా గతంలో జరిగిన దాడులయితేనేమి, తాజాగా పర్చూరులో మరో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లక్ష్యంగా చేసిన వ్యవస్థల దుర్వినియోగమయితేనేమి, ప్రస్తుతం ఎమ్మెల్యే రవి బంధువుతో పాటు మరి కొంతమంది టీడీపీ మద్దతు దారులను లక్ష్యంగా చేసుకోవడమయితేనేమీ. తాడేపల్లి పెద్దలే కీలకంగా వ్యవహరిస్తున్నారనేది కాదనలేని సత్యం. ప్రభుత్వం ఓవైపు టీడీపీ సానుభూతిపరులే లక్ష్యంగా దాడులు చేస్తూ, మరోవైపు గ్రానైట్ యజమానులలో ఉన్న ఐక్యతను దెబ్బతీసే రాక్షస క్రీడకు పూనుకున్నది. తనను వేడుకుంటే తప్ప ఈ దాడుల పరంపర ఆగదని అద్దంకి వైసీపీ నేత హుకుం జారీ చేశారని తెలుస్తోంది. ఇంకోవైపు గ్రానైట్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సీఎంవో బాట పట్టినట్లు సమాచారం.



సదస్సులో ప్రసంగిస్తున్న ఆంధ్ర యూనివర్సిటీ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ పాలకుల 'జగన్ భజన'

- 'విజన్ విశాఖ' పేరుతో బీచ్ రోడ్డులో సదస్సు
- తపస్సు చేయకుండానే వరం ఇచ్చారన్న వీసీ ప్రసాదరెడ్డి

విశాఖపట్నం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పాలకులు ముఖ్యమంత్రి జగన్ భజనలో మునిగితేలుతున్నారు. కొద్దిరోజుల కిందట 'విజన్ విశాఖ' పేరుతో సీఎం విడుదల చేసిన డాక్యుమెంట్‌పై విద్యార్థులకు బ్రెయిన్‌వాష్ చేయడానికి బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో మంగళవారం సదస్సు నిర్వహించారు. వర్సిటీలోని వివిధ కళాశాలల విద్యార్థులను సదస్సుకు తరలించారు. అనుబంధ కళాశాలల అధికారులూ హాజరుకావాలంటూ ఫోన్లు చేశారు. సదస్సులో వైస్ చాన్సలర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ...గడిచిన నాలుగేళ్లలో విశాఖలో అద్భుతాలు జరిగాయని చెప్పుకొచ్చారు. తాను 41ఏళ్లుగా విశాఖలో ఉంటున్నానని, నాలుగేళ్ల కిందటి వరకూ రోజూ సాయంత్రం విద్యుత్ కోతలు ఉండేవని, నాలుగేళ్ల నుంచి విద్యుత్ కోతలే లేవని ఊదరగొట్టారు. తపస్సు చేయకుండానే సీఎం 'విజన్ విశాఖ' పేరుతో వరం ఇచ్చారని చెప్పుకొచ్చారు. సీఎం విజన్ తనను మోటివేట్ చేసిందని, తానేమి చేయగలనని ఆలోచించి ఈ సదస్సును ఏర్పాటు చేశానని తెలిపారు. చదువుతోపాటు విశాఖకు ఏం చేయగలమో విద్యార్థులు ఆలోచించాలని ఉద్బోధించారు. అనుబంధ కళాశాలల్లోనూ ఈ తరహా సదస్సులు నిర్వహించనున్నట్టు వీసీ తెలిపారు.

అంగన్వాడీలకు ఒంటిపూట ఇవ్వండి

- 42 రోజుల సమ్మె కాలం వేతనాలు చెల్లించండి
- ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత దృష్ట్యా అంగన్వాడీ సెంటర్లను మధ్యాహ్నం వరకు నడపాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. మంగళవారం ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి, డైరెక్టర్‌కి వినతిపత్రం అందజేసినట్లు తెలిపింది. 'ప్రీస్కూల్ పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు ఎండ తీవ్రత వల్ల ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి మార్చి నుంచి జూన్ వరకు అంగన్వాడీ సెంటర్లను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.00గంట వరకు నడపాలని యూనియన్ డిమాండ్ చేసింది. గతంలో అంగన్వాడీ సంఘాలతో జరిగిన సమ్మె ఒప్పందంలో అంగీకరించిన అంశాలకు సంబంధించిన జీవోలు వెంటనే ఇవ్వాలని యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. 42 రోజుల సమ్మె కాలం వేతనాలు ఇవ్వాలని కోరారు.

18 నుంచి ఒంటిపూట బడులు!

- అదే రోజు నుంచి టెన్త్ పరీక్షలు.. వెంకట్రామిరెడ్డి పేరుతో ప్రకటన
- ఆయనకేం సంబంధమని టీచర్ల ప్రశ్న

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఒంటిపూట బడులు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఏటా మార్చి 15 నుంచే ఒంటిపూట బడులు ప్రారంభిస్తుంటే, ఈ ఏడాది మూడు రోజులు ఆలస్యంగా పెట్టాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. అయితే అధికారికంగా ఈ విషయాన్ని పాఠశాల విద్యాశాఖ ప్రకటించలేదు. విచిత్రంగా ఒంటిపూట బడులపై సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి పేరుతో ప్రకటన వెలువడింది. ఉపాధ్యాయ సంఘాల వాట్సాప్ గ్రూపుల్లో ఆయన ఈ సమాచారాన్ని షేర్ చేశారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒంటిపూట బడులతో సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడికి ఏం సంబంధం అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఆయన వైసీపీ కార్యకర్తలా పని చేస్తున్నారని, ప్రభుత్వ ప్రకటనలు ఆయన తెలియజేయడమేంటంటూ ఆక్షేపిస్తున్నారు. కాగా, 18 నుంచే టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

తీరప్రాంత పరిశోధన కేంద్రం ప్రారంభం


కొత్తగా నిర్మించిన పరిశోధన కేంద్రం

విశాఖపట్నం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తుఫాన్లు, సముద్రంలో వచ్చే అలజడులు, తీరప్రాంతాల కోత, తదితర అంశాలపై అధ్యయనం చేసేందుకు డాల్ఫిన్ నోస్‌పై రూ.62 కోట్లతో నిర్మించిన పరిశోధన కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖకు అనుబంధ సంస్థ అయిన నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ (ఎన్‌సీసీఆర్) దీనిని ఏర్పాటుచేసింది. ఆ శాఖ మంత్రి కిరణ్ రిజుజు పరిశోధన కేంద్రాన్ని వర్చ్యువల్‌గా ప్రారంభించారు. సుమారు 5.5 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన భవనాన్ని ఏడాది కాలంలోనే పూర్తిచేయడం గమనార్హం. ఇందులో పరిశోధన కేంద్రంతోపాటు శిక్షణ కేంద్రం, వర్క్‌షాప్‌ల నిర్వహణ, ఆడిటోరియం, సెమినార్ హాలు, హాస్టల్ భవనాలు ఉన్నాయి. సముద్రం లోపల, తీరంలో జరుగుతున్న మార్పులను ముందుగానే గుర్తించి, వాటికి తగిన సూచనలు చేయడం, పరిష్కార మార్గాలు చూపించడానికి ఇది ఉపయోగపడుతుందని ఆ శాఖ సెక్రటరీ ఎం.రవిచంద్రన్ తెలిపారు. ఎన్‌సీసీఆర్ డైరెక్టర్ ఎంవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తిరుపతి ఎయిర్‌పోర్టులో శ్రీవాణి కౌంటర్ పునఃప్రారంభం

తిరుమల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విమానయాన ప్రయాణికుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్టు డొనేషన్ కౌంటర్ తిరుపతి ఎయిర్‌పోర్టులో బుధవారం నుంచి పునఃప్రారంభం కానుంది. దేశవిదేశాల నుంచి తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే వారి కోసం గతంలో తిరుపతి విమానాశ్రయంలో రోజూ వంద శ్రీవాణి టికెట్లను ఆఫ్‌లైన్ పద్ధతిలో టీటీడీ జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే విమానాశ్రయంలో శ్రీవాణి టికెట్ల జారీకి అనుమతిలేని కారణంగా గతేడాది డిసెంబరు 16వ తేదీ నుంచి కౌంటర్‌ను తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనానికి మార్చారు. బోర్డింగ్ పాస్ సమర్పించిన వారికి ఈ టికెట్లను కేటాయిస్తూ వచ్చారు. తాజాగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ నుంచి అనుమతులు లభించిన నేపథ్యంలో తిరిగి బుధవారం నుంచి తిరుపతి విమానాశ్రయంలోనే టికెట్లు జారీ చేసేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది.

మత్స్యశాఖలో కీచక పర్వం

- జాయింట్ డైరెక్టర్ లైంగిక వేధింపులు?
- పోలీసులను ఆశ్రయించిన ఉద్యోగిని

మహారాణిపేట (విశాఖపట్నం), మార్చి 12: మహిళా ఉద్యోగిని పట్ల మత్స్యశాఖ అధికారి లైంగిక వేధింపులకు పాల్పడినట్టు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం మేరకు.. వన్‌టౌన్ ఫిషింగ్ హార్బర్ సమీప మత్స్యశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి ఈ నెల తొమ్మిదో తేదీన ఆరోగ్యం బాగోలేదంటూ రెండు గంటలు పర్మిషన్ తీసుకుని ఇంటికి వెళ్లారు. కాసేపు విశ్రాంతి తీసుకుని మళ్లీ విధులకు హాజరయ్యారు. ఆ విభాగం జాయింట్ డైరెక్టర్ లాల్ మహ్మద్ సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆమెను తన చాంబర్‌కు పిలిచి కూర్చోమన్నారు. ఇప్పుడు ఆరోగ్యం ఎలా ఉందంటూ ఒంటిపై చెయ్యి వేసి అసభ్యకరంగా ప్రవర్తించడంతో హతాశురాలైన ఆమె.. అతడిని ప్రతిఘటించి చాంబర్ నుంచి బయటకు వచ్చేశారు. అయితే, ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని, ఉద్యోగం నుంచి తొలగిస్తానంటూ జేడీ హెచ్చరించారు. ఈ ఘటనపై ఆమె సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు అధికారి లాల్ మహ్మద్ గతంలో పలుమార్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, భరించలేకే పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆమె తెలిపారు.

అత్యవసర రన్‌వే సిద్ధం

- కొరిశపాడు-రేణంగివరం వద్ద అధికారుల పరిశీలన
- వచ్చేవారం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు!


అత్యవసర రన్‌వేను పరిశీలిస్తున్న నేషనల్ హైవే, ఎయిర్‌ఫోర్స్ అధికారులు

మేదరమెట్ల, మార్చి 12: కొరిశపాడు-రేణంగివరం మధ్య 16వ నంబరు జాతీయ రహదారిలో నిర్మించిన అత్యవసర రన్‌వే ప్రారంభానికి సిద్ధమైంది. ఈ మేరకు నెల్లూరు, ఒంగోలు హైవే పీడీలు దేవేశ్ గోయల్, విద్యాసాగర్, ఎయిర్‌ఫోర్స్ అధికారులు మంగళవారం ఈ రన్‌వేను పరిశీలించి.. ప్రారంభోత్సవానికి చేయాల్సిన ఏర్పాట్ల గురించి పోలీసులతో చర్చించారు. ఈ నెల 17, 18వ తేదీల్లో విమానాలను ఇక్కడ ల్యాండింగ్ చేసి దీన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ మేరకు ఢిల్లీలోని ఎయిర్‌ఫోర్స్ అధికారులు కేంద్రప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. దేశవ్యాప్తంగా 12 చోట్ల జాతీయ రహదారులపై అత్యవసర రన్‌వే (ఎమర్జెన్సీ రన్‌వే)లను నిర్మించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కొరిశపాడు-రేణంగివరం మధ్య శింగరాయకొండ వద్ద సుమారు రూ.80 కోట్ల వ్యయంతో 4.1 కిలోమీటర్ల పొడవున ఈ రన్‌వేను నిర్మించారు. గతేడాది డిసెంబరు 29న నాలుగు యుద్ధ విమానాలు, ఒక రవాణా విమానం ఈ రన్‌వేపై ట్రయల్స్ వేశాయి. ఆ తర్వాత ఇది విమానాలు దిగడానికి అనుకూలంగా ఉందని ఎయిర్‌ఫోర్స్ అధికారులు, పైలట్‌లు నిర్ధారించారు. కాగా, ఈనెల 17న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిలకలూరిపేటలో జరిగే బహిరంగ సభకు వస్తున్నందున, అదే రోజున ఆయన రన్‌వేను ప్రారంభిస్తారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.

కొత్త వందే భారత్ రైళ్లు ప్రారంభం

- జాతికి అంకితం చేసిన ప్రధాని నరేంద్రమోదీ
- ఏలూరులో రైల్వే స్టేషన్ల ఆధునీకరణకు శంకుస్థాపన


భువనేశ్వర్ బయలుదేరిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్

విశాఖపట్నం, ఏలూరు క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కొత్త వందే భారత్ రైళ్లు మంగళవారం ప్రారంభమయ్యాయి. వీటిని వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య ఒక రైలును, సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య మరో వందే భారత్ రైలును ప్రారంభించారు. అదేవిధంగా వాల్తేరు డివిజన్‌లో ఇప్పటివరకు పూర్తయిన డబ్లింగ్ పనులను, మూడో లైన్ పనులను, విశాఖ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఏటికొప్పాక బొమ్మల స్టాల్‌ను ప్రధాని ప్రారంభించారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం జయంతిపురంలో రామ్‌కో సిమెంట్స్‌కు ముడిసరుకు రవాణా చేసే.. గతి శక్తి కార్గో టెర్మినల్ ప్రాజెక్టును కూడా మోదీ ప్రారంభించారు. వాల్తేరు డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ నేతృత్వంలో జరిగిన రైళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పద్మశ్రీ ఆదినారాయణరావు, పద్మశ్రీ కూటికుప్పల సూర్యారావు, ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఏలూరు రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్డు ప్రాంతంలోని పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపనలు చేయగా, ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు.

తిరుత్తణి- తిరుపతి అనుసంధానం

- పవిత్ర నగరాల మధ్య రవాణా మెరుగుదలకు భారీ విస్తరణ పనులకు శ్రీకారం
- ఏపీ/తమిళనాడు సరిహద్దు నుంచి పుత్తూరు వరకు
- 20 కి.మీ.మేర రెండు లేన్లను నాలుగు లేన్లుగా విస్తరణ
- రూ. 1,346 కోట్లు కేటాయించిన కేంద్రం..గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 12 : ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దుల నుంచి పుత్తూరు వరకు జాతీయ రహదారి 716 పరిధిలో 20.03 కిలోమీటర్ల మేర ఉన్న రెండు లేన్ల మార్గాన్ని నాలుగు లేన్లుగా విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పనుల కోసం రూ. 1,346.81 కోట్లు కేటాయించింది. ఈ విషయాన్ని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ 'ఎక్స్' వేదికగా మంగళవారం ప్రకటించారు. విస్తరణ పనులు చేపట్టడం ద్వారా ఈ మార్గాన్ని పూర్తి స్థాయి కారిడార్‌గా అభివృద్ధి చేయడమే ప్రాజెక్టు లక్ష్యమన్నారు. పవిత్ర నగరాలు తిరుత్తణి- తిరుపతిని అనుసంధానించడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనున్నదన్నారు. కాగా, జాతీయ రహదారి 913 పరిధిలో ఎనిమిది చోట్ల విస్తరణ పనులు చేపట్టడం కోసం రూ. 6,621. 6 కోట్లు మంజూరు చేసినట్టు మంత్రి తెలిపారు. మొత్తం 265.49 కిలోమీటర్ల మేర ఈ పనులు కొనసాగుతాయని తెలిపారు.

జగన్‌ను ఓడిస్తేనే స్థానిక సంస్థలకు మనుగడ: వైవీబీ

కడప(రూరల్), మార్చి 12: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని, ఆయన సారధ్యంలోని వైసీపీని ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిస్తేనే స్థానిక సంస్థలకు మనుగడ ఉంటుందని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, కౌన్సిలర్లకు, కార్పొరేటర్లకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం, పంచాయతీరాజ్ చాంబర్స్ ఆధ్వర్యంలో మంగళవారం కడప కలెక్టరేట్ ఎదుట సర్పంచ్‌లు ధర్నా చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. సీఎం జగన్మోహన్‌రెడ్డి గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులు, విధులు అధికారాలను సీఎం జగన్ దొంగిలించి తీరని అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే పల్లెలు శిధిలమైపోయి గ్రామీణ ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు అన్యాయమైపోతారన్నారు. డీఆర్‌వో గంగాధర గౌడ్‌ను కలిసి 16 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

బీజేపీ కార్యకర్తపై వైసీపీ నాయకుల దాడి


గాయపడ్డ చంద్ర

పెనుకొండ టౌన్, మార్చి 12: శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్త చంద్రపై వైసీపీ నాయకులు సోమవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. సోమందేపల్లి స్నేహలత నగర్‌కు చెందిన చంద్ర, తన స్నేహితులతో కలిసి తాజా రాజకీయాల గురించి మాట్లాడుతూ ఇక వైసీపీ పనైపోయిందని..బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిదే విజయం అని వ్యాఖ్యానించాడు. దీంతో అక్కడే ఉన్న వైసీపీ కార్యకర్త శ్రీనివాసులు వాగ్వాదానికి దిగాడు. తన మిత్రుడు, వార్డు మెంబర్ గాజుల శ్రీనివాసులుకు ఫోన్ చేసి పిలిపించాడు. ఇద్దరూ కలిసి చంద్రను చితకబాదారు. బాధితుడు కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. వైసీపీ నాయకుల దెబ్బలకు గాయపడి, అపస్మారక స్థితిలో పడి ఉన్న చంద్రను హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అతిసమీపంలో సార్వత్రిక ఎన్నికలు, ఆర్నెల్లలో అసెంబ్లీ ఎన్నికలు ఉండగా హర్యానా రాజకీయం అనూహ్య వేగంతో మారిపోయింది. రాష్ట్రశాఖ అధ్యక్షుడుగా ఉన్న నాయబ్‌సింగ్ సైనీ మంగళవారం మనోహర్‌లాల్ ఖట్టర్ స్థానంలో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. దేవీలాల్ మునిమనవడు దుష్యంత్‌చౌతాలా నేతృత్వంలోని జన్‌నాయక్ జనతాపార్టీ (జేజేపీ)తో ఐదేళ్ళుగా సాగుతున్న పొత్తును తెంపేసుకుంటే తప్ప రాజకీయంగా మేలు జరగదని బీజేపీ అనుకుంది. అసెంబ్లీలో పదిమంది సభ్యులున్న ఆ పార్టీతో తెగదెంపులు చేసుకొని, ఆ లోటు భర్తీకోసం ఏడుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల్లో ఆరుగురి మద్దతు తెచ్చుకుంది. మిత్రపక్షాన్ని గెంటేసిన తరువాత కూడా మిగిలిన ఆర్నెల్ల కాలాన్ని నిక్షేపంగా నెట్టుకురాగలిగే సంఖ్యాబలం సాధించుకుంది కనుక, భాగస్వామి పార్టీ పోయినప్పటికీ, ముఖ్యమంత్రిగా ఖట్టర్ నిక్షేపంగా కొనసాగవచ్చు. కానీ, అదే పాతమంత్రులు కొందరు తిరిగి ప్రమాణస్వీకారం చేసినప్పటికీ, ఖట్టర్ స్థానంలోకి సైనీరావడం వెనుక చాలా లెక్కలూ వ్యూహాలూ ఉన్నాయి.

లోక్‌సభ ఎన్నికల సీట్లపంపకాల్లో తేడాలు వచ్చి రెండుపార్టీలూ వేరుపడ్డాయట. 2019లో బీజేపీ పది లోక్‌సభస్థానాలు గెలుచుకుంటే, ఈ ఎన్నికలకు కాస్తంత ముందు చౌతాలా కుటుంబంలో వచ్చిన విభేదాలతో ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్‌డీ)నుంచి దుష్యంత్ వేరుపడ్డారు. అప్పటి లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కస్థానం కూడా ఆయన గెలవలేదు. సీట్ల పంపకాల వివాదం ఇంకా కొలిక్కిరాకముందే ఒక్కసీటు కూడా ఇవ్వబోమని బీజేపీ తేల్చేయడంతో, జాట్ల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో తనకు ఇంకా కొన్నింటిలో ఎంతోబలం ఉన్నదని నమ్ముతున్న దుష్యంత్ వేరుపడినట్టు కనిపిస్తోంది. హర్యానాలో జాట్లు 27శాతం వరకూ ఉంటారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అత్యధికశాతం బీజేపీ పక్షాన నిలబడ్డారు. మోదీమీద అభిమానంతోపాటు, పుల్వామా రగల్చిన

హర్యానా వ్యూహం

దేశభక్తి వంటివి బలంగా పనిచేశాయి. కానీ, ఈ మారు రైతు ఆందోళనలు, మహిళా మల్లయోధుల నిరసనలు, మద్దతు ధర ఉద్యమాలు సహా చాలా కారణాలతో అధికశాతం జాట్లు బీజేపీ పట్ల అసంతృప్తిగా ఉన్నారని, ఖట్టర్ మీద మరీ కోపంగా ఉన్నారని తేలిపోయింది. జాట్లు ఈ మారు కాంగ్రెస్ వైపు చూస్తున్న నేపథ్యంలో బీజేపీ–జేజేపీ కలిసి సాగితే ఇరువురికీ నష్టమే కనుక విడిపోయి బాగుపడాలని రెండు పార్టీలూ అనుకొని ఉంటాయి. కాంగ్రెస్, ఐఎన్ఎల్‌డి, జేజేపీ మధ్య జాట్ల ఓట్లు చీలిపోయిన పక్షంలో మిగతా అగ్రకులాల, ఓబీసీల ఓట్లతో తాను లబ్ధిపొందవచ్చునని, ఓబీసీల ఓట్లు సంపాదించడానికి కొత్తముఖ్యమంత్రి ఉపకరిస్తారని బీజేపీ భావించి గత అక్టోబర్‌లో రాష్ట్రశాఖ అధ్యక్షుడిగా నియమితుడైన వ్యక్తిని ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రిని చేసింది. రాహుల్‌గాంధీ హామీ ఇస్తున్న కులగణన ఓబీసీలను ప్రభావితం చేస్తున్నందున, దానికి విరుగుడుగా సైనీని బీజేపీ ముందుకు తెచ్చి ఉండవచ్చు. నాయబ్‌సింగ్ వచ్చినంతమాత్రాన ఓబీసీలంతా బీజేపీకి ఓట్లువేయరన్న విమర్శలను అటుంచితే, హర్యానాలో సైనీలు 8శాతం వరకూ ఉన్నారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ మాదిరిగా ఈయన కూడా యూపీ, బీహార్ సహా చాలా ఉత్తరాది రాష్ట్రాల్లో ఓబీసీలను ఆకర్షించేందుకు బీజేపీకి ఉపకరించవచ్చు.

ఖట్టర్ ప్రభుత్వం మీద ప్రజావ్యతిరేకత ఏ స్థాయిలో ఉన్నదో ఈ పరిణామాలు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ఆర్నెల్లముందే ఆయనను బీజేపీ అధిష్ఠానం పక్కకు తప్పించింది. కర్నాల్‌నుంచి లోక్‌సభకు పోటీచేయించి, అసెంబ్లీ ఎన్నికలబరిలో ఆయన లేకుండా జాగ్రత్తపడుతోంది. అప్రదిష్టపాలైన గత ప్రభుత్వం ఛాయలను పూర్తిగా చెరిపివేసి, కొత్తముఖాన్ని ముందుపెట్టి విజయం సాధించాలని అనుకుంటోంది. బీజేపీ–జేజేపీ మధ్య సీట్ల ఒప్పందం కొలిక్కివచ్చిందని, విపక్షాల ఓట్లను చీల్చి తిరిగి తాము అధికారంలోకి వచ్చేందుకు అది ఉపకరిస్తుందని కొద్దిరోజుల క్రితమే ఖట్టర్ ప్రకటించారు. ఇప్పుడు ఆయనే బరిలో లేకుండాపోయారు. కొందరు ఎమ్మెల్యేలకు తిరిగి టిక్కెట్ ఇవ్వకుండా ప్రజావ్యతిరేకతను చల్లార్చేందుకు అధికారపక్షాలు ప్రయత్నిస్తుంటాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హర్యానాలో ముఖ్యమంత్రినే మార్చివేయడం బీజేపీ తన ఓటమిని అంగీకరించడమేనని కాంగ్రెస్ అంటోంది.

పరిశోధనా తేజోమూర్తి

పరిశోధకులు రెండు రకాలు. నానా గ్రంథాలయాలు దర్శించి, అనేకానేక పుస్తకాలు పరిశీలించి, పటిష్ఠమైన పరిశోధనా వ్యాసం సమర్పించి పీహెచ్‌డీ లేదా డి.లిట్. పట్టాలు పొందేవాళ్ళు మొదటి రకం. తాము స్వీకరించిన విషయం గురించి సామగ్రి సేకరించడానికై కాళ్లకు బలపం కట్టుకొని పూరూవాడా, నగరం మహానగరం, సందు గొందులు తిరిగీ తిరిగీ విషయసేకరణ చేస్తూ, పరిశోధనాంశానికి సంబంధించిన బీదాబిక్కీ, దేశ దిమ్మర్ల మధ్యనే రోజులు నెట్టుకొస్తూ వాళ్ల కష్టాలు కడగండ్లను అక్షరబద్ధం చేస్తూ ఆ పీడిత, తాడిత, అనాదృత వర్గ ప్రజల సముద్ధరణకు జీవితాన్నే సమర్పించిన పరిశోధకులు రెండో రకం. ఈ శ్రేణికి చెందినవాళ్లు నూటికో కోటికో ఒకరిద్దరు మాత్రమే ఉంటారు. అలాంటి అపూర్వమైన, అద్వితీయురాలైన పరిశోధకురాలే డా. వకుళాభరణం లలిత. పగలనకా రాత్రనకా ఎండనకా వాననకా, ఊరనకా వాడనకా పరిశ్రమించి, పరిశోధన పసిడిని వెలికి తీసిన ఘనపాఠి డా. వకుళాభరణం లలిత.



ఆమె తెలుగు, సమాజశాస్త్రం, సార్వజనిక పాలనా విధానాల్లో ఎం.ఏ. పట్టాలు పొందింది. కావలి జవహర్ భారతి కళాశాలలో రాజకీయశాస్త్రం బోధించింది. తెలుగు అకాడమీలో కొన్నేళ్లపాటు చరిత్ర, సమాజశాస్త్ర, గిరిజన, ఆదివాసీల చరిత్రల్లో ప్రగాఢమైన పరిశోధన గ్రంథాలు వెలువరించి, ఇంగ్లీషు పాలనా శాస్త్ర పుస్తకాల్ని తెలుగులోకి అనువదించింది. ఇవన్నింటి కలపోతగా 'ది మేకింగ్ ఆఫ్ క్రిమినల్ ట్రైబ్స్: ప్యాటర్న్స్ అండ్ ట్రాన్సిషన్' అనే విషయం మీద విద్వత్ పూర్ణమైన సిద్ధాంత వ్యాసం రాసి కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి మానవశాస్త్రంలో పిహెచ్.డి. డిగ్రీ సంపాదించింది.

లలిత 1961లో వకుళాభరణం రామకృష్ణగారి అర్ధాంగి అయ్యింది. ఇద్దరూ 55ఏళ్లపాటు దాంపత్య జీవితం ఎంతో సామరస్యంగా గడిపి అర్ధనారీశ్వర్లుగా వర్ధిల్లి విద్యార్థిలోకానికి ఆరాధ్యులుగా పూజింపబడ్డారు.

లలిత వైదిక సంప్రదాయ కుటుంబంలో జన్మించినా, ఉదార ప్రవృత్తిగల పరిసరాల్లోనే చదువు సాములు సాగించారు. డా. రామకృష్ణ గారి సంస్కరణ భావజాలం ఆమె ఆలోచనాపరిధిని మరింత విశాలం చేసింది. కావలి జవహర్ భారతి కళాశాలలో ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రి, శ్రీరామ్ వేంకట భుజంగరాయశర్మ, ఎమ్. పట్టాభిరామరెడ్డి, కె.వి. రమణారెడ్డి లాంటి హృదయ సంపన్నుల, మేధావుల ఛత్రచ్ఛాయలో పెరిగి, బౌద్ధిక, మానసిక వైశాల్యాన్ని సంతరించుకొని, ఎంతో మంది విద్యార్థుల్ని తేజోమూర్తులుగా తీర్చిదిద్దిందామె.

డా. వకులాభరణం లలిత దృష్టి దక్షిణ భారతదేశంలోని ముఖ్యంగా ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, ఒడిస్సా, మహారాష్ట్రలోని గిరిజన, ఆదివాసీ, దళిత వర్గాల గురించి విస్తృతమైన, లోతైన పరిశోధనలు చేసి అమూల్యగ్రంథాలు వెలువరించింది. ఆమె సమాజంలో అట్టడుగున పడివున్న దేవదాసి, జోగిని, మాతంగి, యానాది, ఎరుకల, వేశ్యల, ఆడబాపల జీవితాల లోతుల్ని పరిశోధించి, ఉపన్యాసాల, వ్యాసాల, నివేదికల, పుస్తకాల ద్వారా వాళ్ల దయనీయ స్థితిగతుల్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చి, వాళ్ళ సముద్ధరణకు కృషి చేసింది. ఆమె ఇంగ్లీషులో 'జోగిని విమెన్ రిఫార్మ్, అండ్ డైనమిక్స్ ఆఫ్ సోషియల్ ఛేంజ్ ఇన్ సౌత్ ఇండియా' అనే పుస్తకాన్ని సుందర్ కొంపల్లితోను, గాంధిమల్లితో 'ట్రైబ్స్ అండర్ స్టిగ్మా ప్రాబ్లమ్స్ ఆఫ్ ఐడెంటిటీ', 'ఎడ్యుకేటింగ్ ట్రైబల్ చిల్డ్రన్: ఇష్యూస్, కన్సర్న్స్ అండ్ రెమిడీస్', 'ట్రైబల్ కల్చర్ ఇన్ ఆంధ్ర అండ్ తెలంగాణ ట్రెడిషన్ అండ్ ఛేంజ్' అనే పరిశోధనా గ్రంథాల్ని వెలువరించింది. కాగా ఎమ్. ప్రమీలా రెడ్డి సహకర్తృత్వంతో 'దేవదాసీ వ్యవస్థ' అనే పుస్తకాన్ని, గాంధిమల్లి, కొంపల్లి సుందర్‌తో కలిసి 'మాజీ నేరస్థ జాతులు: సమగ్ర పరిశీలన' అనే గ్రంథాన్ని ప్రచురించింది. ఆమె పరిశోధనా గ్రంథాలన్నీ అగాధ పరిశ్రమతో కూడుకొన్న ఆణిముత్యాలు. ఆమె ఆంధ్రప్రదేశ్‌లోని 28 ఆదివాసీ తెగల నృత్యాల గురించి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రదర్శన కళాశాల విద్యార్థినీ విద్యార్థులచే రాయించిన లఘు సిద్ధాంత వ్యాసాలు అరవై పైబడే వున్నాయి.

లలిత, జీవిత భాగస్వామి ఆచార్య వకుళాభరణం రామకృష్ణతో కలిసి రాసిన 'దుర్గాబాయి దేశముఖ్', 'రఘుపతి వెంకటరత్నం నాయుడు' మొదలైన పుస్తకాలు నేటి తరానికి దారి చూపే వెలుగు దివ్వెలు. డా. వకుళాభరణం లలిత సమాజశాస్త్ర, మానవశాస్త్ర పరిశోధనలో అపారమైన కృషిచేసి, యువ పరిశోధక తరాన్ని తీర్చిదిద్దిన ప్రతిభాశాలిని. ఐదు దశాబ్దాలకు పైగా అవిశ్రాంత పరిశోధన సాగించి 2017 మార్చి 14వ తేదీన చిరవిశ్రాంతి తీసుకొన్న చల్లని తల్లి ఆమె.

– ఘట్టమరాజు

(మార్చి 14: వకుళాభరణం లలిత వర్ధంతి)

బీజేపీది బలమా, బలహీనతా?

'నీ రాజకీయ సిద్ధాంతం స్వప్రయోజనాలకు అనుగుణంగా, ఆచరణీయ దృక్పథంతో ఉండాలి. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరని. శాశ్వత ప్రయోజనాలు మాత్రమే ఉంటాయి అన్న వైఖరితోనే ఏ నిర్ణయమైనా తీసుకోవాలి. రాజకీయ అధికారం లేకపోతే నీకే శక్తీ లేనట్లే' అని ప్రముఖ అమెరికన్ రాజనీతిజ్ఞుడు విలియం క్లే తన దేశంలో రాజకీయ పార్టీలకు, నాయకులకు ఇచ్చిన సలహా ప్రపంచంలో ఏ దేశంలో నాయకుడికైనా వర్తిస్తుంది. భారత రాజకీయాల్లో ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ ఎంత బలమైన పార్టీ అయినప్పటికీ 370 సీట్లు గెలవాలంటూ ఒక లక్ష్యం అంటూ విధించుకున్న తర్వాత ఆ లక్ష్యం కోసం ఇవాళ దేశంలో వివిధ ప్రాంతీయ పార్టీలతో సీట్ల సర్దుబాటు కోసం చేస్తున్న ప్రయత్నాలను చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. అన్ని చోట్లా అత్యధిక లోక్‌సభ సీట్లు కావాలని ఆశిస్తోంది. గుర్రం కంటే ముందు నాడా కొనుక్కుంటున్నట్లు కనపడుతోంది బీజేపీ వారి పరిస్థితి. ఇది బలమా, బలహీనతా?

గత వారమంతా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా పలు ప్రాంతీయ పార్టీల అధినేతలతో చర్చలు జరిపారు. శివసేన చీలిక వర్గం నాయకుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ చీలికవర్గం నేత, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌లతో సుదీర్ఘ చర్చలు జరిపినా వారి మధ్య సీట్ల ఒప్పందం ఒక కొలిక్కి రాలేకపోయింది. ఒడిషా బీజేపీ నేతలు ధర్మేంద్రప్రధాన్, మన్మోహన్‌సింగ్ సహాయ్, జ్యుయల్ ఓరంలతో చర్చలు జరుపుతూనే బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్‌కు అనేక సందేశాలు పంపారు. కాని అక్కడ కూడా సీట్ల సర్దుబాటు అంత సులభంగా జరిగేలా కనపడడం లేదు. నిజానికి ఒడిషాలో బిజూ జనతాదళ్ 11 సంవత్సరాల పాటు ఎన్డీఏతో స్నేహం చేసిన తర్వాత 2009లో తెగతెంపులు చేసుకుంది. అప్పుడు కూడా అందుకు ప్రధాన కారణం సీట్ల సర్దుబాటుపై ఏకాభిప్రాయం లేకపోవడమే. మళ్లీ ఇప్పుడు 15 సంవత్సరాల తర్వాత బీజేడీకి స్నేహ హస్తం చాస్తున్న బీజేపీ మళ్లీ అత్యధిక సీట్లను కోరుకుంటోంది. 'బీజేపీకి ఎక్కువ సీట్లు ఇవ్వడాన్ని మా కేడర్ వ్యతిరేకిస్తున్నారు' అని బీజేడీ నేత ఒకరు చెప్పారు.

మహారాష్ట్రలో రాజకీయ నేతల చంక్రమణాలు, చీలికలు అక్కడి ప్రజలకు కొత్తవి కావు. దేశంలో అత్యంత సీనియర్ నాయకుడైన శరద్ పవార్ ఎమర్జెన్సీ తర్వాత కాంగ్రెస్ ముఖ్యమంత్రి వసంతదాదా పాటిల్‌పై తిరుగుబాటు చేసి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (సోషలిస్టు) అనే పార్టీ స్థాపించారు. జనతా పార్టీ, పీజంట్స్ వర్కర్స్ పార్టీతో కలిసి పీడీఎఫ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అంతకు ముందే కాంగ్రెస్ అక్కడ రెండు ముక్కలైంది. మహారాష్ట్ర రాజకీయాల్లో శివసేన బలీయమైన శక్తిగా మారుతుండడంతో ఆ పార్టీని అడ్డుకోవడానికి మళ్లీ 1987లో కాంగ్రెస్ శరద్ పవార్‌ను తమ పార్టీలోకి ఆహ్వానించింది. కాంగ్రెస్ ఆయనను రెండుసార్లు ముఖ్యమంత్రిని చేసింది. 1999లో సోనియాగాంధీపై విదేశీ ముద్ర వేసి తిరుగుబాటు చేసి నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీని స్థాపించిన పవార్ 2004 లోక్‌సభ ఎన్నికల్లో అదే సోనియా నాయకత్వంలోని యూపీఏలో తన పార్టీని మిత్రపక్షంగా మార్చారు. ఏ శివసేననైతే కాంగ్రెస్ నేతలు, పవార్ వ్యతిరేకించారో ఆ శివసేనతోనే కలిసి ప్రభుత్వాన్ని



తన ఆకర్షణకు తిరుగులేదని, రామమందిర నిర్మాణం వల్ల ప్రజలు తమవైపే ఉన్నారని ప్రధాని మోదీ విశ్వసిస్తున్నప్పటికీ బీజేపీకి ఇవాళ స్వంతంగా మొత్తం 543 లోక్‌సభ సీట్లలో పోటీ చేయదగ్గ శక్తి లేదు. సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లలో పోటీ చేసి 50 శాతానికి పైగా ఓట్లను కైవసం చేసుకోవాలని బీజేపీ భావిస్తోంది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే బీజేపీకి ఇవాళ ప్రాంతీయ పార్టీల అవసరం ప్రబలంగా కనపడుతోంది.

ఏర్పరిచారు. తర్వాత శివసేన, ఎన్‌సీపీని కూడా బీజేపీ చీల్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడా చీలిన పార్టీల నుంచే బీజేపీ అత్యధిక సీట్లను ఆశిస్తోంది.

రాజకీయ పార్టీలు శిబిరాలు మార్చడం దేశంలో కొత్త కాదు. ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా జనతా పార్టీ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన చరణ్ సింగ్ తర్వాత అదే ఇందిర మద్దతుతో ప్రధానమంత్రి అయ్యారు. యూపీలో బీఎస్‌పీ, ఎస్‌పీ పలుసార్లు కలిసి, విడిపోయాయి. డీఎంకె, అన్నాడీఎంకె పార్టీలు రెండింటికీ కాంగ్రెస్, బీజేపీలతో కలిసి పనిచేసిన చరిత్ర ఉన్నది. కర్ణాటకలో జనతాదళ్(ఎస్) కూడా అదే దారిలో నడిచింది. మోదీని రాష్ట్రంలోనే అడుగుపెట్టనీయబోనని ఒకప్పుడు ప్రకటించిన నితీశ్ కుమార్ బీజేపీతోనే చేతులు కలిపి రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. జమ్ముకశ్మీర్‌లో పీపుల్స్ డెమాక్రటిక్ పార్టీతో కలిసి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తుంది.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

ప్రాంతీయ పార్టీలు దేశంలో బలమైన జాతీయ పార్టీతో సంబంధాలు ఏర్పర్చుకోవాలనుకోవడం, తమ రాజకీయ, రాష్ట్ర ప్రయోజనాలు నెరవేర్చుకోవాలనుకోవడం కొత్త కాదు. కాని ప్రాంతీయ పార్టీలకు జాతీయ పార్టీ అవసరం ఎంత మేరకు ఉన్నదో, జాతీయ పార్టీలకు ప్రాంతీయ పార్టీల అవసరం అంతే ఉన్నదన్న విషయం విస్పష్టం. ఇవాళ కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ వివిధ ప్రాంతీయ పార్టీలతో పొత్తు ఏర్పర్చుకుని అత్యధిక లోక్‌సభ సీట్లు సాధించాలని అనుకుంటున్నాయి. కాని ఈ రెండు పార్టీల్లో ప్రాంతీయ పార్టీలపై కొంత ఎక్కువ ఒత్తిడి చేసే శక్తి బీజేపీకే ఉన్నదనడం వాస్తవం. బీజేపీ కేంద్రంలో పదేళ్లలో అపారమైన అధికారాన్ని, సంపదను సమకూర్చుకోవడమే కాక వ్యవస్థలపై పట్టు సంపాదించుకోవడం కూడా అందుకు ప్రధాన కారణం. అందుకే కొన్ని ప్రాంతీయ పార్టీలను బీజేపీ రాక్షస వివాహం చేసుకోగలుగుతోంది.

కాంగ్రెస్ కేంద్రంలో దాదాపు పది సంవత్సరాలుగా అధికారంలో లేనందువల్ల, అనేక రాష్ట్రాల్లో అధికారం కోల్పోయినందువల్ల మిత్రపక్షాలు చెప్పినట్లు ఆ పార్టీ వినవలసి వస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పేలవమైన పనితీరు ప్రదర్శించినందువల్ల ఎక్కడా పొత్తులపై స్వంతంగా షరతులు విధించలేని పరిస్థితుల్లో ఉన్నది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ఇచ్చినన్ని సీట్లు తీసుకోవల్సి రావడమే కాదు, గుజరాత్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ పోటీ చేసిన బరూచ్ స్థానంతో పాటు రెండు లోక్‌సభ సీట్లను ఆప్‌కు కేటాయించవలసిన అగత్యం కాంగ్రెస్‌కు ఏర్పడింది. మహారాష్ట్రలో రెండో స్థానంలో పోటీ చేసే పరిస్థితి ఉండగా, బెంగాల్‌లో తృణమూల్‌కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆడిందే ఆటగా వ్యవహరిస్తున్నారు. లోక్‌సభ సీట్ల ఒప్పందం పేరుతో జార్ఖండ్‌లో కాంగ్రెస్ నుంచి జేఎంఎం రాజ్యసభ సీటును సాధించుకోగలిగింది.

అయితే కేంద్రంలో పదేళ్లుగా అపరిమిత అధికారం చలాయిస్తూ, తన ఆకర్షణకు తిరుగులేదని మోదీ భావిస్తున్నప్పటికీ, గతంలో ఏ పార్టీ హయాంలో జరగనంత అభివృద్ధి తానే చేశానని చెప్పుకుంటున్నప్పటికీ, రామమందిర నిర్మాణం, జాతీయ వాదం మొదలైన వాటి వల్ల ప్రజలు తమవైపే ఉన్నారని అనుకుంటున్నప్పటికీ బీజేపీకి ఇవాళ దేశంలో స్వంతంగా మొత్తం 543 లోక్‌సభ సీట్లలో పోటీ చేయదగ్గ శక్తి లేదనే చెప్పాలి. గడచిన రెండు ఎన్నికల్లోనూ దాదాపు వందకు పైగా సీట్లలో ఆ పార్టీ పోటీయే చేయలేదు. గత మూడు లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఖచ్చితంగా గెలిచిన సీట్లు 95 మాత్రమే. వీటితో పాటు దాదాపు 262 సీట్లు తమకు సురక్షితంగా ఉన్నాయని బీజేపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అందువల్ల ఈ సారి సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లలో పోటీ చేసి 50 శాతం పైగా ఓట్లను సాధించడం, సాధ్యమైనన్ని మిత్రపక్షాలను ఏర్పర్చుకోవడం, ముఖ్యంగా తెలుగుదేశం, బీజేడీ వంటి పాత ఎన్డీఏ మిత్రపక్షాలను మళ్లీ కలుపుకోవడం చేయాలని బీజేపీ భావిస్తోంది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే బీజేపీకి ఇవాళ ప్రాంతీయ పార్టీల అవసరం ప్రబలంగా కనపడుతోంది. లేకపోతే బీహార్‌లో నితీశ్ కుమార్‌ను ఇండియా కూటమి నుంచి చీల్చాల్సిన అవసరం మోదీకి ఏర్పడేది కాదు. నితీశ్ కుమార్ తమను తిట్టిన తిట్లన్నీ బీజేపీ మరిచిపోవాల్సి వస్తోంది. అంతేకాదు, తమ ఎజెండాకు భిన్నంగా కులజనగణనను జరిపిన జేడీ(యు)ను సమర్థించాల్సి వస్తోంది. నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యు)తో పాటు చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జేపీ, పశుపతి పరాస్‌కు చెందిన ఎల్‌జేపీ (రాష్ట్రీయ), ఉపేంద్ర కుషవాహకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చా, జితన్‌రాం మాంఝీ నేతృత్వంలోని హిందూస్తాన్ అవామీ మోర్చా కూడా ఆ పార్టీకి అవసరం. ఉత్తరప్రదేశ్‌లో కూడా అప్నాదళ్ (సోనేలాల్), రాష్ట్రీయ లోక్‌దళ్, నిషాద్ పార్టీ, రాజ్‌భర్ నేతృత్వంలోని సుహల్దేవ్ భారతీయ సమాజ్ పార్టీలను విస్మరించదగిన స్థితిలో ఆ పార్టీ లేదు. అసోంలో అసోం గణపరిషద్, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్, జార్ఖండ్‌లో ఆల్ ఇండియా జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్‌తో బీజేపీకి చేతులు కలపక తప్పడం లేదు. ఏదో రకంగా తమతో 38–40 పార్టీలు ఉన్నాయని చెప్పుకునేందుకు బీజేపీ తంటాలు పడుతోంది. ఇవాళ దేశంలో బీజేపీ కానీ, కాంగ్రెస్ కానీ విస్మరిస్తున్న పార్టీలు రెండే ఉన్నాయి. అవి వైసీపీ, బీఆర్ఎస్ మాత్రమే.

ప్రాంతీయ పార్టీలన్నిటిలో తెలుగుదేశం పార్టీయే ప్రాప్తకాలజ్ఞతతో వ్యవహరించిందనే చెప్పాలి. నిజానికి ఆంధ్రప్రదేశ్‌లో గత ఎన్నికల్లో బీజేపీకి ఒక శాతం ఓట్లు మాత్రమే వచ్చినప్పటికీ ఆ పార్టీకి ఆరు లోక్‌సభ సీట్లు కేటాయించడం చాలా ఎక్కువ అని ఆ పార్టీ నేతలు పలువురు చెబుతూనే ఉన్నారు. ఈ విషయం చంద్రబాబునాయుడుకు కూడా తెలియనిది కాదు. కాని ఎన్నికల నిర్వహణ విషయంలోనూ, ఎన్నికల తర్వాత సహకారం విషయంలోనూ, అభివృద్ధి విషయంలో తనకున్న పేరును విభజిత ఏపీలో కూడా సార్థకం చేసుకోవడం కోసం ఆయన బీజేపీకి స్నేహహస్తం చాచారు. దేశంలోని ప్రాంతీయ పార్టీల నేతలందరూ తీవ్ర అంతర్మథనంతో ఉన్నారంటే మోదీ ప్రత్యామ్నాయ రాజకీయాలు ఎంత బలహీనంగా ఉన్నాయో అర్థమవుతోంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

సామాజిక న్యాయమే అభివృద్ధి

దేశంలో పురుషులతో పోల్చినప్పుడు మహిళలు ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొనటం (వర్క్ ఫోర్స్ పార్టిసిపేషన్) తగ్గిపోతూ వస్తున్నదని అధికారిక సమాచారం నివేదిస్తున్నది. ఈ స్థితి వివిధ రాష్ట్రాలలో చాలా భిన్నంగా వుంది. ఇది 'కార్మికులు'గా లెక్కించబడిన మహిళలకు మాత్రమే సంబంధించినదని అందరికీ తెలిసిందే. ఇదిలా వుంటే స్త్రీ వాద మేధావులు, ఇతరులు, మన పితృస్వామ్య వ్యవస్థలో అసలు పని చేయని మహిళలు అంటూ ఎవరూ ఉండరని నిరంతరం ఎత్తి చూపుతున్నారు. వారు, మహిళల పనిని సమయ వినియోగ సర్వేలు వంటి భిన్న రూపాలలో అంచనా వేయటానికి ఇతర సాధనాలను, పద్ధతులను వారు పదే పదే సూచిస్తున్నారు. అంతేకాక, పురుషులు ఆర్థిక వ్యవస్థలో బాగా పనిచేయటానికి దోహదం చేసే మహిళల అదృశ్య పని లేకుండా పురుషులు సమర్థంగా పనిచేయటం సాధ్యం కాదు కూడా.

పితృస్వామిక వ్యవస్థ మన సమాజంలో మహిళలపైన అనేక రకాల పునరుత్పత్తి, సంరక్షణ పాత్రలను రుద్దటం మన చుట్టూ జరుగుతున్నదే. దానితో పాటు అత్యధిక శాతం మహిళలు వేతన శ్రమగా గుర్తించబడిన ఆర్థిక కార్యకలాపాలను కూడా చేస్తున్నారు. పురుషులు ఇంటి బయట ఆర్థిక పాత్ర గల పనిని చేస్తారు అనే ఊహాత్మక భావనతో పిల్లల సంరక్షణ, కుటుంబంలో పెద్దలు, రోగుల సంరక్షణ బాధ్యత కూడా ప్రాథమికంగా మహిళలపైనే రుద్దటం జరుగుతున్నది. ప్రత్యుత్పత్తి పనులలో వంట, శుభ్రం చేయటం, కడగటం, నీరు తేవటం, వంట చెరకు సేకరించటం, మేత తేవటం, వంటి అనేక పనులు ఉంటాయి. ఈ పనులను మహిళలు ప్రతిరోజు వారి జీవిత కాలమంతా చేస్తారు. 'సామాజికీకరణ' ప్రక్రియలు పురుషులను ఇంటి పనులు చేయటకుండా నివారించాయి, కాగా మహిళలు కూడా ప్రశ్నించకుండా ఆ పనులను చేయటం కొనసాగిస్తున్నారు.

కుటుంబ పరిధిలో మహిళలు పొద్దస్తమానం చేసే పనులను గుర్తించాలని, వాటి భారాన్ని తగ్గించాలని, ఇతరులకు పంచాలని, వాటికీ విలువ కట్టి తగిన వేతనం చెల్లించాలని స్త్రీ వాద ఉద్యమకారులు, ఆర్థికవేత్తలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. మహిళలు ఇంటివద్ద చేసే పనిని, అందునా నిజానికి పురుషుల కంటే ఎక్కువ గంటలు చేసే పనిని గుర్తించటం ఈ దిశలో మొదటి అడుగు అవుతుంది. వీలైనంతవరకు అటువంటి పనిని పెద్ద ఎత్తున నిర్దేశక మార్పులు, ప్రవర్తనా రీతుల్లో మార్పుల ద్వారా తగ్గించాలి. దానితో పాటు పిల్లల సంరక్షణ వసతుల పరంగా ప్రభుత్వ సేవలు, ఇంటికి కుళాయిల ద్వారా తాగు నీటి సరఫరా, ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ, వృద్ధుల సంరక్షణ సదుపాయాలు వంటి మౌలిక సదుపాయాలను విస్తరించాలి. మహిళలకు వారు చేసే వేతనం లేని పనిని గుర్తించి దానికి సరిపడిన వేతనం ఇవ్వటం చాలా ముఖ్యం. భారత ప్రభుత్వం ఆమోదించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ఐదవది– జెండర్ సమానత్వం, మహిళల బాలికల సాధికారతను సాధించటానికి సంబంధించినది. దానిలో 5.4వ లక్ష్యం ఈ విధంగా ప్రకటించింది 'ప్రభుత్వ సేవలు, మౌలిక సదుపాయాల కల్పన, సాంఘిక భద్రత విధానాల ద్వారా వేతనం లేని సంరక్షణ పనిని, ఇంటి పనిని గుర్తించి, దానికి విలువ నివ్వాలి. కుటుంబం లోపల పనులను బాధ్యతలను పంచుకోవటాన్ని జాతీయ స్థితిగతులకు అనుగుణంగా ప్రోత్సహించాలి'.

ఈ నేపథ్యం నుండే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వ 'గ్యారెంటీలను' మహిళల వేతనం లేని పనికి వేతనం ఇచ్చేదిగా అర్థం చేసుకుని అభినందించాలి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల మహిళలకు నెలకు 2500 రూ. ఇచ్చే మహాలక్ష్మి పథకం మహిళా హక్కుల ఉద్యమకారులు చేస్తున్న డిమాండ్‌ను పాక్షికంగా నెరవేర్చినట్లు అర్థం చేసుకోవాలి. అదే విధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సేవను కూడా స్త్రీలు బయటకు వెళ్లటంపై మన సమాజం విధించిన కట్టుబాట్లను బద్దలు కొట్టే ప్రగతిశీల విధానంగా చూడాలి. ఇది మహిళలు పనిలో పాల్గొనటాన్ని పెంచే వాతావరణాన్ని సృష్టించానికి దోహదపడుతుంది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితను, మిక్సీలు పంచిపెట్టటం వంటి 'ఉచితాల' గురించి, అది ప్రజా ధనాన్ని వృథా చేయటం కాదా అని ప్రశ్నించినప్పుడు ఆమె కూడా ఆ పథకాన్ని స్త్రీ వాద భావన నుండి వివరించారు.

ఇటువంటి సాంఘిక భద్రత పథకాలు మహిళలకు సాధికారత కల్పించే ప్రగతిశీల విలువలు, వారికీ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కల్పించటంపై ఆధారపడినవాటిని ఎత్తి చూపవలసివుంది. వాటిని 'రేవడి'గా చూడలేము. సామాజిక న్యాయ మార్గాలే మనలను 'వికసిత్ భారత్'కు చేరుస్తాయి. సామాజిక న్యాయమే అభివృద్ధి అవుతుంది Justice itself is Vikas!

ఇంకో పదేళ్ళయినా కోలుకోదు సాగునీటి వ్యవస్థ!


ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా నలు మూలలా నిర్వహిస్తున్న 'సిద్ధం' ఎన్నికల సభల్లో తాను అయిదేళ్ల కాలంలో రెండున్నర లక్షల కోట్ల రూపాయల పంపిణీ చేశానని, ఇదే సర్వరోగ నివారిణి అని పదేపదే పునశ్చరణ గావిస్తున్నారు . కానీ అవశేష ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ అసమానతలు మెండుగా ఉన్నాయని, ఒక ప్రాంతం సామాజిక ఆర్థిక మౌలిక అవసరాలకూ మరో ప్రాంతానికీ సంబంధం లేదనే అంశాన్ని కావాలనే మరుగుపరుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పూర్తిగా వ్యవసాయ రాష్ట్రమని, అత్యధికులు ఈనాటికీ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, రాయలసీమ లాంటి మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందిస్తే వారు స్వయంగా తమ కాళ్లపై నిలబడతారనే స్పృహ ముఖ్యమంత్రి ప్రసంగాల్లో కాగడా పెట్టి వెతికినా కన్పించడం లేదు. తాను ఇచ్చే ఉచితాలతో శాశ్వతంగా ఆధారపడమనే 'పెత్తందారీ' ధోరణిలో ఆయన ప్రసంగాలు వున్నాయి. అంతేకాదు, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన ఆదాయంతోనే అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు లక్షల కోట్లు పంపిణీ చేస్తున్న అంశాన్ని ముఖ్యమంత్రి, ఆయన పరివారం ఉద్దేశపూర్వకంగా మరుగుపర్చుతూ, ప్రభుత్వ నిధులతో ఓట్ల రాజకీయం సాగిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన సాగునీటి రంగాన్ని అయిదేళ్ల కాలం అటకెక్కించడమే కాకుండా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గొంతెండిపోతున్న రాయలసీమను తిరిగి మోసం చేసేందుకు సీమకు చెందిన పూర్తికాని సాగునీటి పథకాల ప్రారంభోత్సవాల పేర సరికొత్త దుస్సాహసానికి తెరదీశారు. వ్యవసాయ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఏడు జిల్లాలు బాగా వెనకబడి వున్నాయని, అందులో రాయలసీమ నాలుగు జిల్లాల ప్రజలు సాగునీటికే గాక, తాగునీటికి కూడా కటకట లాడుతున్నారని కనీస స్పృహ ఉండివుంటే ఆయా ప్రాంతాల ప్రజల అభీష్టాలతో పాటు భౌతిక సామాజిక పరిస్థితులు ఆధారంగా అయిదేళ్ల కాలంలో పంపిణీ చేసిన రెండున్నర లక్షల కోట్ల రూపాయల్లో కొద్దిపాటి నిధులైనా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా వ్యయం చేసేవారు.

అయిదేళ్ల కాలంలో ఏటా బడ్జెట్‌లో సాగునీటి రంగానికి పదివేల కోట్ల రూపాయలకు పైగా కేటాయింపులు చేస్తున్నా వ్యయం చేసింది అయిదేళ్లలో కేవలం రూ.37వేల కోట్లు మాత్రమే. ఇందులో జల వనరుల శాఖ సిబ్బంది జీతభత్యాలు, పెండింగ్ బిల్లులు కలిసి ఉండగా క్షేత్రస్థాయిలో వ్యయం చేసింది సముద్రంలో కాకి రెట్టంత! పైగా ఈ ఏడు అక్టోబర్ వరకు 5 వేల కోట్లు ఖర్చు చేయగా సవరించిన బడ్జెట్‌లో పది వేల కోట్ల రూపాయలు వ్యయం చూపారంటే ఎంత దుస్సాహసం? ఈ నిధులు అతి తక్కువ కాలంలో క్షేత్రస్థాయిలో వ్యయం చేయడం ఎలాగూ కుదరదు కాబట్టి అధికారాంతంలో గంపగుత్తగా తమకు చెందిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి కథ కంచికి పంపుతారేమో. ఇందులో వెనుకబడిన రాయలసీమ వాటా అతి స్వల్పం. ఇంతకీ విషాదమేమంటే అయిదేళ్ల కాలం గడిపేసి రాయలసీమలోనే పూర్తి గాని సాగునీటి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలకు 'సిద్ధ'పడుతున్నారంటే కపట నాటక ధారికి మాత్రమే సాధ్యం.

రాయలసీమ నడి బొడ్డున అనంతపురం జిల్లాలో నిర్వహించిన 'సిద్ధం' ఎన్నికల సభలో ఈ ప్రాంతవాసుల చిరకాల వాంఛితమైన సాగునీటి ప్రాజెక్టుల గురించి ఒక్క మాట పలకని ముఖ్యమంత్రి నీళ్లో రామచంద్రా అంటూ తపించే కర్నూలు, అనంతపురం జిల్లా రైతుల కడుపు గొట్టి వారం తిరగక ముందే హంద్రీనీవా జలాలు

హంద్రీనీవా జలాలు కుప్పంకు తరలించాలని ఆడిన నాటకం అభాసుపాలైన అంశానె[illegible] దృష్టిలో పెట్టుకోకుండా వెలుగొండ ప్రాజెక్టు జాతికి అంకితం సాగించి– పైగా మరల వచ్చి నీళ్లు ఇస్తానని చెప్పడం మోసపూరితమౌతుందని ముఖ్యమంత్రికి అనిపించలేదా? కనీసం సలహాదారులైనా సూచించలేదంటే ఏమనుకోవాలి?



చిత్తూరు జిల్లా కుప్పంకు తరలించి మమ అనిపించారు.

కనీసం హంద్రీనీవా జలాలు కూడా కుప్పం ప్రాంతానికి ఇవ్వలేదు. తూతూ మంత్రంగా ప్రారంభోత్సవం చేసి మరు రోజునే సినిమా సెట్టింగ్‌లుగా కట్టడాలను కట్ట కట్టేశారు. హంద్రీనీవా జలాలు చిత్తూరు జిల్లాకు ఇవ్వదలచి వుంటే కుప్పంకు ముందే వచ్చే పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాలకు నీళ్లు ఇచ్చి తదుపరి కుప్పం తరలించి వుండాలి. అంతా ఉత్తుత్తి నీటి తరలింపు కాబట్టి ముఖ్యమంత్రి అటు వెళ్లగానే నీటి విడుదల ఆపేశారు. ఈ ఎపిసోడ్‌లో భిన్న కోణాలు ఇమిడి వున్నాయి. కుప్పం ప్రజలకు నీళ్లు ఇవ్వకుండా ఇచ్చినట్లు చూపి మోసం చేయడం ఒకటైతే, పక్షం రోజుల పాటు అధికారులు అన్ని పనులు పక్కన బెట్టి ఆరు వందల కిలోమీటర్లు కాసిని నీళ్లు తరలించేందుకు లక్షలాది రూపాయలు దుర్వ్యయం చేయటం మరొకటి.

కర్నూలు, అనంతపురం జిల్లాల్లో దాదాపు 400 కిలోమీటర్ల కాలువ వెంబడి రైతులు పంపులతో తోడుకోకుండా కాపలా పెట్టారు. కనీసం ఒక టీయంసీ నీరైనా కొత్తగా నిర్మించిన కాలువలో ఎక్కడికక్కడ తెగిపోవడం పారుదల నష్టంతో కలిపి వృథా అయింది. కుప్పంతో పాటు ఎందుకూ ఉపయోగపడని ఈ నీరు అనంతపురం జిల్లా రైతులకు ఇచ్చి వుంటే పది వేల ఎకరాల్లో పంటలు గట్టేవి. ఇందులో మంత్రి పెద్దిరెడ్డి స్వార్థం వుంది. వాస్తవంలో హంద్రీనీవా జలాలు కుప్పంకు తరలించాలనే ఆలోచన ముఖ్యమంత్రికి గాని మంత్రి పెద్దిరెడ్డికి గాని లేదు. హంద్రీనీవాకు చెందిన పుంగనూరు బ్రాంచి కెనాల్ ఆయకట్టుకు మల్యాల ఎత్తిపోతల నుండి నీళ్లు తరలించడం సాధ్యం కాదని 2020లోనే హంద్రీనీవా గాలేరు నగరి అనుసంధానం పేర రూ.2144 కోట్లతో మూడు రిజర్వాయర్లకు ముఖ్యమంత్రి నుంచి మంత్రి పెద్దిరెడ్డి పరిపాలన అనుమతి పొందారు. గండికోట నుండి అడ్డదారిలో తనకు సోదరుడు తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి అనుకూలంగా ముడివేడు (2 టీయంసీలు), నేతిగుంటపల్లె (1 టీయంసీ) ఆవులపల్లి (3.5 టీయంసీలు) పరిపాలన అనుమతి పొందారు. నీటి కేటాయింపులు లేకున్నా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన అనుమతి 2020లోనే ఎందుకు ఇచ్చారు? అప్పట్లో కుప్పంకు హంద్రీనీవా జలాలు తరలించాలనే ఆలోచన ముఖ్యమంత్రికి గాని మంత్రి పెద్దిరెడ్డికి గాని లేదు. ఇప్పుడు ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును ఓడించేందుకు ఈ ఎత్తుగత చేపట్టారు. అంతిమంగా అభాసుపాలైనారు.

ఇప్పుడు తాజాగా వెలుగొండ ప్రాజెక్టు జాతికి అంకితం పేర సభ నిర్వహించడమే కాకుండా స్వయంగా ముఖ్యమంత్రి సిగ్గువిడిచి మరొక మారు వచ్చి నీళ్లు ఇస్తానని చెప్పడమే నేటి విషాదం. బొట్టు నీళ్లు ఇవ్వలేని ప్రాజెక్టు జాతికి అంకితమెందుకు? హంద్రీనీవా జలాలు కుప్పంకు తరలించాలని ఆడిన నాటకం అభాసుపాలైన అంశానె[illegible] దృష్టిలో పెట్టుకోకుండా వెలుగొండ ప్రాజెక్టు జాతికి అంకితం సాగించి పైగా మరల వచ్చి నీళ్లు ఇస్తానని చెప్పడం మోసపూరితమౌతుందని ముఖ్య మంత్రికి తట్టకపోయినా సలహాదారులైనా సూచించ లేదంటే ఏమని భావించాలి? ఇదంతా చూస్తుంటే వెల్లువలో కొట్టుకుపోయే వానికి గడ్డిపోచ కూడా రక్షణ హేతువుగా తోయడం చిత్రమేమీ కాదేమో. ఇదే తరహాలోనే గతంలో అవుకు టన్నెళ్లు జాతికి అంకితం చేశారు. ప్రాజెక్టులు పూర్తికాకుండా తుదకు పాక్షికంగా నీటి బొట్టు విడుదల చేయకుండా ఎన్నికల ప్రచార యావకు చిన్నపిల్లల బొమ్మరిళ్లలాట లాగా సాగునీటి ప్రాజెక్టులు ప్రారంభోత్సవాలు చేయడం జగన్మోహన్ రెడ్డికే చెల్లు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన తర్వాత నిర్ణీత కాల వ్యవధిలో పట్టిసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేశారు. కనీసం ఆ స్ఫూర్తితో జగన్మోహన్ రెడ్డి తను పరిపాలనా అనుమతి ఇవ్వడమే కాకుండా పైగా పునాది రాయి వేసిన రాయలసీమకు చెందిన ఒకే ఒక ప్రాజెక్టు అయినా అయిదేళ్ల కాలంలో పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసి ఉండాలి.

2019లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన సమయంలో లక్షా డెబె[illegible]వేల కోట్ల రూపాయలు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి అవసరమని అంచనా వేశారు. ఈ అయిదేళ్ల కాలంలో రాష్ట్ర జలవనరుల శాఖ సిబ్బంది జీత భత్యాలు పెండింగ్ బిల్లులతో సహా ముప్పయి ఏడు వేల కోట్లు వ్యయం చేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి సాగునీటి ప్రాజెక్టుల మీద ఏటా 15 శాతం షెడ్యూల్ రేట్లు పెరగడం అనివార్యం. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం ఈ మధ్య కాలంలో ఆగిపోయిన నష్టం కన్నా ఏటా పెరిగే షెడ్యూల్ రేట్లు అనూహ్యంగా వుండబోతున్నాయి.

వచ్చే ప్రభుత్వం మొదలుపెట్టిన పథకాలు తుది దశకు వచ్చేసరికి ఆంజనేయుని వాలంలాగా అంచనా పెరుగుతాయి. మరీ కొన్ని పథకాలపై వ్యయం చేసే నిధులతో సమానంగా షెడ్యూల్ రేట్లు పెరిగిన సందర్భాలున్నాయి. అయిదేళ్ల కాలం వృథా అయినందున ఎన్నికల తర్వాత ఏర్పడబోయే కొత్త ప్రభుత్వం కూడా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో మున్ముందు రాష్ట్ర ప్రజల డిమాండ్లు తీర్చడం అంత సులభం కాదు. సాగునీటి రంగాన్ని గాడిన పెట్టడానికి మరొక పదేళ్లు పడుతుందేమో.




ప్రకాశం బ్యారేజీపై నిలిచిపోయిన ట్రాఫిక్

అన్నొస్తున్నాడంటే.. అగచాట్లే!

సీఎం జగన్ వస్తున్నాడంటే నగర వాసులు బెంబేలెత్తిపోతున్నారు. ట్రాఫిక్ ఆంక్షలతో అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టి రాకపోకలను బిగేస్తున్నారు. ఆఫీసుకెళ్లే ఉద్యోగులు, పరీక్షలకు వెళ్లే విద్యార్థులు, ఆస్పత్రులకెళ్లే రోగులు ఇలా అన్ని వర్గాలవారూ ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుపోయి సతమతమవుతున్నారు. సీఎం జగన్ తిరిగి వెళ్లే వరకు ఎవరూ ఎటూ వెళ్లడానికి వీల్లేకుండా రోడ్లు మూసేస్తున్నారు. కృష్ణానది కరకట్ట ప్రారంభానికి మంగళవారం నగరానికి సీఎం రావడంతో ఉదయం నుంచే ట్రాఫిక్ ఆంక్షలు మొదలయ్యాయి. ప్రకాశం బ్యారేజీపై, కనకదుర్గ వారధిపై రాకపోకలను ఆపేయడంతో జనం పడరానిపాట్లు పడ్డారు.


రామలింగేశ్వరనగర్ స్క్రూబ్రిడ్జి నుంచి బెంజిసర్కిల్ వైపు వెళ్లే వైపు ఆగిపోయిన వాహనాలు

వారధి నుంచి బెంజిసర్కిల్ వైపు వెళ్లే రహదారిలో

నోరు తెరిస్తే అబద్ధాలు

• సీఎం నోట అబద్ధపు మాట

'కృష్ణా కరకట్ట వాల్‌ను మీరు చూస్తున్నారు. ఇటు వైపున, అటు వైపున ఈ రెండు కరకట్ట గోడలు దాదాపు రూ.500 కోట్లతో మేం నిర్మించాం'

- సీఎం జగన్ నోటి వెంట మంగళవారం అలవోకగా వచ్చిన అబద్ధాలు ఇవి.

● వాస్తవంగా జరిగింది ఇదీ..

కృష్ణా కరకట్ట గోడ మొత్తం 4.7 కిలోమీటర్ల వాల్ మూడు ఫేజ్‌లలో నిర్మాణం చేయాల్సి ఉంది. మొదటి ఫేజ్ 2.37 కి.మీ. యనమలకుదురు మొదలు నుంచి గీతానగర్ కట్ట వరకు రూ.165 కోట్లు, రెండో ఫేజ్ 1.23 కి.మీ. గీతానగర్ కట్ట నుంచి వారధి వరకు రూ.126 కోట్లు, మూడో ఫేజ్ 1.01 కి.మీ వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు రూ.110 కోట్లతో టీడీపీ హయాంలో 2016లోనే అంచనాలు తయారు చేయించారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో నిధులు మంజూరు చేయించి మొదటి దశ (2.37 కి.మీ) నిర్మాణం చేయించింది ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్.



కృష్ణానదికి రిటైనింగ్ వాల్ నిర్మించింది టీడీపీ

- తన హయాంలోనే కట్టినట్టు జగన్ బిల్డప్
- టీడీపీ ఆందోళనలతో ఎట్టకేలకు ఎన్నికలకు ఏడాది ముందు ప్రారంభం
- వైసీపీ అధికారంలోకొచ్చాక రెండు, మూడు దశలకు బ్రేక్
- అంచనా వ్యయం రూ.50 కోట్లు పెంచేసి నాసిరకం పనులతో సరి
- ఐదేళ్లు ఖాళీగా ఉండి ఎన్నికల సమయంలో వైసీపీ హడావుడి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/కృష్ణలంక) ఎన్నికల వేళ వైసీపీ నేతలు ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సాక్షాత్తు సీఎం జగన్ నోట అబద్ధాలు వల్లెవేస్తున్నారు. విజయవాడ కనకదుర్గ వారధి వద్ద ఇరిగేషన్ రిటైనింగ్ వాల్, కృష్ణా రివర్ ఫ్రంట్ సుందరీకరణ ఫేజ్-1 పనులకు ప్రారంభోత్సవంతోపాటు, వివిధ ప్రాంతాల్లో రూ.239 కోట్లతో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణ పనులకు మంగళవారం సీఎం శంకుస్థాపన చేశారు. వాస్తవానికి కరకట్ట గోడ నిర్మాణాన్ని టీడీపీ హయాంలోనే ప్రారంభించారు. మొదటి దశ కూడా నిర్మించారు. ఇంతలో ఎన్నికలొచ్చి వైసీపీ అధికారంలోకొచ్చింది. ఈ ప్రభుత్వంలో రెండో దశ నిర్మాణం పనులను చాలాకాలం ప్రారంభించలేదు.

● టీడీపీ ఆధ్వర్యంలో ఆందోళన

కరకట్ట గోడ నిర్మాణాన్ని కొనసాగించాలని టీడీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. కృష్ణానది ఇసుకతిన్నెలలో 2021లో గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమం జరిగింది. దీంతో దిగి వచ్చిన వైసీపీ సర్కార్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఏడాది ముందు హడావిడిగా కరకట్ట పనులు మొదలుపెట్టి పూర్తి చేసింది. పనిలో పనిగా అంచనాలను అదనంగా రూ.50 కోట్లు పెంచి నిర్మాణ పనులు చేపట్టింది. రెండు, మూడో దశ పనులు పూర్తి చేసింది. అయితే ఈ నిర్మాణ పనులు అత్యంత నాసిరకంగా సాగాయనే ఆరోపణలున్నాయి.

ఇళ్ల పట్టాల క్రమబద్ధీకరణలోనూ అదే బిల్డప్

విజయవాడ పురపాలక సంస్థ పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ ముఖ్యమంత్రి జగన్ పత్రాలను అందజేశారు. విజయవాడలో సుమారు 31,866 ఇళ్ల పట్టాలకు సంబంధించి రకరకాల కేటగిరీల్లో ఉన్న పట్టాలను రెగ్యులరైజ్ చేసి లబ్ధిదారులకు జగన్ అందజేశారు. వీటిలో భ్రమరాంబపురంతోపాటు విజయవాడ సెంట్రల్, వెస్ట్, ఈస్ట్ నియోజకవర్గాల్లో 22ఏ కింద పూర్తి హక్కులు లేక రిజిస్ట్రేషన్ చేయడానికి ఇబ్బంది పడుతున్న వారివి కూడా ఉన్నాయి. భ్రమరాంబపురం ఇళ్ల పట్టాల రెగ్యులరైజేషన్ తమ హయాంలోనే జరిగిందని, ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆ పట్టాలు రెగ్యులరైజ్ చేయలేదని సీఎం జగన్ పేర్కొన్నారు. కానీ వాస్తవం అందుకు భిన్నంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో భ్రమరాంబపురంలో ఉన్న ఇళ్లు స్వర్గపురి శ్మశాన భూములు కావడం, అవి ఇరిగేషన్ పరిధిలో ఉండటంతో కేబినెట్ సబ్ కమిటీలో ఇరిగేషన్ స్థలంగా ఉన్న ఆ భూములు రెవెన్యూ భూములుగా జీవో మార్చి ఇవ్వాలని గద్దె టీడీపీ ప్రభుత్వ హయాం నుంచి పట్టుబడుతూనే ఉన్నారు. అసెంబ్లీలో సైతం ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఎట్టకేలకు టీడీపీ హయాంలోనే ఈ ప్రక్రియ పూర్తయి, క్రమబద్ధీకరణకు అంతా సిద్ధమైన తరుణంలో ఎన్నికల కోడ్ రావడంతో 2019లో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్ల కాలం గడిపేసి ఎన్నికల ముందు లబ్ధి కోసం క్రమబద్ధీకరణ పేరుతో హడావుడి చేసింది.

పనులు మావి.. పేరు వారిది : గద్దె రామ్మోహన్, ఎమ్మెల్యే



కృష్ణానదికి రిటైనింగ్ వాల్ చలవ టీడీపీదేనని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. ఎవరి హయాంలో వాల్ నిర్మాణం ప్రారంభమైందో ఇరిగేషన్ అధికారులను అడిగితే తెలుస్తుందన్నారు. మరో రెండునెలలైతే ఈ ప్రభుత్వం ఉండదని, అధికారులు నిర్భయంగా నిజాలను ప్రజలకు తెలపాలని కోరారు.

ఎవరికో పుట్టిన బిడ్డకు తానే తండ్రినన్నట్టు ఉంది : వేముల దుర్గారావు, 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు



రిటైనింగ్ వాల్ నిర్మాణం తామే చేపట్టామని ముఖ్యమంత్రి జగన్ చెబుతుండటం చూస్తుంటే ఎవరికో పుట్టిన బిడ్డకు తానే తండ్రినని చెప్పినట్టుగా ఉందని 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు ఎద్దేవా చేశారు. నిజం ఏమిటనేది ఇరిగేషన్ ఉన్నతాధికారులకు, కృష్ణలంక, రాణిగారితోట ప్రజలకు తెలుసని ఆయన వ్యాఖ్యానించారు.

కాషాయ వందేభారత్ వచ్చింది

సికింద్రాబాద్ - విజయవాడ - విశాఖపట్నం మధ్య రెండో వందేభారత్



- మధ్యాహ్నం విజయవాడ స్టేషన్‌కు రాక..
- రైల్వే అధికారుల స్వాగతం
- బెజవాడకు మూడో వందేభారత్.. విజయవాడ డివిజన్‌కు నాలుగో వందేభారత్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ మీదుగా వెళ్లే మూడో వందేభారత్ రైలుకు మంగళవారం ప్రధాని మోదీ శంకుస్థాపన చేసి ప్రారంభించారు. విజయవాడ రైల్వేస్టేషన్ మధ్యాహ్నం సికింద్రాబాద్ నుంచి వచ్చింది. నూతన వందేభారత్ రైలుకు ఏడీఆర్ఎం శ్రీకాంత్, సీనియర్ డీసీఎం వి.రాంబాబు స్వాగతం పలికారు. నూతన వందే భారత్ రాక సందర్భంగా బెజవాడ స్టేషన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రైలును వీక్షించటానికి పెద్దఎత్తున ప్రజలు వచ్చారు. ఈ రైలులో ప్రయాణించటానికి కూడా పెద్ద సంఖ్యలో ప్రయాణికులు వచ్చారు. కాషాయరంగులో ఉన్న వందేభారత్ రైలు సికింద్రాబాద్ - విజయవాడ - విశాఖపట్నం మధ్య నడవనుంది. ఈ రైలు విజయవాడ మీదుగా వెళ్లే వందేభారత్‌లలో మూడవది కాగా విజయవాడ డివిజన్ మీదుగా వెళ్లే వాటిలో నాల్గవది. నాల్గవ రైలు సికింద్రాబాద్ - తిరుపతి రైలు మాత్రం విజయవాడను టచ్ చేయకుండానే వెళుతుంది. సికింద్రాబాద్ - విజయవాడ - విశాఖపట్నం రైలుతో పాటు విజయవాడ - చెన్నై మధ్యన మరో వందేభారత్ రైలు విజయవాడ మీదుగా నడుస్తుంది. సికింద్రాబాద్ - విజయవాడ - విశాఖ మధ్యన ఇది రెండవ వందేభారత్ రైలు కావటం గమనార్హం. ఈ మార్గంలో ప్రవేశపెట్టిన వందేభారత్ రైలు బెజవాడ - విశాఖ మధ్యన రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ వద్ద ఆగుతుంది.



ఇఫ్తార్ (సాయంత్రం) : 6-17 (బుధ)
సహర్ (ఉదయం) : 5-05 (గురు)

విజయవాడ బైపాస్ రైల్వేలైన్‌కు శంకుస్థాపన

- ముస్తాబాద నుంచి రాయనపాడు వరకు 21.6 కిలో మీటర్లు

- 6లో..

ప్రైవేటుకు.. బార్లు!

కమీషన్ల కోసం ఏపీటీడీసీ నిర్వాకం

- రూ.4 కోట్ల ముడుపుల కోసమేనని ఆరోపణలు
- 'విజయవాడ' సహా మొత్తం 40 బార్లు అప్పనంగా..
- రంగం సిద్ధం చేసిన ఉన్నతాధికారులు
- పరోక్ష పద్ధతిలో కట్టబెట్టేందుకు కుయుక్తులు
- ఏపీటీడీసీ బార్ పక్కనే.. మరో బార్‌కు అనుమతి
- ఇప్పటికే కృష్ణవేణి మోటెల్ పక్కన చేరిన కొత్త బార్
- ప్రైవేటు వ్యక్తులతో సంప్రదించి ఆఫర్ చేస్తున్న వైనం

తీవ్రమైన ఆకలిని తీర్చుకోవడానికి పాము తన పిల్లలను తానే చంపి తిన్నట్టుగా.. సాలె పురుగులు ఆహారం కోసం వాటి పిల్లలను అవే తిన్నట్టుగా.. కమీషన్లకు కక్కుర్తిపడిన పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఇదే పద్ధతిని అనుసరిస్తోంది. ఏపీటీడీసీ ఆధ్వర్యంలోని బార్లను నిర్వీర్యం చేసి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతోంది. ఎన్నికలలోపే ఈ ప్రక్రియను ముగించేందుకు ఏపీటీడీసీ ఉన్నతాధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. విజయవాడ డివిజన్ పరిధిలోని హరిత బెర్మ్‌పార్క్‌తో పాటు మిగిలిన పర్యాటక యూనిట్లలో మొత్తం 40 బార్లను ప్రైవేటీకరించేందుకు ప్రణాళికలు రూపొందించారు. దీనికి ప్రతిఫలంగా రూ.4 కోట్లు కమీషన్ల రూపంలో ముడుపులు ముడుతున్నాయని తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆతిథ్య సేవలు అందిస్తున్న ఏపీటీడీసీ టూరిజం పాలసీలో భాగంగా రెండు దశాబ్దాలుగా బార్లను కూడా నిర్వహిస్తోంది. వీటి ద్వారా సంస్థకు భారీగా లాభాలు వస్తున్నాయి. వస్తున్న ఆదాయంలో పది పైసలు కూడా బార్ల అభివృద్ధికి ఖర్చు పెట్టలేదు. కమీషన్లపై ఆశతో బార్లను ప్రైవేటీకరించేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. ఇటీవల వైజాగ్ యాత్రీ నివాస్‌లో స్థానికంగా ఉన్న బార్‌కు అదనంగా ఏపీటీడీసీ స్థలాన్ని ప్రభుత్వ బారుకు అనుమతిచ్చింది. దీంతో అప్పటి వరకు పర్యాటక బారు సాధిస్తున్న రూ.లక్షన్నర ఆదాయం కాస్తా రూ.50 వేలకు పడిపోయింది. ఏపీటీడీసీ స్థలంలో ఏర్పాటు చేసిన బారు ఆదాయం మాత్రం పెరిగిపోయింది. ఈ పేరుతో ఏపీటీడీసీ బారు నష్టాల్లో ఉందన్న సాకు చూపుతూ దానిని ఓఅండ్ఎం కింద ప్రైవేటుకు ఇవ్వాలని ఏపీటీడీసీ అధికారులు భావిస్తున్నారు.

కృష్ణవేణి మోటెల్‌లోని బార్ పరిస్థితిదీ..

విజయవాడ డివిజన్‌లోని ప్రకాశం బ్యారేజీ చివరన ఉన్న కృష్ణవేణి మోటెల్‌లో ఏపీటీడీసీ బారు ఉంది. ఈ మోటెల్ బయట మద్యం దుకాణానికి అనుమతి ఇచ్చింది. దీంతో బయటి దుకాణం దగ్గర విక్రయాలు పెరిగాయి. క్రిష్ణవేణి మోటెల్‌లో ఉన్న బారు ఖాళీగా ఉంటోంది. ఈ ఐడియా నచ్చటంతో షైపాడులో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని చూస్తోంది. ఈ పరిణామాలన్నింటినీ గమనించిన తర్వాత తాజాగా విజయవాడ యూనిట్‌పై ఏపీటీడీసీ ఉన్నతాధికారుల చూపు పడింది. హరిత బెర్మ్‌పార్క్, కృష్ణవేణి మోటెల్‌లతోపాటు మొత్తంగా 40 బార్లను ప్రైవేటీకరించాలని నిర్ణయించింది.

ప్రైవేటీకరణ కోసం పరోక్ష పద్ధతి అమలు

ఏపీటీడీసీ బార్లను తీసివేసి ఏకాఏకిన ప్రైవేటు వ్యక్తులకు నిర్వహణ అప్పగిస్తే యూనియన్లపరంగా సమస్యలు వస్తాయి. వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి ఉంది. అందుకే తెలివిగా ఏపీటీడీసీ ఉన్నతాధికారులు కొత్త ఆలోచన చేశారు. బార్ల పక్కనే ఏపీటీడీసీ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు బార్లు పెట్టుకునేందుకు కేటాయించాలని నిర్ణయించారు. నూతన పర్యాటక విధానంలో భాగంగా ఏపీటీడీసీ నేతృత్వంలో బార్ల ఏర్పాటుకు ప్రతిబంధకాలు లేవన్న వాదనలను ఉన్నతాధికారులు తీసుకు వస్తున్నారు. బార్లకు అనుమతులిచ్చేది కూడా తామేనని, నిరభ్యంతరంగా తమ పర్యాటక యూనిట్లలో ఏర్పాటు చేసుకోవచ్చని చెబుతున్నారు.

ప్రైవేటు వ్యక్తులను ఆకర్షించేలా ఆఫర్

తమ యూనిట్లలో బార్లను ఏర్పాటు చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందని ఏపీటీడీసీ ఉన్నతాధికారులు ప్రచారం చేస్తున్నారు. బార్ లైసెన్స్ కోసం విడిగా అయితే రూ.40 లక్షలు కనీస ఫీజుగా కట్టాలని, తమ దగ్గర రూరల్ ఏరియాలో అయితే రూ.3.20 లక్షలు, పట్టణ పరిధిలో అయితే రూ.6.30 లక్షలు చెల్లిస్తే సరిపోతుందని చెబుతున్నారు. దీనివల్ల బార్ లైసెన్స్ ఫీజులో రాయితీ పొందవచ్చునని ఉన్నతాధికారులు ప్రచారం చేస్తున్నారు. బార్‌ను నిర్వహించాలంటే స్థలం కావాల్సి ఉంటుందని, పర్యాటకాభివృద్ధి సంస్థ ఆవరణలో స్వేచ్ఛగా నిర్వహించుకోవచ్చన్న ఆఫర్‌ను కూడా ఇచ్చేస్తున్నారు. స్థలం కోసం భారీగా ఖర్చు చేసే అవకాశం కూడా ఉండదని ఊరిస్తున్నారు. నూతన పర్యాటక విధానం పేరు చెప్పి బార్లను ప్రైవేటీకరించే ఆలోచనలతో.. ముందుకు వెళుతున్న ఉన్నతాధికారుల తీరుపై ఇప్పటికే యూనియన్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాన్ని కోర్టులో సవాల్ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు.

కేంద్రాన్నీ ఖాతాలో వేసుకున్న జగన్

- కనకదుర్గ ఫ్లైఓవర్ ఆయనే నిర్మించారట
- బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్లదీ అదే పరిస్థితి
- చిన్నఅవుటపల్లి - మంగళగిరి బైపాస్ తన ఖాతాలోనే
- చేయని అభివృద్ధికి సొంత డబ్బా

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

సొమ్ము ఒకరిది సోకు మరొకరిది అన్నట్టుగా ఉంది సీఎం జగన్ పరిస్థితి. ఎదురుగా ఏ కట్టడం కనిపించినా అది తన కృషి ఫలితమే అని చెప్పుకునే స్థితి దాపురిస్తోంది. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ జగన్ కొట్టుకునే సొంత డబ్బా హద్దులు దాటేస్తోంది. అబద్ధాలు చెప్పడంలో ఆరితేరిన జగన్ ఒక పక్క కనకదుర్గమ్మ, మరోపక్క కృష్ణమ్మ సాక్షిగా అవే అబద్ధాలను వినిపించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం నిర్మించిన ఫ్లైఓవర్లను, ప్రస్తుతం నిర్మిస్తున్న బైపాస్ రోడ్డును జగన్ తన ఖాతాలో వేసుకున్నారు. విజయవాడ కృష్ణలంకలో కృష్ణానదికి వెంబడి నిర్మించిన రిటైనింగ్‌వాల్, దీన్ని ఆనుకుని అభివృద్ధి చేసిన పార్కు(కృష్ణమ్మ జలవిహారం)ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఇక్కడి నుంచే ప్రజలను ఉద్దేశించి జగన్ ప్రసంగించారు. ప్రతిపక్షాలు అభివృద్ధి... అభివృద్ధి అంటూ గగ్గోలు పెడుతున్నాయని విమర్శలు చేస్తూనే కేంద్రం అభివృద్ధి చేసిన ప్రాజెక్టులను మొత్తం వైసీపీ పాలనలోని అభివృద్ధిగా చూపించారు.

'బెంజ్'లు ఆయనవేనా...

విజయవాడలో ఉన్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి టీడీపీ హయాంలో నిరంతరం బిజీబిజీగా ఉండే బెంజ్‌సర్కిల్‌లో రెండు ఫ్లైఓవర్‌ను నిర్మించాలని భావించింది. కేంద్రంతో సంప్రదింపులు చేసి జాతీయ రహదారికి రెండు వైపులా రెండు ఫ్లైఓవర్లను మంజూరు చేయించింది. ఒక్కో ఫ్లైఓవర్‌ను రూ.88 కోట్లలో నిర్మించాలని తలపెట్టింది. మొదటి ఫ్లైఓవర్ పనులు టీడీపీ హయాంలో ప్రారంభమయ్యాయి. దాదాపుగా ఫ్లైఓవర్‌ను పనులన్నీ ఆ ప్రభుత్వంలోనే పూర్తయ్యాయి. 2019లో జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్లైఓవర్‌ను ముస్తాయి చేయించుకుని ప్రారంభించారు. ఇక రెండో ఫ్లైఓవర్‌కు అన్ని అనుమతులు తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడే వచ్చాయి. పనులు ప్రారంభం మాత్రమే జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యాయి. వంతెన పూర్తవ్వగానే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దీన్ని ప్రారంభించారు. ఈ రెండో ఫ్లైఓవర్‌ను తన ఖాతాలో జగన్ వేసుకున్నారు.



విజయవాడ బెంజ్‌సర్కిల్ వద్ద నిర్మించిన ఫ్లై ఓవర్ (ఫైల్ ఫొటో)

'కనకదుర్గ'కు కారణం ఆయనేనట

జాతీయ రహదారులు సాధారణంగా మిగిలిన ఇతర ప్రాంతాల్లో నగరాల బయట నుంచి వెళ్తాయి. విజయవాడలో మాత్రమే నగరం మధ్య నుంచి జాతీయ రహదారులు వెళ్తాయి. ఇందులో హైదరాబాద్ జాతీయ రహదారి ఒకటి. దీనివల్ల పశ్చిమ నియోజకవర్గంలోని కనకదుర్గ ఆలయం ముందు విపరీతమైన వాహనాల రద్దీ ఉండేది. భారీ వాహనాలన్నీ నగరం మధ్య నుంచే రాకపోలు సాగించాల్సిన పరిస్థితి. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని తెలుగుదేశం ప్రభుత్వం భావించింది. ఇందుకోసం పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ దాటిన తర్వాత ఉన్న రాజీవ్‌గాంధీ పార్కు నుంచి భవానీపురంలోని సితార సెంటర్ వరకు భారీ ఫ్లైఓవర్‌ను నిర్మించడానికి పూనుకుంది. కేంద్రంతో సంప్రదించి ఈ ఫ్లైఓవర్‌ను సాధించింది. రూ.502 కోట్లతో [illegible] ఫ్లైఓవర్‌ను నిర్మించారు. 2019 ఎన్నికలకు ముందే ఈ ఫ్లైఓవర్ పూర్తయింది. చిన్న చిన్న పనులు మాత్రమే మిగిలి ఉండగా ఎన్నికల కోడ్ వచ్చింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అంతా పూర్తయిన ఫ్లైఓవర్‌ను జగన్ ప్రారంభించి ఇది తన అభివృద్ధి అని చెప్పుకుంటున్నారు.

బైపాస్ నాదే...

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా దశల వారీగా జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తోంది. ప్యాకేజీలుగా ఈ పనులను పూర్తి చేస్తోంది. పూర్తయిన రహదారులను ప్రధాని నరేంద్ర మోదీ కొన్నిరోజులుగా ప్రారంభిస్తున్నారు. త్వరలో నిర్మించబోయే రహదారులకు భూమిపూజ చేస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులకు రెండు రోజుల క్రితం ఆయన శంకుస్థాపనలు చేశారు. ప్రస్తుతం విజయవాడ బైపాస్ రోడ్డును ప్యాకేజీలుగా నిర్మిస్తున్నారు. ఇందులో చినఅవుటపల్లి నుంచి మంగళగిరి ప్యాకేజీలో పనులు జరుగుతున్నాయి. ఇది పూర్తిగా కేంద్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నడుస్తోంది. ఈ బైపాస్ రోడ్డును మరో రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకువస్తామని జగన్ కృష్ణమ్మ పక్కన నిలబడి ప్రకటించారు. మొత్తంగా టీడీపీ హయాంలో పూర్తయిన ప్రాజెక్టులను, కేంద్రం పూర్తిచేస్తున్న ప్రాజెక్టులను తన అభివృద్ధిగా జగన్ చెప్పుకోవడం గమనార్హం. అభివృద్ధి గురించి మాట్లాడే ప్రతిపక్షాలకు ఇదే తన అభివృద్ధి అని అబద్ధాలతో చూపించే ప్రయత్నం చేశారు.

శరత్ బెయిల్‌పై ముగిసిన వాదనలు

- తీర్పు ఈనెల 14కి రిజర్వ్

విజయవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ ఎగవేత కేసులో అరెస్టయిన మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ బెయిల్ పిటిషన్‌పై విజయవాడ మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో మంగళవారం వాదనలు ముగిశాయి. ప్రాసిక్యూషన్ తరఫున సీఐడీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.సత్యనారాయణ వాదనలు వినిపించారు. శరత్ నకిలీ ఇన్వాయిస్‌లు, బిల్లుల ద్వారా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌గా రూ.100 కోట్ల కుంభకోణం చేశారని వాదించారు. అతడికి బెయిల్ ఇస్తే సాక్ష్యాలను ట్యాంపరింగ్ చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. పైగా శరత్ రాష్ట్రం నుంచి పారిపోయే సూచనలు ఉన్నాయన్నారు. అంతేగాకుండా కేసు సీఐడీకి బదిలీ అయిందని, బెయిల్ ఇచ్చే అధికారం ఈ కోర్టుకు లేదని వాదించారు. ప్రత్తిపాటి పుల్లారావు పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కాంట్రాక్ట్ సంస్థలను ప్రలోభపరుచుకుని ఈ స్కాం చేశారన్నారు. శరత్ నుంచి మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉందన్నారు. దీనిపై శరత్ తరఫున న్యాయవాది కిలారు బెనర్జీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఆరో సాక్షి ప్రభుత్వ ఉద్యోగి అని, ఆయనను బెదిరించే అవకాశం లేదని చెప్పారు. టీడీపీ హయాంలో పుల్లారావు అసలు పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేయలేదని వాదించి, అందుకు సంబంధించిన జీవోలను కోర్టు ముందు ఉంచారు. ఇరు న్యాయవాదుల వాదనలు విన్న న్యాయాధికారి కరీముల్లా తీర్పును ఈనెల 14వ తేదీకి రిజర్వ్ చేశారు.



తెలుగుదేశం పార్టీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

ఎన్నికల్లో వైసీపీ గల్లంతవడం ఖాయం

- రవీంద్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

మచిలీపట్నం టౌన్, మార్చి 12 : టీడీపీ, జనసేన, బీజేపీ సునామీలో వైసీపీ గల్లంతవడం ఖాయమని మాజీమంత్రి, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. 12వ డివిజన్ భాస్కరపురంలో మంగళవారం రవీంద్ర జనసేన నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన నూకల రాధాకృష్ణ, నిమ్మగడ్డ వాసు, కొమ్మన బాబీ, నూకల తేజారామ్‌లకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఇంటింటికి పర్యటించి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కావాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. బందరు అభివృద్ధి కోసం సమిష్టిగా సైనికుల్లా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఐపీసీ కరుణకుమార్, ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, బొమ్మిడి శ్రీరాములు, నాయుడు తులసి, చింతా సోమేశ్వరరావు, వీరంకి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.



అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన యాదవ సంఘ నాయకులు

గుడివాడ టీడీపీ గెలుపులో భాగస్వాములవుతాం

- యాదవ సంఘం నాయకులు

గుడివాడ, మార్చి 12 : గుడివాడలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము గెలుపులో భాగస్వామ్యులవుతామని నియోజకవర్గ యాదవ సంఘ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలో రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు సమక్షంలో యాదవ సంఘ నాయకులు లోయ శివాజీ, మాగంటి పాండురంగారావు, మెరుగుమాల రవికుమార్, ఆగొల్లు బాలాజీ, దళిత నాయకులు మత్తే సూర్యచంద్రరావులు టీడీపీలో చేరారు. వీరికి అచ్చెన్నాయుడు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గుడివాడలో అతి త్వరలో వేలాదిమందితో బహిరంగసభను నిర్వహిస్తామని, ఈ సభలో పెద్ద ఎత్తున బీసీ నాయకులు పార్టీలో చేరనున్నట్టు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొండా ఉమా

భావితరాల భవిష్యత్తు కోసం గెలిపించండి

- బొండా ఉమా పిలుపు

అజిత్‌సింగ్‌నగర్ : భావితరాల భవిష్యత్తు కోసం తెలుగుదేశం, జనసేన పార్టీలను గెలిపించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని షాదీఖానాలో సెంట్రల్ నియోజకవర్గం జనసేన పార్టీ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన ముందుగా ఎన్టీఆర్, వీఎం. రంగాల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బొండా ఉమా మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలన విముక్తి కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ ఒక్కటయ్యారని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదన్నారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ చేయనున్న అభివృద్ధిలో జనసేన కూడా భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. విజ్ఞులైన ప్రజలు సైకిల్ గుర్తుపై ఓటు వేసి మళ్లీ తమ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వెనిగండ్ల, రావి

మాలలకు తగిన రాజకీయ గుర్తింపునివ్వండి

- వెనిగండ్లకు జైభీమ్ ఆర్మీ వినతి

గుడివాడ : నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న మాల సామాజిక వర్గానికి రాజకీయంగా, నామినేటెడ్ పదవుల్లో తగిన గుర్తింపునివ్వాలని జైభీమ్ ఆర్మీ సభ్యులు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రామును కోరారు. మంగళవారం రాత్రి స్థానిక ఫంక్షన్ హాల్‌లో జైభీమ్ ఆర్మీ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి కాకొల్లు భస్కొకరరావు, దళిత సంఘం నాయకులు గొర్రుముచ్చు నరసింహారావుల ఆధ్వర్యంలో మాలల అభివృద్ధి, సంక్షేమానికి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెనిగండ్ల మాట్లాడుతూ, మాలల అభివృద్ధి, సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందన్నారు. వైసీపీ పాలనలో రద్దు చేయబడిన సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరిస్తామని చంద్రబాబు ప్రకటించారని గుర్తుచేశారు. పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ, గతంలో జగన్‌రెడ్డి చేసిన తప్పుడు వాగ్దానాలు, మాయమాటలను రాష్ట్ర ప్రజలు నమ్మి ఒక్క అవకాశం ఇవ్వగా ప్రజలను అన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేశాడన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలుస్తామని ముక్తకంఠంతో తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, యలవర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని బాబ్జీ, వాసే మురళీ, చాట్రగడ్డ రవికుమార్, గడ్డం ప్రకాష్‌దాసు, మెరుగు మోజెస్, జోజిబాబు, నీరుడు సురేష్, రమేష్, కర్రే వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

చట్ట విరుద్ధంగా ప్రకటన చేసే వారిపై చర్యలు : డీఎంహెచ్‌వో

మచిలీపట్నం టౌన్, మార్చి 12 : చట్టరీత్యా వైద్య, ఆరోగ్యశాఖ సూచనల మేరకు ఎవరైనా ప్రైవేటు వైద్యులు, నర్సులు చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో గీతాబాయి హెచ్చరించారు. మంగళవారం డీఎంహెచ్‌వో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు కాకుండా గుగుల్‌లో ప్రకటనలు చేసినా, ప్రచురణలు చేసినా చట్టరీత్యాచర్యలు తప్పవన్నారు. మొదటి తప్పుకు షోకాజ్ నోటీసు, రెండో తప్పుకు రూ. 25వేల జరిమానా, మూడో తప్పునకు చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు.

టీడీపీ ఫ్లెక్సీల తొలగింపుపై రగడ

- సర్దిచెప్పి పంపేసిన పోలీసులు

మచిలీపట్నం టౌన్, మార్చి 12 : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీల తొలగింపు వివాదాస్పదమైంది. మంగళవారం టీడీపీ ఫ్లెక్సీలను మునిసిపల్ సిబ్బంది తొలగిస్తుండగా, తెలుగుయువత నాయకులు అడ్డుకున్నారు. వైసీపీ ఫ్లెక్సీలను వదిలిపెట్టి టీడీపీ ఫ్లెక్సీలను మాత్రం తొలగించడమేంటని మునిసిపల్ సిబ్బందిని ప్రశ్నించడంతో ఉద్రిక్తతకు దారితీసింది. కోనేరు సెంటర్, కూడలి ప్రాంతాల్లో వైసీపీ భారీ ఫ్లెక్సీలుండగా వాటిజోలికి వెళ్లకుండా టీడీపీకి చెందిన చిన్న చిన్న ఫ్లెక్సీలను మునిసిపల్ సిబ్బంది తొలగించడంతో తెలుగుయువత టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కట్టా దుర్గా తదితరులు అడ్డుకున్నారు. అప్పటికే సగం ఫ్లెక్సీలను సిబ్బంది తొలగించేశారు. అనంతరం అక్కడకు చేరుకున్న పోలీసులు వారికి నచ్చజెప్పి పంపేశారు.



బైక్‌పై వెళుతూ ఫ్లెక్సీ చించేస్తున్న వైసీపీ కార్యకర్తలు

మితిమీరిపోతున్న వైసీపీ కార్యకర్తల ఆగడాలు..

మచిలీపట్నం మెయిన్‌రోడ్డులో ర్యాలీగా వెళుతున్న వైసీపీ కార్యకర్తలు డివైడర్‌పై ఉన్న టీడీపీ బ్యానర్లను చించివేశారు. ఒక పక్కన ఫ్లెక్సీల రగడ జరుగుతున్న నేపథ్యంలో వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రోడ్డుపై వెళుతూ ఫ్లెక్సీలు తొలగించడం చర్చనీయాంశమైంది. అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలు వారిస్తున్నా.. పోలీసులు చూస్తూ మిన్నకుండిపోయారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా టీడీపీ కార్యకర్తలను దూరంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేయడం కొసమెరుపు.

ఈవీఎంలకు పటిష్ఠ భద్రత

- స్ట్రాంగ్‌రూమ్‌లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

మచిలీపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈవీఎంలకు పటిష్ఠమైన భద్రతను కల్పించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నట్టు కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌లు, ఈవీఎంలు అందజేసే కేంద్రాలను ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత జిల్లాకేంద్రంలో ఉన్న ఈవీఎం గూడౌన్‌నుంచి ఆయా నియోజకవర్గాలలో ఎంపికచేసిన స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంలను తరలించి భద్రపరుస్తామన్నారు. పోలింగ్‌కు ముందు రెండవస్థాయిలో ఈవీఎంలను అసెంబ్లీ నియోజకవర్గాలలోని పోలింగ్ కేంద్రాలకు కేటాయించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఈవీఎంల భద్రతకు సంబంధించి పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలను కౌంటింగ్ నిమిత్తం మచిలీపట్నంలోని కృష్ణాయూనివర్సిటీకి అత్యంత భద్రత మధ్య తరలించడం జరుగుతుందన్నారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ, పోలింగ్ తరువాత ఈవీఎంల స్వీకరణ కోసం రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ, ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ఠభద్రతను ఏర్పాటు చేస్తామన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లు ఉన్న ప్రాంతాలను నిషేధిత ప్రాంతాలుగా ప్రకటించడం జరిగిందన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఏఎస్పీ ఎస్‌వీడి ప్రసాద్, డీఎస్పీలు, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పర్యటనలో పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డులో ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ అద్నాన్

విజయవాడ బైపాస్ రైల్వేలైన్‌కు శంకుస్థాపన

- ముస్తాబాద నుంచి రాయనపాడు వరకు 21.6 కిలోమీటర్లు
- రూ.475 కోట్లతో నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన
- గూడూరు-బిట్రగుంట-కార్వాడిల మధ్య థర్డ్‌లైన్ ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ బైపాస్ లైన్‌కు రైల్వే శ్రీకారం చుట్టింది. ఇప్పటికే దీనికి సంబంధించిన పనులు ప్రారంభం కాగా.. మంగళవారం ప్రధాని మోదీ పనులకు శంకుస్థాపన చేశారు. విజయవాడ స్టేషన్‌కు టచ్ కాకుండా నేరుగా ముస్తాబాద నుంచి రాయనపాడు శాటిలైట్ స్టేషన్‌కు చేరుకునేలా విజయవాడ బైపాస్ లైన్ నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం రూ.475 కోట్లను ఖర్చు చేస్తోంది. విజయవాడ బైపాస్ లైన్ ముస్తాబాద నుంచి ప్రారంభమై గుణదల సమీపంలో ఆర్‌వోఆర్ మీదుగా నూతన లైన్ ద్వారా ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి రాయనపాడు సమీపంలో అనుసంధానమౌతుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ముస్తాబాద-గుణదల లైన్ల సమీపంలో రైల్ ఓవర్ రైల్ (ఆర్‌వోఆర్) బ్రిడ్జిని నిర్మిస్తారు. ఇప్పటికే దీనికి సంబంధించిన పనులను ముస్తాబాద-గుణదల మధ్య ప్రారంభించారు. ప్రాజెక్టుకు సంబంధించి ఆరు కిలోమీటర్ల మేర పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు అధికారికంగా ప్రధాని మోదీ మంగళవారం శంకుస్థాపన చేశారు. విజయవాడ బైపాస్ లైన్‌లో భాగంగా మొత్తం ఎనిమిది వంతెనలు, 10 మైనర్ వంతెనలు వస్తాయి. ఈ లైన్ వల్ల విజయవాడ స్టేషన్‌కు అనుసంధానం కాకుండానే అనేక రైళ్లను నేరుగా రాయనపాడుకు పంపించవచ్చు. రాయనపాడును ఇప్పటికే శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే. గుణదల స్టేషన్‌ను కూడా శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేస్తున్నారు. ఇదే మార్గంలో రైళ్లు ఆగి రాయనపాడు శాటిలైట్ స్టేషన్‌కు చేరుకుంటాయి. విజయవాడ స్టేషన్‌పై రద్దీ తగ్గించటానికి వీలుగా బైపాస్ లైన్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది.



విజయవాడ బైపాస్ లైన్ వర్చువల్‌గా ప్రారంభిస్తున్న అధికారులు

ప్రధాని ప్రారంభోత్సవం చేసిన ప్రాజెక్టులు ఇవే..

గూడూరు-బిట్రగుంటల మధ్య రూ.1243.92 కోట్ల వ్యయంతో 77 కిలోమీటర్ల మేర తలపెట్టిన థర్డ్‌లైన్ పనులను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ మార్గంలో 16 మేజర్ బ్రిడ్జిలు, 160 మైనర్ బ్రిడ్జిలు, 2.1 కిలోమీటర్ల ఒక ఆర్‌వోఆర్, 12 నూతన రైల్వేస్టేషన్ల నిర్మాణం జరిగింది. ఈ స్టేషన్లలో రెండింటికి ఇప్పటికే హాల్టింగ్ కూడా ఇచ్చారు. బిట్రగుంట-కార్వాడిల మధ్య రూ.1576.83 కోట్ల వ్యయంతో 89 కిలోమీటర్ల మేర తలపెట్టిన లైన్ పనులను కూడా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా మేజర్ బ్రిడ్జిలు 31, మైనర్ బ్రిడ్జిలు 132, నూతన స్టేషన్లు 9 నిర్మించారు. కార్వాడి మధ్యన రూ.3280 కోట్ల వ్యయంతో 125 కిలోమీటర్ల మేర నిర్మించిన థర్డ్ లైన్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. 18 మేజర్ బ్రిడ్జిలు, 106 మైనర్ బ్రిడ్జిలు, 23 నూతన స్టేషన్లను నిర్మించారు. వీటిలో పది స్టేషన్లలో రైళ్లకు హాల్టింగ్ కూడా అమలు చేస్తున్నారు.



ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న రైతు, కార్మిక సంఘాల నేతలు

రేపు మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టండి

- రైతు, కార్మిక సంఘాల నేతల పిలుపు

ధర్నా చౌక్, మార్చి 12 : సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. 14న ఢిల్లీలో జరిగే భారీ బహిరంగ సభకు రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో రైతులు, కార్మికులు పాల్గొనాలన్నారు. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక నేతలు మాట్లాడారు. రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను గత రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని మండిపడ్డారు. రద్దు చేసిన వ్యవసాయ నల్లచట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. వ్యవసాయరంగం మొత్తాన్ని అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబరు కోడ్‌లను తక్షణమే రద్దు చేయలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తుపెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. రైతు సంఘం సీనియర్ నేత వై.కేశవరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు, రైతు సంఘం నేత జి.ఈశ్వరయ్య, పి.జమలయ్య, వి.కృష్ణయ్య, మరీదు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి

- జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

మచిలీపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. జెడ్పీ స్థాయిసంఘాల సమావేశాలు మంగళవారం జెడ్పీలో జరిగాయి. 1వ స్థాయిసంఘం సమావేశానికి అధ్యక్షత వహించిన హారిక మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని అన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులను సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థినీ, విద్యార్థులను చైతన్యవంతం చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. మిచౌంగ్‌తుపాను కారణంగా పంటలు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కొంతమందికి జమకాలేదని జెడ్పీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. రైతులందరికీ పరిహారం జమ అవుతుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఏప్రిల్ మొదటివారంలో తాగునీటి అవసరాలకోసం కాలువలకు నీటిని విడుదల చేస్తారని, తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, డెప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్ చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఉమ్మడికృష్ణాజిల్లాల అధికారులు పాల్గొన్నారు.



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

స్పా కేంద్రాలపై దాడులు

విజయవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ, కృష్ణాజిల్లాలో రహస్యంగా నడుస్తున్న స్పా కేంద్రాలపై ఎస్ఈబీ పోలీసులు మంగళవారం మెరుపుదాడులు నిర్వహించారు. 62 మందితో కూడిన పది ప్రత్యేక బృందాలు పటమట, మాచవరం, పెనమలూరు, సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఆరు స్పా కేంద్రాల్లో సోదాలు నిర్వహించాయి. థాయ్‌లాండ్ ఇతర దేశాల యువతులతో వ్యభిచారం చేయిస్తున్నట్టు నిర్ధారించారు. మొత్తం ఐదుగురు నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. థాయ్‌లాండ్‌కు చెందిన ముగ్గురు యువతులతోపాటు 24 మంది మహిళలకు విముక్తిని కల్పించారు. ఈ కేంద్రాలను అరికట్టడంలో నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంటామని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు.

కన్నతండ్రే కాటేశాడు!

- కూతురుపై పలుమార్లు లైంగిక దాడి!
- వీరవల్లిలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 12 : కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రి కర్కశంగా ప్రవర్తించాడు. కన్నకూతురుపైనే లైంగికదాడికి ఒడిగట్టాడు. తల్లికి తన బాధను చెప్పుకోవటంతో కుమార్తెతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. వీరవల్లికి చెందిన బాలిక గ్రామంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. గతేడాది డిసెంబరులో ఇంట్లో ఎవరూలేని సమయంలో కూతురుపై తండ్రి లైంగికదాడికి పాల్పడి.. విషయం ఎవరికీ చెప్పవద్దని, చెబితే చంపేస్తానని బెదిరించాడు. అప్పటి నుంచి పలుమార్లు బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తన బాధను తల్లికి చెప్పుకోలేక, తండ్రిని నిలువరించలేక తల్లడిల్లింది. చివరకు జరిగిన దారుణాన్ని తల్లికి వివరించడంతో తల్లి భర్తను ప్రశ్నించింది. దాంతో పొంతన లేని సమాధానాలు చెప్పి ఇంటి నుంచి పారిపోయాడు. చివరికి తల్లి కుమార్తెతో కలిసి వీరవల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు బాలిక తండ్రి ఆచూకీ కోసం గాలింపుచర్యలు చేపట్టారు.



అవనిగడ్డ వైద్యశాల వద్ద ఆందోళన చేస్తున్న దివ్యశ్రీ బంధువులు

వ్యాన్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోండి

- బాలిక బంధువుల ఆందోళన

అవనిగడ్డ, మార్చి 12 : మోపిదేవి మండలంలోని కొక్కిలిగడ్డ వద్ద కృష్ణానది కరకట్టపై వ్యాన్ ఢీకొని మృతి చెందిన బొద్దు దివ్యశ్రీ మృతికి కారకులను వెంటనే అదుపులోకి తీసుకోవాలని బాలిక బంధువులు మంగళవారం అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాల వద్ద ఆందోళన చేపట్టారు. జనసంచార ప్రాంతంలో మితిమీరిన వేగంతో వ్యాన్ నడిపిన డ్రైవర్ బాలిక మృతికి కారకుడయ్యాడని దివ్యశ్రీ బంధువులు ఆరోపించారు. వెంటనే వ్యాన్ డ్రైవర్, ఓనర్‌ను అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టాలని మృతురాలి బంధువులు, తల్లిదండ్రులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు.

డబ్బులు స్వాహా కేసులో జగదీష్‌తో ఎలాంటి సంబంధం లేదు

- ఐవీవై ఓవర్‌సిస్ యాజమాన్యం

విద్యాధరపురం, మార్చి 12 : యూకే వీసా ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి డబ్బులు స్వాహా చేసిన కేసులో జీపీఏ జగదీష్‌తో తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని ఐవీవై ఓవర్‌సిస్ యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. జగదీష్‌ను తమ సంస్థ నుంచి 2020 డిసెంబరులోనే వ్యక్తిగత కారణాలతో తొలగించినట్టు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.33

అనుమానాస్పద స్థితిలో డాన్స్‌మాస్టర్ మృతి

పాయకాపురం, మార్చి 12 : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం అయోధ్యనగర్‌కు చెందిన గుంట్ల కృష్ణ(41) డ్యాన్స్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో తల్లి వద్దనే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం కండ్రిక పాతపాడు రోడ్డు వద్ద ఉన్న ప్రభుత్వ వైన్ సమీపంలోని ఓ వెంచర్‌లో నిర్జీవంగా పడి ఉన్నాడు. విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కృష్ణ మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. అయితే ఈనెల 10 నుంచి కృష్ణ ఇంటికి రాలేదని, అప్పటి నుంచి అతని కోసం వెతుకుతున్నామని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీకి ఓటేయండి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, మార్చి 12: రాష్ట్ర ప్రగతితో పాటు రాష్ట్రంలో యువతకు మంచి భవిష్యత్ ఉండాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో, మండేలా పార్కులో వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యేగా తనకు, పార్లమెంట్ సభ్యుడిగా కేశినేని శివనాథ్‌కు సైకిల్ గుర్తుమీద ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల అనుభవం ఉన్న చంద్రబాబు నాయకత్వం రాష్ట్ర అభివృద్ధికి అవసరం అని చెప్పారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు మాట్లాడుతూ జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 300మీటర్ల వాకింగ్ ట్రాక్ ఉంటే అక్కడ వాకర్స్ వాకింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ టీడీపీ రూపొందించే మేనిఫెస్టోలో పెట్టాలని కోరారు. ఈ విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని గద్దె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉషారాణి, ముమ్మనేని ప్రసాద్, నాయకులు గుత్తికొండ సతీష్ చందు, లోకేశ్వరరావు, దూళిపాళ్ల రమేష, నందిపాటి దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



12వ డివిజన్‌లో చిన్నారిని ఎత్తుకున్న గద్దె అనురాధ

టిడ్కో ఇళ్లు పూర్తి చేస్తాం

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

పటమట: టీడీపీ సానుభూతి పరుల ఓట్లను తొలగించి వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని జగన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ ఆరోపించారు. 12వ డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని, 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను పెట్టి జగన్‌కు ఓటు వేయకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు రావని బెదిరింపులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థులు ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్, ఎంపీగా కేశినేని చిన్నిలను అఖండ మెజారిటీలతో గెలిపించాలని అనురాధ కోరారు. కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, శాయన బుజ్జి, కోగంటి రామారావు, కొండవీటి లక్ష్మి ప్రసాద్, మండవ రాంబాబు, ఎం. బుచ్చిబాబు, మాదల చిన్నతల్లిలు పాల్గొన్నారు.

భారతీనగర్: తూర్పు పరిధిలోని గురునానక్ మెయిన్ రోడ్డు సమీపంలోని దూల్‌పేట ఏరియాలో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి గద్దె రామ్మోహన్‌ను, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, డివిజన్ అధ్యక్షులు గొల్లపూడి నాగేశ్వరరావు, కోడూరు ఆంజనేయవాసు, చలసాని రోజా, సలిమిశెట్టి రాజామణి పాల్గొన్నారు.

● తూర్పు పరిధిలోని మూడవ డివిజన్ కామినేని నగర్‌లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తనయులు గద్దె రాజేష్, గద్దె క్రాంతి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పేరేపి ఈశ్వర్, గద్దె రమేష్, కె. హరీష్, జి.వెంకటేశ్వరారావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

● బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 12 : బీసీలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం అజిత్‌సింగ్‌నగర్‌లోని షాదీఖానాలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ రాష్ట్రానికి మళ్లీ పూర్వవైభవం రావాలంటే రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. నాగరాజు, పైడి తులసి, కనకారావు, పైడి శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొండా ఉమా

తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా చింతల అనిల్‌కుమార్

తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా చింతల అనిల్‌కుమార్ నియమితుడయ్యాడు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బొండా ఉమా అనిల్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందజేసి అభినందించారు.

ఇస్త్రీ పెట్టెల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో మంగళవారం ఇస్త్రీ పెట్టెల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బొండా ఉమా పలు పేద కుటుంబాలకు ఇస్త్రీ పెట్టెలను అందజేశారు.

తూర్పు కాపు సామాజికవర్గం ఆత్మీయ సమావేశం

పాయకాపురం: 64వ డివిజన్ కండ్రికలోని తూర్పు కాపుల బజార్ సెంటర్‌లో మంగళవారం తూర్పు కాపు సామాజికవర్గం ఆత్మీయ సమావేశం జరిగింది. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు గొట్టుముక్కల రఘురామరాజు, పరుచూరి ప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వింజమూరి సతీషల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొండా ఉమా తూర్పు కాపు సామాజిక వర్గంతో సమావేశమయ్యారు. అనంతరం టీడీపీలో చేరిన 50 కుటుంబాలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పలగాని భాగ్యలక్ష్మి, సూరవరపు నాగరాజు, దిలీప్, తేళ్ల భవాని పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో ఆదాయం పొందొచ్చు

తనూశ్రీ మష్రూమ్ సెంటర్ డైరెక్టర్ జయచంద్ర



పుట్టగొడుగుల తయారీ వివరిస్తున్న తనూశ్రీ మష్రూమ్ సెంటర్ డైరెక్టర్ టి.జయచంద్ర

మొగల్రాజపురం, మార్చి 12: పుట్టగొడుగులు మంచి పోషకాలు ఉన్న ఆహారం అని వీటి పెంపకం మంచి కుటీర పరిశ్రమ అని దీని వల్ల ఆదాయం కూడా పొందవచ్చని తనూశ్రీ మష్రూమ్ సెంటర్ డైరెక్టర్ టీ. జయచంద్ర అన్నారు. పీబీ సిద్ధార్థలో మంగళవారం వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకం మీద ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావులు మాట్లాడుతూ వర్షాకాలంలో తేమగా ఉండే ప్రాంతాల్లో పెరిగే వీటిని కృత్రిమ పద్ధతుల్లో పెంచవచ్చని చెప్పారు. తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు ఆర్జించవచ్చని చెప్పారు. రెండు వేల రకాల పుట్టగొడుగులు ఉన్నాయని వాటిలో తినడానికి పనికొచ్చేవి అతి తక్కువ అని చెప్పారు వీటిలో మన దేశంలో నాలుగురకాల పుట్టగొడుగులను పెంచడానికి ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. పీబీ సిద్ధార్థ, దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు డి. శ్రావణి, డాక్టర్ ఏ.సాంబనాయక్, సీహెచ్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బొండా ఉమాను గెలిపించాలి

మధురానగర్, మార్చి 12: అభివృద్ధి సంక్షేమం, యువత ఉద్యోగాలు, ఉపాధి కోసం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బొండా ఉమాను సైకిల్ గుర్తుమీద ఓటేసి గెలిపించాలని ఆయన సతీమణి బొండా సుజాత విజ్ఞప్తి చేశారు. మంగళవారం 29వ డివిజన్ మధురానగర్ పప్పుల మిల్లు ఏరియాలో రమాదేవి స్కూల్ రోడ్డు, నేతాజీ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పీవీఆర్, ఇన్‌చార్జి నెక్కంటి ప్రసాద్, డివిజన్ తెలుగు మహిళ అధ్యక్షురాలు బేవర రాజి, బీసీ నాయకులు సింగం వెంకన్న, డివిజన్ కవిటీ నాయకులు రామినాయుడు, అంగిరేకుల రాంబాబు, ప్రసాద్, వెంకట రమణ, భుజంగరావు, కొండలరావు, జయరాములు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



స్థానిక మహిళలకు పథకాలను వివరిస్తున్న బొండా సుజాత

ఓల్డేజ్ హోమ్‌కు హాస్పిటల్ బెడ్స్, రిఫ్రిజిరేటర్ అందజేత

భవానీపురం, మార్చి 12 : వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో గోశాల గ్రామంలో నిర్వహిస్తున్న ఓల్డేజ్ హోమ్‌కు రూ.2లక్షల విలువైన హాస్పిటల్ బెడ్స్, రిఫ్రిజిరేటర్, వంటపాత్రలను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ ఆఫీస్ విజయవాడ జనరల్ మేనేజర్ రవీంద్రబాబు మంగళవారం అందజేశారు. బ్యాంక్ ఆధ్వర్యంలో జరుగుతున్న పవర్ హిమ్ అండ్ ఎంపవర్ హర్ అనే కార్యక్రమం కింద అందజేశారు. డిప్యూటీ జోనల్ హెడ్ శారదామూర్తి, విజయవాడ రీజనల్ హెడ్ శ్రీధర్, వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బి. కీర్తి, గోశాల గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

ఫర్టికేర్ ఐవీఎఫ్‌లో నెలాఖరు వరకు ప్రత్యేక ఆఫర్

భవానీపురం, మార్చి 12 : బెంజిసర్కిల్ వద్ద ఉన్న ఫర్టికేర్ ఐవీఎఫ్ సెంటర్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఈ నెలాఖరు వరకు ప్రత్యేక ఆఫర్ ఇవ్వనున్నట్లు క్లినికల్ హెడ్ డాక్టర్ ప్రత్యూష ఒక ప్రకటనలో తెలిపారు. సంతానలేమితో ఉన్న వారి సమస్యలను పరిష్కరించడంలో తమ క్లినిక్ మంచి విజయాలను సాధించిందన్నారు. అధునాతన సాంకేతిక ఇన్విట్రో ఫెర్టిలైజేషన్ ద్వారా విజయవంతంగా గర్భం దాల్చి తల్లులు అవుతున్నారని ప్రత్యూష వివరించారు. ఐవీఎఫ్ ప్రొసీజర్లపై ప్రత్యేకమైన 50 శాతం తగ్గింపుతో ఉచిత కన్సల్టెంట్, స్కాన్, ఐయూఐ అందిస్తుందన్నారు.

మదీనా మసీదులో రంజాన్ ప్రార్థనలు

భవానీపురం, మార్చి 12 : రంజాన్ మాసం ప్రారంభోత్సవం పురస్కరించుకుని లేబర్‌కాలనీలోని మదీనా మసీదులో మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఇఫ్తార్ కార్యక్రమంలో పశ్చిమ వైసీపీ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్ మొహీద్దీన్, పార్టీ నేతలు మైలవరపు దుర్గారావు, బాజీ, మసీదు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, ముజీబ్‌లు పాల్గొన్నారు.

అనాథలకు అండగా కార్పొరేటర్ చంటి

వన్‌టౌన్, మార్చి 12: పశ్చిమ నియోజకవర్గం 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి) మంగళవారం బ్రాహ్మణవీధిలో మానసిక స్థితి సరిగా లేక లేవలేని పరిస్థితిలో ఉన్న వృద్ధురాలు రమణమ్మను బందర్‌రోడ్డులోని నిర్మల్ హృదయ్‌భవన్‌లో చేర్పించారు. ఆమె తాలుకు ఎవరైనా ఉన్నట్లు అయితే నిర్మల్ హృదయ్‌భవన్‌లో సంప్రతించాలని కోరారు.

పీఎం ఉషా పథకానికి లకిరెడ్డి డిగ్రీ కాలేజి ఎంపిక

మైలవరం, మార్చి 12: ప్రధానమంత్రి ఉన్నత విద్య (పీఎం ఉషా) పథకానికి మైలవరంలోని లకిరెడ్డి హనిమిరెడ్డి డిగ్రీ కళాశాల ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇళ్ల రవి మంగళవారం తెలిపారు. ఈపథకం కింద రాబోయే మూడేళ్లలో కళాశాల అభివృద్ధి కోసం రూ.5 కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 కళాశాలలు ఎంపిక కాగా అందులో తమ కళాశాల కావడం సంతోషంగా ఉందన్నారు.

లక్ష ఓట్లు లక్ష్యంగా ముందుకు సాగాలి

● పశ్చిమ జనసేన ఇన్‌చార్జి పోతిన మహేశ్



టిఫిన్ బండ్లు అందజేస్తున్న పోతిన మహేశ్

పాతరాజరాజేశ్వరి పేట, మార్చి 12 : పశ్చిమలో లక్ష ఓట్లు లక్ష్యంగా జనసేన కార్యకర్తలంతా పనిచేయాలని, చిన్న చిన్న ప్రచారాలను నమ్మొద్దని పశ్చిమ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోతిన మహేశ్ అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక 35వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఎన్ఎస్ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్‌లోని రెండు టిఫిన్ బండ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పోతిన మహేశ్ మాట్లాడుతూ పశ్చిమలో జనసేన నాయకుల అందరిదీ ఒకటే లక్ష్యమన్నారు. ఈ మధ్య కాలంలో జరిగిన విస్తృత సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా పనిచేయాలని కోరారు. వైసీపీ సిద్ధమంటే జనసేన రెడీ అనే నినాదం విజయవంతం అయిందన్నారు. నాయకులు వెన్న శివశంకర్, సుమన్ నాయక్, చంటి, రాజ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 12 : కళ్లే లలిత జ్ఞాపకార్థం ప్రతి నెలా 12న కళ్లే లలిత ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్లు కళ్లే సీతామహాలక్ష్మి, కళ్లే జయదుర్గ, మేఘవాణిలు తెలిపారు. సింగ్‌నగర్‌లోని కళ్లే లలిత వీధిలో మంగళవారం కళ్లేలలిత జ్ఞాపకార్థం పేదలకు అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. గుండారపు హరిబాబు, ముప్పూరి హరీష్, ఎం. జశ్విన్, జి. ధ్రువన్, స్థానికులు ఆమెకు నివాళులు అర్పించారు.



అన్నదానం చేస్తున్న లలిత కుటుంబ సభ్యులు

కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ అన్న క్యాంటీన్



వన్‌టౌన్, మార్చి 12: కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) సారథ్యంలో మంగళవారం 52వ డివిజన్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి అడ్డరోడ్డులో మొబైల్ అన్న క్యాంటీన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత పశ్చిమ అధ్యక్షుడు ఆర్.మాధవ, ఆళ్ల మోహనరావులు మాట్లాడుతూ కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది పేద ప్రజలకు సహాయం అందుతుందని, ఆకలి తీరుతుందని పేర్కొన్నారు. ఐటీడీపీ కోఆర్డినేటర్ గూడెల మహేష్, గంటా రాజు, కోనేటి అశోక్, బంకా నాని, కొరికాని సాయి, కే.శంకర్, గుడే అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద విధానంపై అవగాహన సదస్సు

భారతీనగర్, మార్చి 12: ఆంధ్రా లయోల కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఆయుర్వేద విధానంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్యవైద్యశాల డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ బాల త్రిపుర సుందరి హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు ఆహార, జీవన శైలితో పాటు స్వీయ -సంరక్షణకు అనుగుణంగా రూపొందించిన ఆయుర్వేద అభ్యాసాల ప్రాముఖ్యతను తెలిపారు. విద్యార్థులు, స్టాఫ్ కోఆర్డినేటర్ కె.అపర్ణ, హెచ్‌వోడీ ఎస్.బి. నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ బాల త్రిపుర సుందరి

సింగ్‌నగర్‌లో నూతన బస్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన నేడు

బస్సుస్టేషన్, మార్చి 12: ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు బుధవారం అజిత్‌సింగ్‌నగర్‌లో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న బస్టేషన్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. విజయవాడ పరిధిలో ఇప్పటికే ఆటోనగర్, గవర్నర్‌పేట-1, 2, విద్యాధరపురం డిపోలు ఉన్నాయి. జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్ ఎదురుగా సుమారు రెండెకరాల స్థలాన్ని నూతన బస్టేషన్ నిర్మాణానికి కేటాయించింది.

సీఎం మొద్దు నిద్ర.. రైతులకు తీవ్ర నష్టం

● మాజీమంత్రి ఉమా

గొల్లపూడి, మార్చి 12: రాష్ట్రంలో కరవు తాండవిస్తుంటే సీఎం జగన్ మొద్దు నిద్ర పోతున్నాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల జీవితాలు కకావికలం అవుతున్నాయన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో వందేళ్లలో ఎన్నడూ లేనంతగా పంట సాగు తగ్గిపోయి 45 లక్షల ఎకరాలు బీడు భూములుగా మారిపోయన్నారు. 43 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. రాష్ట్రంలో రైతు, రైతు కూలీల నేటి దుస్థితికి కారణం మీరు కాదా జగన్ అని ఉమా ప్రశ్నించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 13 మార్చి 2024
cinema@andhrajyothy.com

కథనార్ కోసం కొత్త లుక్‌లో

అనుష్క శెట్టి కథానాయికగా నటిస్తున్న తొలి మలయాళ చిత్రం 'కథనార్'. సోమవారం ఆమె సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ చిత్రానికి రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. అనుష్క చిత్రీకరణలో పాల్గొన్న ఫొటోలను దర్శకుడు సోషల్ మీడియాలో షేర్ చేయగా వైరల్ అయ్యాయి. చాలా రోజుల తర్వాత అనుష్క కొత్త లుక్ చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. బరువు తగ్గి నాజూగ్గా ఉన్న అనుష్కను చూసి అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కేరళలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతోంది.



రావు రమేష్ హీరోగా 'మారుతి నగర్ సుబ్రమణ్యం'

విలక్షణ నటుడు రావు రమేష్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'మారుతి నగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. రావు రమేష్ సరసన ఇంద్రజ నటించారు. అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి, హర్షవర్ధన్ కీలక పాత్రధారులు. బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మాతలు. ప్రేక్షకులే ముఖ్య అతిథులుగా సరికొత్త రీతిలో మంగళవారం ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ "ఇప్పటి వరకు రావు రమేష్ చేసిన పాత్రలకు పూర్తి భిన్నమైన పాత్రలో ఈ సినిమాలో



కనిపిస్తారు. సినిమా స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు ఎంటర్టైన్ చేస్తారు. పూర్తి స్థాయి వినోదంతో పాటూ ప్రేక్షకులని కదిలించే భావోద్వేగాలు కూడా ఈ సినిమాలో ఉన్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా 'మారుతి నగర్ సుబ్రమణ్యం' ఉంటుంది" అని చెప్పారు. రావు రమేష్ మాట్లాడుతూ " ఫస్ట్ లుక్ పోస్టర్ ఎవరు ఆవిష్కరిస్తే బావుంటుందని అనుకున్నా. నటుడిగా నాకు ఈ స్థాయిని, స్థానాన్ని ఇచ్చిన తెలుగు ప్రేక్షకులే ఆవిష్కరిస్తే బాగుంటుందని మేమంతా మనస్ఫూర్తిగా నమ్మాం. మీరు చూపించిన అభిమానానికి సదా కృతజ్ఞుడిని" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: బొంతల నాగేశ్వర్ రెడ్డి, సినిమాటోగ్రఫీ: ఎంఎన్ బాల రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్: శ్రీహరి ఉదయగిరి, సహ నిర్మాతలు: రుషి మర్ల, శివ ప్రసాద్ మర, ఆర్ట్ డైరెక్షన్: సురేష్ భీమంగని.



రీ రిలీజ్‌కు రెడీ...

ప్రభుదేవా కథానాయకుడిగా శంకర్ దర్శకత్వం వహించిన 'ప్రేమికుడు' చిత్రం అప్పట్లో సంచలన విజయం అందుకున్న సంగతి తెలిసిందే. 1994లో విడుదలైన ఈ చిత్రం అప్పట్లో కుర్రకారును ఓ ఊపు ఊపింది. తమిళంలో క్లాసిక్‌గా నిలిచి, తెలుగులోనూ సూపర్‌హిట్‌గా నిలిచింది. ముఖ్యంగా, యువతీయువకులను ఈ చిత్రం విపరీతంగా ఆకట్టుకుంది. ఏ. ఆర్. రెహమాన్ స్వరపరిచిన 'అందమైన ప్రేమరాణి, 'ఊర్వశీ ఊర్వశీ', 'ఓ చెలియా నా ప్రియ సఖియా', 'ముక్కాల ముక్కాబులా' గీతాలు మ్యూజికల్ సెన్సేషన్ సృష్టించాయి. అప్పటి కుర్రకారు మదిని దోచేసిన 'ప్రేమికుడు', ఈ తరాన్ని కూడా అంతలానే అలరిస్తుందన్న నమ్మకంతో రీ రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం రీ రిలీజ్ రైట్స్‌ను మురళీధర్ రెడ్డి, రమణ దక్కించుకున్నారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని వారు తెలిపారు. దాదాపు 30 ఏళ్ల తర్వాత రీ రిలీజ్ కానున్న ఈ చిత్రం ఒకేసారి ఆ తరాన్ని, ఈ తరాన్ని థియేటర్లలో ఆకట్టుకోనుంది.

కల్యాణీ వచ్చా వచ్చా

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. 'కల్యాణి వచ్చా వచ్చా...' అంటూ సాగే యుగళ గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, గోపీసుందర్ స్వరాలు సమకూర్చారు. మంగ్లీ, కార్తీక్ ఆలపించారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ బేనర్‌పై దిల్‌రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పరుశురామ్ పెట్ల దర్శకుడు. ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కేయూ మోహనన్.





కథానాయిక మీరా చోప్రా వివాహబంధంలోకి అడుగుపెట్టారు. వ్యాపారవేత్త రక్షిత్ కేజ్రీవాల్‌ను ఆమె పెళ్లాడారు. మంగళవారం జైపూర్‌లో కుటుంబ సభ్యులు, కొద్ది మంది సినీ ప్రముఖులు నడుమ ఈ ప్రేమజంట ఒక్కటయ్యారు. తెలుగులో 'బంగారం' 'వాన' చిత్రాలు కథానాయికగా మీరాచోప్రాకు గుర్తింపు తెచ్చాయి.

క్రేజీ కాంబో కుదిరింది



'గజిని' చిత్రం లాంటి సంచలన విజయాలతో ట్రెండ్ సెట్ చేశారు తమిళ దర్శకుడు మురుగదాస్. కొన్నాళ్ల విరామం తర్వాత ఆయన భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. బాలీవుడ్ అగ్రహీరో సల్మాన్‌ఖాన్, మురుగదాస్ కాంబినేషన్‌లో క్రేజీ ప్రాజెక్ట్ సెట్టయింది. మంగళవారం ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. సాజిద్ నడియాడ్‌వాలా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది రంజాన్‌కు ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని సల్మాన్‌ఖాన్ తెలిపారు. భారీ బడ్జెట్‌తో యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది.

వింటేజ్ నరేశ్‌ని మళ్లీ చూస్తారు



అల్లరి నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రం టీజర్‌ను మంగళవారం జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. మల్లి అంకం దర్శకత్వంలో రాజీవ్ చిలక ఈ సినిమా నిర్మిస్తున్నారు. వేసవిలో విడుదల కానుంది. టీజర్‌ను విడుదల చేసిన అనంతరం నరేశ్ మాట్లాడుతూ 'నాన్నగారు తీసిన 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రానికీ, మా సినిమాకూ పోలిక లేదు. జీవితంలో సెటిల్ కాకుండా పెళ్లి చేసుకొనే హీరో కథతో నాన్నగారి సినిమా ఉంటుంది. లైఫ్‌లో సెటిల్ అయినా పెళ్లికాని వాడి కథ మాది. చాలా హిలేరియస్‌గా ఉంటుంది. వింటేజ్ నరేశ్ రావాలని చాలా మంది అడుగుతున్నారు. నా బలం కామెడీ. అందుకే ఈసారి మరింత నవ్వించాలని ఈ సినిమా చేశాం. ఫరియా మంచి కామెడీ టైమింగ్ ఉన్న నటి. అద్భుతంగా నటించింది. హిందీ నటుడు జానీ లివర్ తొలిసారిగా తెలుగులో నటిస్తున్నారు. నిర్మాణానికి కొత్త అయినా రాజీవ్‌గారు మంచి ప్యాషన్‌తో ఈ సినిమా తీశారు. అందరికీ మంచి పేరు తెచ్చే చిత్రమిది' అన్నారు. 'మా బేనర్ చిలకా ప్రొడక్షన్స్‌లో వస్తున్న తొలి సినిమా ఇది. నిర్మాత కావాలనే నా ఇరవై ఏళ్ల కల ఈ సినిమాతో తీరింది. నరేశ్ మంచి నటుడు. ఆయనతో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది' అన్నారు నిర్మాత రాజీవ్ చిలక. 'టీజర్ చూసి ఎలా నవ్వుకుంటున్నారో సినిమా కూడా అంతే వినోదభరితంగా ఉంటుంది. ఫ్యామిలీతో కలసి ఆనందంగా నవ్వుకుంటూ చూసే సినిమా ఇది' అని చెప్పారు దర్శకుడు. నరేశ్‌తో ఇది నాలుగో సినిమా, డైలాగులు రాస్తున్నప్పుడు కిక్ వచ్చిందని రచయిత అబ్బూరి రవి తెలిపారు.



చరిత్రలో నిలిచేలా...

ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ భగవద్గీతను నేటి యువతకు అందించడానికి ఆడియో రూపంలో తీసుకొస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా 'భగవద్గీత విశ్వరూప దర్శనం' అధ్యాయాన్ని హీరో విష్వక్‌సేన్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా విష్వక్‌సేన్ మాట్లాడుతూ 'అందరికీ అర్థమయ్యేలా సంపూర్ణ భగవద్గీత తాత్పర్యం చాలా అద్భుతంగా రికార్డ్ చేసిన ఆర్పీ పట్నాయక్‌కు ధన్యవాదాలు. ఇది చాలా గొప్ప కార్యం. చరిత్రలో నిలిచిపోతుంది' అని ప్రశంసించారు. ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ 'స్వామి ముకుందానంద రాసిన భగవద్గీత అర్థం చేసుకోవడానికి సులువుగా ఉంటుంది. వారి అనుమతితో రికార్డ్ చేశాను. ఇది నాకు దక్కిన అదృష్టం అన్నారు. పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వినోదం పంచే ఓం భీమ్ బుష్



శ్రీహర్ష

శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రలు పోషించిన 'ఓం భీమ్ బుష్' చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. 'హుషారు' చిత్రానికి దర్శకత్వం వహించిన శ్రీహర్ష కొనుగంటి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ' యానివర్సిటీలో చదువుకున్న ముగ్గురు యువకులు ఓ గ్రామంలో గుప్త నిధుల కోసం చేసే అన్వేషణని వినోదభరితంగా ఇందులో చూపించాం. 'ఓం భీమ్ బుష్' అనేది ఓ మ్యాజికల్ ఫ్రేజ్. చిన్న పిల్లలు ఆడుకునేటప్పుడు సరదాగా ఈ మాట అంటుంటారు. అదే మా సినిమాకు టైటిల్‌గా నిర్ణయించాం. కథకు యాప్ట్ టైటిల్ ఇది' అన్నారు. 'ఈ కథలో ప్రతి సన్నివేశం లాజిక్‌తో ముడిపడి ఉంటుంది. ఇందులో బలమైన కథ ఉంది. మంచి ఎమోషన్ కూడా ఉంది. ఇండియన్ స్క్రీన్ మీద ఇప్పటివరకూ రాని పాయింట్ మా సినిమాలో ఉంది. శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ కథ రాశాను' అన్నారు. ఈ చిత్రంలో శ్రీవిష్ణు విశ్వరూపం చూస్తారని చెబుతూ 'ఇందులో కామెడీ టైమింగ్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది. శ్రీవిష్ణు ఇంత ఫుల్ లెంగ్త్ కామెడీ ఇప్పటివరకూ చేయలేదు. ఫస్ట్ షాట్ నుంచి చివరి వరకూ ఓ లాఫ్ రైడ్‌లో ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు' అని చెప్పారు శ్రీహర్ష. చిత్ర నిర్మాతలు గురించి చెబుతూ 'వంశీ, విక్రమ్, సునీల్ ఈ సినిమా నిర్మించారు. నాకు పూర్తి స్వేచ్ఛ నిచ్చారు. ఇలాంటి నిర్మాతలు దొరకడం నా అదృష్టం. బిజినెస్ కూడా పెద్ద రేంజ్‌లో జరిగింది. తప్పకుండా మ్యాజిక్ క్రియేట్ చేస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు శ్రీహర్ష.

నా దేశం కోసం 'రజాకార్' తీశా

గూడూరు నారాయణరెడ్డి

'నా శేషజీవితంలో ఏదో ఒక మంచి పని చేయాలి. చరిత్రలో నిలిచిపోవాలి. చరిత్రను సినిమాగా తీసి ఈ సమాజానికి తెలియజేయాలని అనుకున్నా. అందుకే హై క్వాలిటీతో రూ. 50 కోట్ల బడ్జెట్‌తో 'రజాకార్' సినిమా తీశా. నా దేశం కోసం, దేశప్రజల కోసం ఈ సినిమా తీశా' అన్నారు గూడూరు నారాయణరెడ్డి. ఆయన నిర్మించిన 'రజాకార్' చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, మరాఠీ బాషల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడిస్తూ ' రెండేళ్ల క్రితం నేను తిరుపతిలో ఉన్నప్పుడు నాకు ఈ సినిమా చేయాలనే ఆలోచన వచ్చింది. నా ఇష్ట దైవం వేంకటేశ్వరుడు ఈ సినిమా తీయమని నాతో చెప్పాడనిపించింది. వెంటనే దర్శకుడు యాటా సత్యనారాయణకు ఫోన్ చేశా. రజాకార్లు మళ్లీ పుట్టొద్దు అనే కారణంతోనే ఈ సినిమా నిర్మించాను. నాకు ఏ మతం మీద వ్యతిరేకత లేదు. ముస్లింలకు వ్యతిరేకిని కాను. ఏడవ నిజాంను మాత్రం వ్యతిరేకిస్తా. నా ఆలోచనకు దర్శకుడు సత్యనారాయణ న్యాయం చేశాడు. బడ్జెట్ పెరగడం వల్ల ఇబ్బంది ఎదురైంది కానీ సినిమా బాగా వచ్చింది. తెలంగాణలో పుట్టిన వ్యక్తి తీసిన బెస్ట్ సినిమా ఇదని గట్టిగా చెప్పగలను' అన్నారు నారాయణరెడ్డి. సినిమాకు హిందీలో కూడా రెస్పాన్స్ బాగుందని ఆయన తెలిపారు.

చాణక్యుడు, చంద్రగుప్తుడిని కలిపితే చిరంజీవి



చైతన్య రావు, భూమి శెట్టి జంటగా నటించిన చిత్రం "షరతులు వర్తిస్తాయి". కుమారస్వామి(అక్షర) దర్శకత్వం వహించారు. నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. "షరతులు వర్తిస్తాయి" సినిమా ఈ నెల 15న థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. హీరో ప్రియదర్శి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లో మంగళవారం ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శి మాట్లాడుతూ "మనం ఇవాళ తెరపై చాలా సూపర్ హీరోస్‌ను చూస్తున్నాం. ఈ సినిమాలో ఓ మిడిల్ క్లాస్ వారియర్ పోరాటాన్ని చూపిస్తున్నారు" అని అన్నారు. దర్శక నిర్మాత మధుర శ్రీధర్ మాట్లాడుతూ "ఇప్పటివరకు రిలీజైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ చూస్తుంటే ఈ సినిమాను నిజాయితీగా తెరకెక్కించారని తెలుస్తోంది" అని చెప్పారు. దర్శకుడు వేణు ఊడుగుల మాట్లాడుతూ "ప్రపంచంలో తెలుగువాళ్లు ఎక్కడ ఉన్నా వారి జీవితంలో జరిగిన సందర్భాలను ఈ కథతో రిలేట్ చేసుకుంటారు" అని అన్నారు. హీరో చైతన్య రావు మాట్లాడుతూ " ఇది మా అందరి కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా అవుతుంది. నా క్యారెక్టర్‌కు చిరంజీవి అనే పేరు పెట్టినప్పటి నుంచి భయమూ, భక్తితో నటించాను" అని అన్నారు. ఈ చిత్ర దర్శకుడు కుమారస్వామి మాట్లాడుతూ "నన్ను నమ్మే నలుగురు వ్యక్తులు చెప్పిన మాటలను పాటిస్తూ ఈ సినిమాను రూపొందించాను. థియేటర్స్‌కు వెళ్లి సినిమా చూడండి, మీ డబ్బులు, టైమ్ వృథా కావు" అని అన్నారు. నిర్మాత డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు మాట్లాడుతూ "ఈ సినిమాలో హీరో క్యారెక్టర్ చాణక్యుడిని, చంద్రగుప్తుడిని కలిపితే ఎలా ఉంటుందో అలా ఉంటుంది" అని అన్నారు. హీరోయిన్ భూమి శెట్టి మాట్లాడుతూ "ఈ సినిమా మన జీవితాలకు అద్దం పట్టేలా ఉంటుంది" అని చెప్పారు.

సందీప్ కొత్త చిత్రం షురూ



యంగ్ హీరో సందీప్ కిషన్ ప్రస్తుతం "ఊరి పేరు భైరవకోన" సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. తన 30వ చిత్రానికి మంగళవారం ప్రకటించారు. 'ధమాకా' ఫేమ్ త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నారు. ఏకే ఎంటర్టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి ప్రసన్న కుమార్ బెజవాడ కథ, స్క్రీన్ ప్లే, మాటలు అందిస్తున్నారు. రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: బాలాజీ గుత్తా

అన్ని వర్గాలను మెప్పించే కథ



పార్వతీశం, ప్రణీకాన్విక జంటగా నటించిన చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. వీ ఎస్ ముఖేశ్ యువ దర్శకత్వంలో అఖిలేశ్ కలారు నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా పార్వతీశం మాట్లాడుతూ ' 'కేరింత' చిత్రంలానే 'మార్కెట్ మహాలక్ష్మి' నాకు మరో హిట్ చిత్రమవుతుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలతో దర్శకుడు సినిమాను తెరకెక్కించాడు' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'కథలో మలుపులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి అని దర్శకుడు చెప్పారు. కంటెంట్‌పైన నమ్మకంతో ఈ సినిమాను నిర్మించాను, అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది అని నిర్మాత చెప్పారు.



స్నేహితుల కథతో...


హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా హీరోలుగా నటించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. తాజాగా 'ఓ మై ఫ్రెండ్' అనే లిరికల్ వీడియోను మంగళవారం విడుదల చేశారు. నటుడు శివాజీ, దర్శకుడు త్రినాథరావు నక్కిన, రచయిత ప్రసన్న కుమార్ ఈ సాంగ్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ 'నేటి యువతకు నచ్చే సినిమా ఇది. పాటలు బాగున్నాయి. దర్శకుడు విక్రమ్‌రెడ్డి బాగా తీశాడు. పరిశ్రమకు మరో మంచి దర్శకుడు దొరికాడు' అని ప్రశంసించారు. ఈ సినిమా పోస్టర్ చూస్తుంటే 'మేం వయసుకు వచ్చాం' నాటి రోజులు గుర్తుకు వస్తున్నాయని త్రినాథరావు అన్నారు. చిత్ర నిర్మాణం మీద, కథ మీద నాలెడ్జ్, గ్రిప్ ఉన్న నిర్మాత బెక్కం వేణుగోపాల్ అని ప్రసన్నకుమార్ అన్నారు. 'కొత్తవాళ్లతో ఈ రోజుల్లో సినిమా తీయడానికి గట్స్ కావాలి. కంటెంట్ మీద నమ్మకం ఉండాలి. ఇది మ్యాటర్ ఉన్న సినిమాలా అనిపిస్తోంది' అన్నారు.

ఉత్కంఠ భరితంగా శివం భజే



యువ నటుడు అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవంశీ హీరో హీరోయిన్లుగా ఓ చిత్రంలో నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు అర్బాజ్ ఖాన్, తమిళ విలన్ సాయి దీనా, హైపర్ ఆది ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అప్సర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మహేశ్వర్ రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ చిత్రానికి 'శివం భజే' అనే టైటిల్‌ను మంగళవారం ఖరారు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ "అశ్విన్ హీరోగా ఒక వైవిధ్యమైన కథతో గంగా ఎంటర్టైన్మెంట్స్ మొదటి నిర్మాణంగా 'శివం భజే' తెరకెక్కుతోంది. కొత్త కథ, కథనాలతో రూపొందుతున్న న్యూ ఏజ్ సినిమా ఇది. కామెడీ, డ్రామా, యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఆద్యంతం ఉత్కంఠ భరితంగా ఉంటుంది. ఇప్పటికే 80 శాతం షూటింగ్ పూర్తయింది" అని అన్నారు. దర్శకుడు అప్సర్ మాట్లాడుతూ "సాంకేతికంగా ఉన్నతంగా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకులకి తప్పకుండా నచ్చుతుంది" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్ : ఛోటా కె ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్ : సాహి సురేష్, మ్యూజిక్ డైరెక్టర్ : వికాస్ బడిస, డీఓపీ : దాశరథి శివేంద్ర.







మన సమాజంలో మహిళల హక్కుల కోసం పోరాడుతున్న కార్యకర్తలు అనేక మంది. రకరకాల సిద్ధాంతాల ప్రాతిపదికన పనిచేస్తున్నా వారందరి లక్ష్యం మహిళల అభ్యున్నతే! అలాంటి వారిలో ఒకరు **సాయని విజయభారతి**. ఆమె ఇటీవలే జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తన పోరాటాలను, మహిళా న్యాయవాదిగా తన అనుభవాలను 'నవ్య'తో పంచుకున్నారు.



భావజాలం కాదు... బాధలపై స్పందించడం ప్రధానం

"40 ఏళ్లుగా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నా. ఈ ప్రస్థానంలో నాకు ఎదురయిన అనుభవాలెన్నో! ఉదాహరణకు ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, ఆసుపత్రుల్లో ఇబ్బందులు ఎదురయినప్పుడు- నిజ నిర్ధారణకు వెళ్లేవాళ్లం. మమ్మల్ని గేటు దాటి లోపలికి వెళ్లనిచ్చేవారు కాదు. బాధితులను కలవాలని ఎంత ప్రయత్నించినా కుదిరేది కాదు. అదే ఇప్పుడు... జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలుగా అన్యాయానికి ఆస్కారమున్న ప్రతిచోటును సందర్శిస్తున్నాను. కొద్ది రోజుల కిందట నింబోలి అడ్డాలోని జువెనైల్ హోమ్‌కు వెళ్ళడమే కాదు, లోపలి పరిస్థితిని కళ్లారా చూశాను. చట్టంతో విభేదించిన పిల్లలతో కొంత సమయం గడిపాను. అలాగే నల్గొండ జిల్లాలోని కస్తూర్బా బాలికల వసతి గృహాన్ని సందర్శించాను. అక్కడ అమ్మాయిల పరిస్థితి చూసి నాకు కన్నీళ్ళు ఆగలేదు. దాదాపు 200మందికి పైగా విద్యార్థినులకు కేవలం ఆరు మరుగుదొడ్లు. వాళ్ళ గదుల్లో పాములు, ఎలుకలు తిరుగాడుతున్నాయి. మరొక ఎస్టీ హాస్టల్‌లో గదులన్నీ బూజుపట్టి భయానకస్థితిని తలపిస్తున్నాయి. మలమూత్ర వ్యర్థాలతో బ్లాక్ అయిన లెట్రిన్లు, పెచ్చులూడిన గోడలతో బాత్రూమ్‌లు... వీటన్నిటిని గమనించాక 'ప్రభుత్వ వసతిగృహాల్లో ఉండే వారిని సాటి మనుషులుగా చూస్తున్నామా?' అనిపించింది. అదే వసతి గృహంలో రోజుకు 800మంది పిల్లల కోసం 180కేజీల బియ్యం వండుతున్నట్టు లెక్కల్లో చూపిస్తున్నారు, పిల్లాడికి పిడికెడు బువ్వకు మించి వడ్డించడంలేదు. కోడిగుడ్లు రిజిస్టర్‌లో ఉంటాయి కానీ చిన్నారుల కంచాలలో కనిపించవు. 'ఇంత అన్యాయాన్ని చూడకుండా ఇన్నాళ్ళు కళ్ళుమూసుకొన్నానా?' అనిపించింది. నా పరిశీలనలో గమనించిన విషయాలన్నిటితో నివేదిక తయారుచేసి, దాన్ని మా చైర్‌పర్సన్‌కు ఇచ్చాను. ఇలా సమాజానికి నా వంతుగా సేవ చేసే సదావకాశం ఈ పదవి ద్వారా లభించిందని సంతోషిస్తున్నాను. నాకు ఇదొక బాధ్యత అంతే! అంతకుమించి దీన్ని ఒక హోదాగానో, లేదంటే అధికారంగా మాత్రం నేను భావించడం లేదు.

సందేశ్‌ఖాలీలో రాక్షసలీలలు

జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యులం ఒక బృందంగా పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో ప్రతి ఇంటికి వెళ్లి తలుపు తట్టాం. బాధితురాళ్ళను కలిసి విచారిస్తే, "మీరు ఇవాళ వచ్చి మాట్లాడి వెళతారు. తర్వాత గూండాలు పోలీసు వేషాల్లోవచ్చి మమ్మల్ని చావబాదుతారు" అంటూ మాతో మాట్లాడటానికి నిరాకరించారు. సాటి మహిళగా వారికి ధైర్యం నూరిపోసి, 'ఏమీ కాదు' అని భరోసా ఇచ్చాం. ఒక్కొక్కరు బాధను బయటకు చెబుతుంటే... నా గుండె తరుక్కుపోయింది. ప్రతి ఇంటా అత్యాచార బాధితురాళ్లున్నారు. సాగు భూమిని కోల్పోయినవారున్నారు. అక్కడి ప్రజలకు ఓటు అంటే తెలియదు. ఎన్నికల సమయంలో వారితో స్థానిక అధికార పార్టీ నాయకుడు ఒట్టు పెట్టించుకొని పంపుతారట. ఇలా ఒకటా, రెండా... బాధితుల నోట షేక్ షాజహాన్ అరాచకాలు వింటుంటే... కంసుడు, రావణాసురుడు చాలా మంచివాళ్లు అనిపించారు. సందేశ్‌ఖాలీలోని రాక్షస లీలలు అన్నీ ఇన్నీకావు మరి. మేము డైరెక్షన్ ఇచ్చాక పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకోవడం మొదలుపెట్టారు. అక్కడి వారందరికీ మా ఫోన్‌నెంబరు ఇచ్చాం. అధికారులు స్పందించకుంటే మాకు తెలియజేయండని ధైర్యాన్ని ఇచ్చి వెనుతిరిగాం. సాధ్యమైనంత వరకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ అధికారాల పరిధికి లోబడి... సంబంధిత అధికారులకు తగిన మార్గదర్శకాలు ఇచ్చాం.

సామాజిక కార్యకర్తగా...

మా సొంతూరు నెల్లూరు జిల్లా కోవూరు. ఆచార వ్యవహారాలకు ప్రాధాన్యత ఇచ్చే అతి సాధారణ కుటుంబం మాది. మా నాయనమ్మ ఆదెమ్మ ప్రకాశం జిల్లా దేవరంపాడులోని ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. జాతీయ నాయకులు ఆమెను అభినందించారు. నాకు 17ఏట పెళ్లి అయింది. నా భర్త నరహరి మాధవరావు. ఆయన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త. ఆయన శాఖ నుంచి ఇంటికి కొన్ని పుస్తకాలు వెంట తెచ్చేవారు. వాటిని నేను కూడా బాగా చదివేదాన్ని. ముఖ్యంగా భారతదేశ చరిత్ర, సంస్కృతి సంబంధిత విషయాలు నన్ను అమితంగా ప్రభావితం చేశాయి. నేను కూడా సంఘ్ కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. నా భర్త ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగి కావడంతో బదిలీల వల్ల కొంతకాలం అనకాపల్లి, ఎలమంచిలి ప్రాంతాల్లో ఉన్నాం. అదే సమయంలో పార్వతీపురం చుట్టుపక్కల ఆదివాసీ గూడేలలో నాలుగుకుపైగా బాల సంస్కార కేంద్రాలు నిర్వహించాను. తర్వాత 1987లో హైదరాబాద్‌కు వచ్చాం. ఇక్కడా వినాయక్ నగర్ లాంటి బస్తీలలో సేవా శిబిరాలు నిర్వహించాను. 'లా' చదివిన తర్వాత 1995లో హైకోర్టు న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టా. అంజనీ మాతా సేవాట్రస్ట్ ద్వారా ఎంతోమంది పేదబాలికల చదువుకు సహాయం అందించాను. కొన్నివందల ఫ్యామిలీ కేసులు ఉచితంగా వాదించాను. విడాకుల కోసం వచ్చిన ఎన్నో జంటలను కౌన్సెలింగ్ ద్వారా తిరిగి ఒక్కటిచేయగలిగాను.



'ఆడవాళ్ళను ఇంటికే పరిమితం చేయడం ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం. వారు స్త్రీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యానికి వ్యతిరేకం' లాంటి దుష్ప్రచారాలు బయట బోలెడు వింటుంటాం. అవన్నీ పచ్చి అబద్ధాలు. మహిళాభ్యున్నతికి సంఘ్ వ్యతిరేకం అయితే, నేను ఇంతవరకు వచ్చేదాన్నా?

అవన్నీ అవాస్తవాలు...

'ఆడవాళ్ళను ఇంటికే పరిమితం చేయడం ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం. వారు స్త్రీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యానికి వ్యతిరేకం' లాంటి దుష్ప్రచారాలు బయట బోలెడు వింటుంటాం. అవన్నీ పచ్చి అబద్ధాలు. మహిళాభ్యున్నతికి సంఘ్ వ్యతిరేకం అయితే, నేను ఇంతవరకు వచ్చేదాన్నా? కన్నవారిని, ఇంటిని వదిలి ఆర్‌ఎస్‌ఎస్ కోసం ఎంతోమంది అమ్మాయిలు ప్రచారికలుగా మారారు. అనేక రంగాలలో సమితి మహిళలు రాణిస్తున్నారు. అసలు సంఘ్ భావనలు స్త్రీ స్వేచ్ఛకు విరుద్ధమైతే, కర్ర పట్టుకొని వీధుల్లో తిరగం కదా! శాఖలు నిర్వహించం కదా! ధర్మపరిరక్షణ కోసం బయటకొచ్చి నిరసనలు, ధర్నాలు చేపట్టం కదా! స్త్రీలలోని నైపుణ్యాలు వెలికితీసి, తద్వారా సమాజ ప్రయోజనానికి ఉపయోగించాలన్నదే రాష్ట్ర సేవికా సమితి సంకల్పం. నేను ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలిని అయ్యాక... సంఘ్ బాధ్యతల నుంచి పూర్తిగా బయటకు వచ్చాను. ఈ దేశంలో భావజాలాలు ఎన్ని ఉన్నా దేశం విషయంలో పౌరులంతా సమానమే. పైగా ఇలాంటి బాధ్యతాయుతమైన పదవిని నిర్వర్తించేప్పుడు భావజాలం ప్రధానం కాదు. ఎవరికి బాధ కలిగినా మేము స్పందిస్తాం. అంతకుమించి మతాలకు, సిద్ధాంతాలతో సంబంధంలేదు. సంస్కారవంతమైన సమాజం నిర్మాణం కావాలి. అందరికి సమన్యాయం జరగాలి. మానవులంతా సంతోషంగా ఉండాలన్నదే నా కోరిక. ఆ లక్ష్యంతోనే పనిచేస్తున్నాను."

• స్వాంతన్

ముంబయిలోని జియో వరల్డ్ కన్వెన్షన్‌లో నిర్వహించిన 71వ ప్రపంచ సుందరి పోటీల వేడుకకు హాజరై, హ్యుమానిటేరియన్ అవార్డు అందుకున్న రిలయన్స్ ఫౌండేషన్ అండ్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ ధరించిన చేతి వంకీ వెల అక్షరాలా 200 కోట్లు. పురుషులు తలపాగాకు అలంకరించుకునే సర్‌పేంచ్ ఆభరణాన్ని నీతా అంబానీ బాజూబంద్‌గా మలుచుకుని ధరించడం మరో విశేషం. ఆ బాజూబంద్ వెనకున్న కథతో పాటు వంకీల జ్యువెలరీ ఫ్యాషన్ గురించి తెలుసుకుందాం!

భలే బాజూబంద్

ఫ్యాషన్



మొఘల్ ధగధగలు

నీతా అంబానీ ధరించిన బాజూబంద్ మొఘల్ సామ్రాజ్యానికి చెందినది. 1592 నుంచి 1666 వరకూ పరిపాలించిన ఐదవ మొఘల్ చక్రవర్తి, జహంగీర్ పుత్రుడు, షాజహాన్‌గా పేరు పొందిన మీర్జా షాహబ్ ఉద్దీన్ మొహమ్మద్ ఖుర్రమ్ ఆ నగను తన తలపాగాకు సర్‌పేంచ్(కల్గీ)గా అలంకరించుకునేవాడు. 'షాజహాన్ ఇబ్న్ జహంగీర్ షా/1049 అని ఉర్దూలో చెక్కిన అక్షరాలు ఆ నగకు వేలాడే రెండు ఎరుపు రంగు స్పైనల్ జాతిరాళ్ల మీద కనిపిస్తాయి. 2019లో నిర్వహించిన ఒక వేలంపాటలో చివరిసారిగా ఆ సర్‌పేంచ్ కనిపించింది. వజ్రాలు, కెంపులు, స్పైనల్ జాతి రాళ్లు కలిగి ఉన్న ఈ నగను పచ్చికాకామ్ టెక్నిక్‌ను ఉపయోగించి తయారుచేశారు. సర్‌పేంచ్‌ను చేతి వంకీగా మలుచుకునే ఈ ఆధునిక ఆభరణాలంకరణ స్టైల్ తాజా ట్రెండ్‌గా మారింది. అలాంటి కొన్ని ఆకర్షణీయమైన వంకీలెన్నో ఇప్పుడు మార్కెట్లో దొరుకుతున్నాయి.



జ్యువెలరీ ట్రెండ్‌గా...

పెళ్లి నగల్లో చేతి వంకీలు తప్పనిసరిగా ఉండాల్సిందే! కానీ ఇప్పుడు వంకీలు ఫ్యాషన్ జ్యువెలరీగా మారిపోయాయి. రెండు చేతులకు బదులుగా కుడి చేతికి మాత్రమే వంకీ ధరించే ట్రెండ్ తాజాగా కొనసాగుతోంది. అచ్చంగా బంగారంతో తయారైనవీ, లేదంటే వజ్రాలు, కెంపులు, ముత్యాలు పొదిగిన వంకీలను అమ్మాయిలు ఇష్టంగా ధరిస్తున్నారు. డోరీతో కట్టుకునే వీలుండే వంకీలతో పాటు, కొక్కేలు కలిగి ఉన్న చేతి వంకీలు మార్కెట్లో దొరుకుతున్నాయి. అయితే ధరించేది ఎలాంటి వంకీ అయినా రెట్టింపు ఆకర్షణీయంగా కనిపించాలంటే వంకీని హైలైట్ చేసే దుస్తులు ఎంచుకోవాలి. అందుకోసం స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లు, లాంగ్ గౌన్స్ ఎంచుకోవచ్చు.





న్యూస్‌మేకర్

"జీవితంలో ఒక్కసారైనా ఆస్కార్ చేతపట్టాలనేది నటుల కోరిక. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ ఆస్కార్ వేదికపై నన్ను సగర్వంగా నిలబెట్టింది 'పూర్ థింగ్స్'"... ఉత్తమ నటిగా 'ఆస్కార్' అందుకున్న సందర్భంగా ఎమ్మా స్టోన్ భావోద్వేగ ప్రసంగం ఇది. 35 ఏళ్ల ఈ అమెరికన్ నటికి 'ఆస్కార్' అందుకోవడం రెండోసారి. పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశం చేసే ఆమె... 'సహజ నటి'గా ప్రపంచ ప్రఖ్యాతి పొందారు. సంగీతంతో మొదలై... డ్యాన్సర్‌గా... థియేటర్ ఆర్టిస్ట్‌గా అలరించి... వెండితెరపై తిరుగులేని అభినేత్రిగా 'ఆస్కార్' స్థాయికి చేరిన ఎమ్మాస్టోన్ ప్రస్థానం ఇది...



అభినయం ఆమె సర్వస్వం

'ఆస్కార్' అవార్డుతో ఇవాళ మన ముందు నిలుచున్న ఎమిలి జీన్ ఎమ్మా స్టోన్‌లో అచంచలమైన ఆత్మవిశ్వాసం ప్రతిబింబించవచ్చు. ప్రపంచాన్ని జయించిన ఆనందం కనిపించవచ్చు. కానీ ఈ స్థాయికి రావడానికి ఆమె ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపింది. తీవ్ర మనోవేదనకు గురయింది. వీటన్నిటినీ అధిగమించడానికి తన అభిరుచి ఏమిటో గుర్తించి, తనలోని ప్రతిభకు పట్టం కట్టింది. ఆటుపోట్లు... ఒడుదొడుకులు... అన్నిటినీ తట్టుకుని... ప్రపంచం ముందు సగర్వంగా తనను తాను ఆవిష్కరించుకుంది. అమెరికా ఆరిజోనాలో పుట్టిన ఎమ్మా పసి వయసులోనే బేబీ కాలిక్ (తరచూ ఏడవడం)తో బాధపడ్డారు. దానివల్ల చిన్నప్పుడే ఆమె స్వర పేటిక దెబ్బతింది. ఎమ్మా తండ్రి జెఫ్రీ చార్లెస్ స్టోన్ ఓ కంపెనీ యజమాని. తల్లి క్రిస్టా జీన్ గృహిణి.

వెంటాడిన భయం: స్కూల్లో చదివే రోజుల్లో ఎమ్మా తీవ్ర మానసిక సమస్యతో సతమతమైంది. దాని నుంచి బయటపడడానికి ఆమెకు నటనే ఒక చికిత్సలా పని చేసింది. "మొట్టమొదటిసారి నేను భయాందోళనలకు (పానిక్ ఎటాక్) గురైంది... మా స్నేహితుల ఇంట్లో కూర్చున్నప్పుడు. నాకు ఇల్లు కాలిపోతున్న అనుభూతి కలిగింది. భయంతో అమ్మకు కాల్ చేస్తే... తను వచ్చి ఇంటికి తీసుకువెళ్లింది. మూడేళ్లు ఇదే సమస్యతో బాధపడ్డాను. చికిత్స ప్రారంభమైంది. మధ్యాహ్న భోజనానికి కూడా నర్సు చేయి పట్టుకుని భయంగా వెళ్లేదాన్ని. 'బయట వాతావరణం ఎలా ఉంది' అని అమ్మను పదే పదే అడిగేదాన్ని. ఎందుకంటే ఎవరూ చావబోవడంలేదని, అమాంతం పరిస్థితులు మారబోవడంలేదని తెలుసుకోవడానికి. ఆ మానసిక సమస్య నుంచి నన్ను బయట పడేసింది నటన" అంటూ ఓ సందర్భంలో చిన్ననాటి రోజులు గుర్తు చేసుకుంది ఎమ్మా.

సంగీతంతో మొదలై: ఊహ తెలిసినప్పటి నుంచి నటనపై మక్కువ పెంచుకుంది ఎమ్మా. మొదట యూట్యూబ్‌లో చిన్న చిన్న సరదా వీడియోలు చేద్దామనుకుంది. కానీ తరువాత ఆమె మనసు సంగీత నాటకాల వైపు మళ్లింది. దాని కోసం కొన్నేళ్లు సంగీత శిక్షణ తీసుకుంది. "ఇంట్లో మా అమ్మ 'లెస్ మిజరబుల్స్' పాట వినిపిస్తుండేది. అందులోని కథ నాకు వివరించి చెప్పేది. తరువాత ఎనిమిదేళ్లప్పుడు అనుకొంటా... అదే కథను నేను రంగస్థలంపై చూశాను. నాకు ఎంతో నచ్చేసింది. ఆ ఇష్టం నా ఆలోచనలను సంపూర్ణంగా మార్చేసింది. ఇక అప్పటి నుంచి మాటల్లో చెప్పలేని భావాలను పలికించడానికి పాట ఒక పెద్ద మాధ్యమం అయింది. సంగీత సాధన చేస్తూనే... నాకు మరింత ఇష్టమైన నాట్యం మీద దృష్టి పెట్టాను. పదేళ్లపాటు అభ్యాసం చేశాను. క్రమంగా నటన వైపు మళ్లాను. పదకొండేళ్లప్పుడు మొదటిసారి ఆరిజోనాలోని థియేటర్‌లో నాటకం వేశాను. 2005లో 'ది న్యూ పాట్రిడ్జ్ ఫ్యామిలీ' రియాలిటీ షో ద్వారా తొలిసారి టెలివిజన్‌లో కనిపించాను. రెండేళ్లు టీవీల్లోనే సాగింది నా కెరీర్. ఆ సమయంలోనే 'సూపర్‌బ్యాడ్' (2007) చిత్రంలో అవకాశం వచ్చింది. అందులో నాది జూలెస్ పాత్ర" అంటూ గతాన్ని గుర్తు చేసుకున్న ఎమ్మా కెరీర్ అక్కడి నుంచి రాకెట్ స్పీడ్‌తో దూసుకుపోయింది.

అకాడమీ అవార్డు: బాల్యంలో ఇబ్బంది పెట్టిన భయాందోళనలను దూరం చేయడానికి అభినయం ఒక చికిత్సలా ఉపయోగపడిందన్న ఎమ్మా... తన జీవితం నుంచే ఎన్నో పాఠాలు నేర్చుకుంది. వైద్యం ప్రభావం చూపని చోట... తన అభిరుచిని ఆస్వాదిస్తూ మానసికంగా తనను తాను దృఢంగా మలచుకుంది. పాత్రల్లో లీనమై అశేష జనాభిమానం సంపాదించుకుంది. విమర్శకులను సైతం మెప్పించి... సహజ నటిగా ఎన్నో అవార్డులు గెలుచుకుంది. 2009లో విడుదలైన హర్రర్ కామెడీ చిత్రం 'జాంబీలాండ్'తో తొలి కమర్షియల్ హిట్ అందుకున్న ఎమ్మా... పలు మ్యూజిక్ ఆల్బమ్స్ కూడా చేసింది. 2016లో వచ్చిన 'లా లా ల్యాండ్'లో అద్భుతమైన అభినయానికి గానూ ఉత్తమ నటిగా తొలిసారి 'ఆస్కార్'ను ముద్దాడింది. ఇప్పటికి దాదాపు ముప్పై చిత్రాల్లో నటించిన ఎమ్మా... హాలీవుడ్‌లోని బిజీ నటీమణుల్లో ఒకరు.

ప్రేమ... పెళ్లి: అంతర్జాతీయ స్టార్‌గా ఎదిగినా సాధారణ జీవితం గడపడానికే ఎమ్మా ఇష్టపడుతుంది. వ్యక్తిగత విషయాలు గోప్యంగా ఉంచుతుంది. ఖాళీ దొరికితే తన కుటుంబానికే సమయం కేటాయించే ఎమ్మా... 'పేపర్‌మ్యాన్' సహనటుడు కీరన్ కల్కిన్‌తో సహజీవనం చేసింది. రెండేళ్ల తరువాత అతడికి బ్రేకప్ చెప్పి... 'అమేజింగ్ స్పైడర్‌మ్యాన్'లో తనతో నటించిన ఆండ్రూ గార్‌ఫీల్డ్‌తో ప్రేమలో పడింది. నాలుగేళ్లు సాగిన ఈ ప్రేమాయణం 2015లో ముగిసింది. రెండేళ్లు ఒంటరిగా జీవించిన ఎమ్మా స్టోన్... దర్శకుడు డేవ్ మెక్‌కారీని ప్రేమించి, 2020లో అతడిని పెళ్లి చేసుకుంది. మరుసటి ఏడాది వారికి కూతురు పుట్టింది. బిడ్డ తల్లి అయ్యాక కూడా ఎమ్మా సినిమాలు వదల్లేదు. ఆమెలో ఉత్సాహం, తపన తగ్గలేదు.




మళ్లీ మెరుపులు: ఒక పక్క నటిస్తూనే నిర్మాతగా మారిన ఎమ్మా... గత ఏడాది 'పూర్ థింగ్స్' చిత్రంలో నటించి, నిర్మించింది. ఇప్పుడు అదే చిత్రానికి ఎమ్మా స్టోన్ మరోసారి ఉత్తమ నటిగా 'ఆస్కార్ అవార్డు' అందుకుంది. విక్టోరియన్ లండన్‌లోని ఓ యువతి మరణించిన తరువాత ఒక శాస్త్రవేత్త ద్వారా తిరిగి ప్రాణం పోసుకోవడం 'పూర్ థింగ్స్' కథాంశం. ఇందులో బెల్లా బాక్స్టర్‌గా ఎమ్మా అసమాన నటనతో ఆకట్టుకుంది. 'ఈ పురస్కారానికి అర్హురాలిననని ఇప్పటికీ నేను నమ్మలేకపోతున్నా' అంటూ 'ఆస్కార్ అవార్డు' స్వీకరిస్తున్న సందర్భంగా ఎమ్మాస్టోన్ తన సంతోషాన్ని పంచుకుంది. ప్రస్తుతం ఆమె మరో విభిన్న కథాచిత్రం 'కైండ్స్ ఆఫ్ కైండ్‌నెస్' నటిస్తోంది.

నారింజతో నవయవ్వనం

నారింజ పండు తిని తొక్కను తీసి పడేయకండి. తొక్కే కదా... అని అనుకోకుండా... ఎండబెట్టి పొడి చేసుకుంటే మంచిది. చర్మం అందంగా ఉండటానికి నారింజతో పాటుర తొక్క పొడితోనూ ఎంతో ఉపయోగపడుతుంది.

- బౌల్‌లో టేబుల్ స్పూన్ నారింజ తొక్క పొడిని తీసుకోవాలి. ఇందులోకి రెండు టేబుల్ స్పూన్ల పెరుగు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిముషా తర్వాత శుభ్రం చేయాలి. ఇలా తరచూ చేస్తుంటే ముఖం కాంతివంతంగా ఉంటుంది.
- టేబుల్ స్పూన్ ఆరెంజ్ పీల్ పౌడర్, టేబుల్ స్పూన్ తేనె, కొద్దిగా పసుపు కలిపి మిక్స్ చేయాలి. ఈ చూర్ణాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే ముఖం మీద ఉండే నొప్పులు తొలగిపోతాయి.



- బౌల్‌లో టేబుల్ స్పూన్ నారింజ తొక్క పొడి, టేబుల్ స్పూన్ ముల్తాని మట్టి వేసి కలపాలి. ఈ మిశ్రమానికి రోజ్ వాటర్ కలిపి చూర్ణం చేయాలి. దీన్ని పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తుంటే ముఖం మీద ఉండే మచ్చలు పోతాయి.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల జ్యూస్, టేబుల్ స్పూన్ శనగపిండి, టీస్పూన్ రోజ్ వాటర్ కలిపి మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖచర్మం, మెడ వెనుక పట్టిస్తే చర్మంలో మెరుపు వస్తుంది.
- రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, రెండు టేబుల్ స్పూన్ల ఆరెంజ్ పీల్ పౌడర్, సగం నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేస్తే చర్మం మీద రెడ్‌నెస్ తగ్గిపోతుంది.
- బౌల్‌లో టేబుల్ స్పూన్ ఆరెంజ్ పీల్ పౌడర్, టేబుల్ స్పూన్ బొప్పాయి గుజ్జు వేసి రోజ్‌వాటర్ కలపాలి. ఈ చూర్ణాన్ని పట్టించి అరగంట తర్వాత శుభ్రపరచాలి. ఇలా చేస్తుంటే ముఖం మీద ఉండే పుండ్లు, మొటిమలు తగ్గిపోతాయి. ఫ్రెష్‌గా ఉంటుంది.

బిజినెస్

ఈ నెల 18 నుంచి ఫ్లై91 విమాన సేవలు

గోవా నుంచి హైదరాబాద్‌కు విమాన సర్వీసు

మోపా (గోవా): ఈ నెల 18 నుంచి విమానయాన సేవలను ప్రారంభించనున్నట్లు ఈ మధ్యనే ఎయిర్‌లైన్ పర్మిట్‌ను దక్కించుకున్న దేశీయ ఎయిర్‌లైన్స్ ఫ్లై91 తెలిపింది. తొలుత గోవా నుంచి బెంగళూరు, హైదరాబాద్ మార్గాల్లో విమానయాన సేవలందించనున్నట్లు ఎయిర్‌లైన్స్ ఎండీ, సీఈఓ మనోజ్ చాకో తెలిపారు. అలాగే, హైదరాబాద్, బెంగళూరు నుంచి సింధుదుర్గ్‌కు సైతం సర్వీసులు నడపనుంది. ఏప్రిల్‌లో లక్షద్వీప్‌లోని అగట్టీకి సైతం సర్వీసును ప్రారంభించనున్నట్లు చాకో వెల్లడించారు. గోవాకు చెందిన ఫ్లై91 వద్ద ప్రస్తుతం రెండు ఏటీఆర్ 72-600 విమానాలున్నాయి.

పొగాకుపై అదనపు పన్ను మాఫీ

తుపాను బాధిత రైతులకు రూ.10,000 వడ్డీ లేని రుణం

గుంటూరు: పరిమితికి మించి సాగుచేసిన పొగాకుపై విధించే ఐదు శాతం అదనపు పన్నును మాఫీ చేసేందుకు కేంద్రం సుముఖంగా ఉన్నట్లు గుంటూరు పొగాకు బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు వెల్లడించారు. మంగళవారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో ఇరువురు మాట్లాడుతూ.. ఇటీవల కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో భేటీ సందర్భంగా ఇచ్చిన హామీలను వెల్లడించారు. మిచౌగ్ తుపాను ప్రభావంతో పొగాకు పంట సాగులో ఇబ్బందులు పడిన రైతులకు ఒక్కొక్కరికి రూ.10,000 వడ్డీ లేని రుణం అందించేందుకు గోయల్ సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. ఈ ఏడాది రూ.11,000 కోట్ల విదేశీ మారక ద్రవ్యం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అందుకు తగినట్లుగానే గడచిన తొమ్మిది నెలల కాలంలో రూ.9,763 కోట్ల విదేశీ మారక ద్రవ్యం సాధించామని చెప్పారు. మిగిలిన మొత్తాన్ని కూడా సాధిస్తామన్న ధీమా వ్యక్తం చేశారు.

రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్ఠం



ఫిబ్రవరిలో 5.09 శాతం

న్యూఢిల్లీ: దేశంలో రిటైల్ ధరల్లో చెప్పుకోదగ్గ మార్పు ఏదీ చోటు చేసుకోలేదు. ఫిబ్రవరి నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్ఠ స్థాయి 5.09 శాతంగా నమోదైంది. ఇది వరుసగా ఆరో నెల కూడా ప్రభుత్వం ఆర్‌బీఐకి నిర్దేశించిన గరిష్ఠ కట్టడి స్థాయి 6 శాతం కన్నా దిగువనే ఉండడం విశేషం. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం వినియోగ ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) జనవరి నెలలో 5.1 శాతం, గత ఏడాది ఫిబ్రవరిలో 6.44 శాతం ఉంది. అయితే ఆహార వస్తువుల ధరల్లో స్వల్ప వృద్ధి నమోదైంది. జనవరితో పోల్చితే ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 8.3 శాతం నుంచి 8.66 శాతానికి పెరిగింది. కూరగాయలు, పళ్లు, ఆయిల్స్ అండ్ ఫ్యాట్స్, పప్పులు, అనుబంధ ఉత్పత్తుల విభాగంలో ధరలు తగ్గినా చిరుధాన్యాలు, మాంసం, చేపలు, పాలు, పాల ఉత్పత్తుల విభాగంలో మాత్రం ధరలు పెరిగాయి. సీపీఐలో ఆహార వస్తువుల వాటా సుమారు 50 శాతం ఉంటుంది. ప్రాంతాలవారీగా చూసినట్టయితే పట్టణ ప్రాంతాల (4.78 శాతం) కన్నా గ్రామీణ ప్రాంతాల్లో (5.34 శాతం) ద్రవ్యోల్బణం అధికంగా ఉంది.

నీరసించిన పారిశ్రామికం

భారత పారిశ్రామిక వృద్ధి రేటు జనవరి నెలలో మందగించింది. తయారీ, మైనింగ్, విద్యుత్ రంగాల నిరాశావహమైన పనితీరు కారణంగా పారిశ్రామిక వృద్ధి రేటు 3.8 శాతానికి పరిమితం అయింది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ఆధారితంగా మదింపు చేసే పరిశ్రమల వృద్ధి గత ఏడాది జనవరిలో 5.8 శాతం ఉండగా డిసెంబరులో 4.2 శాతం ఉంది. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి నెలల మధ్య కాలంలో అంతకు ముందు ఏడాదితో పోల్చితే 5.5 శాతం నుంచి 5.9 శాతానికి పెరిగింది. విభాగాల వారీగా చూసినట్టయితే తయారీ రంగం వృద్ధి 4.5 శాతం నుంచి 3.2 శాతానికి తగ్గింది. విద్యుత్ ఉత్పత్తి 12.7 శాతం నుంచి 5.6 శాతానికి, గనుల ఉత్పత్తి 9 శాతం నుంచి 5.9 శాతానికి క్షీణించింది. యంత్రపరికరాల విభాగంలో వృద్ధి రేటు 10.5 శాతం నుంచి 4.1 శాతానికి దిగజారింది.

భారత వాస్తవ వృద్ధి 8 శాతం

వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత వాస్తవిక జీడీపీ వృద్ధి రేటు 8 శాతానికి చేరువలో ఉంటుందని ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ అన్నారు. మంగళవారం ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. వృద్ధి రేటు గణాంకాల మంత్రిత్వ శాఖ అంచనా 7.6 శాతాన్ని మించి ఉంటుందని పేర్కొన్నారు. జీడీపీ వృద్ధి రేటులో మూడు త్రైమాసికాల్లో ఏర్పడిన వేగం నాలుగో త్రైమాసికంలో గణనీయంగా తగ్గితే తప్ప అది 8 శాతానికి చేరువలో ఉండడం తథ్యమని ఆయన వ్యాఖ్యానించారు. రుతుపవనాలు అస్తవ్యస్తంగా ఉన్న కారణంగా వేసవి పంట దిగుబడులు తగ్గి వ్యవసాయ రంగం వెనుకబడి ఉన్నదని ఆయన అన్నారు. అలాగే ప్రపంచ వృద్ధి మందగించినందువల్ల ఎగుమతుల్లో తొలి దశాబ్దిలో ఏర్పడిన వేగం ఉండకపోవచ్చని వ్యాఖ్యానించారు.

నియామకాల జోరు..



హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్‌లో మరిన్ని ఉద్యోగాలు
మ్యాన్‌పవర్ గ్రూప్

న్యూఢిల్లీ: ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో భారత కంపెనీలు నియామకాల జోరు పెంచనున్నాయి. మంగళవారం విడుదలైన 'మ్యాన్‌పవర్ గ్రూప్ ఎంప్లాయ్‌మెంట్ ఔట్‌లుక్ సర్వే' ఈ విషయం తెలిపింది. ఈ త్రైమాసికంలో 36 శాతం భారత కంపెనీలు నియామకాలకు సిద్ధమవుతున్నాయి. ఇదే సమయంలో అమెరికాలో 34 శాతం కంపెనీలు, చైనాలో 34 శాతం కంపెనీలు నియామకాలకు సిద్ధమవుతున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే ఇది 22 శాతం మాత్రమే. మొత్తం 42 దేశాలకు చెందిన 3,150 కంపెనీలను సర్వే చేసి మ్యాన్‌పవర్ గ్రూప్ ఎంప్లాయ్‌మెంట్ ఔట్‌లుక్ ఈ విషయం తెలిపింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ జూన్ త్రైమాసికంలో నియామకాలు ఆరు శాతం పెరగనున్నాయి. అయితే 2024 మార్చి త్రైమాసికంతో పోలిస్తే మాత్రం ఇది ఒక శాతం తక్కువ.

ఈ రంగాల్లోనే ఎక్కువ: వచ్చే జూన్ త్రైమాసికంలో హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో 44 శాతం, కమ్యూనికేషన్స్ సర్వీసెస్ కంపెనీలు 43 శాతం, ఐటీ కంపెనీల్లో 41 శాతం నియామకాల జోరు పెంచనున్నాయి. ఈ రంగాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు ఇందుకు కలిసి రానున్నాయి. ఎనర్జీ, యుటిలిటీ రంగాలకు చెందిన కంపెనీల్లో 20 శాతం కంపెనీలు మాత్రమే జూన్ త్రైమాసికంలో నియామకాలు పెంచుతామని తెలిపాయి.

కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు భారీ ఆర్డర్

హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కి మరో భారీ ఆర్డర్ లభించింది. తెలంగాణ ప్రభుత్వ పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన ప్రజారోగ్యం, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ నుంచి రూ.1,163.03 కోట్ల విలువైన ఈ ఆర్డర్ లభించినట్లు వెల్లడించింది. ఈ కాంట్రాక్టులో భాగంగా కంపెనీ 'అమృత్ 2.0' పథకం కింద ఖమ్మం, నల్లగొండ జిల్లాలోని 26 పట్టణ ప్రాంతాల్లో నీటి సరఫరా ప్రాజెక్టులు, నాలుగు పట్టణ ప్రాంతాల్లో మురుగు నీటి ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేయాలి.

హెచ్ఐఎల్ చేతికి టాప్‌లైన్ ఇండస్ట్రీస్

సీకే బిర్లా గ్రూప్ కంపెనీ హెచ్ఐఎల్.. పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ మార్కెట్‌లో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటోంది. ఇందుకోసం దేశ తూర్పు ప్రాంత పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ మార్కెట్లో మంచి పట్టున్న క్రిస్టియా గ్రూప్‌నకు చెందిన నాలుగు అనుబంధ సంస్థలను రూ.265 కోట్లకు కొనుగోలు చేస్తోంది. దీంతో క్రిస్టియా నిర్వహణలోని టాప్‌లైన్ ఇండస్ట్రీస్, ఆదిత్య పాలిటెక్నిక్, ఆదిత్య ఇండస్ట్రీస్, సాయినాథ్ పాలిమర్స్ కంపెనీలు హెచ్ఐఎల్ చేతికి వస్తాయి.

ప్రీమియర్ ఎనర్జీస్ రూ.2,000 కోట్ల ఐపీఓ

హైదరాబాద్‌కు చెందిన సోలార్ మాడ్యూళ్ల తయారీ కంపెనీ ప్రీమియర్ ఎనర్జీస్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. తద్వారా రూ.2,000 కోట్ల వరకు సమీకరించాలని భావిస్తోంది. క్రిసిల్ రేటింగ్ రిపోర్టు ప్రకారం.. గత ఏడాది డిసెంబరు 31 నాటికి ప్రీమియర్ ఎనర్జీస్ తన నిర్వహణ సామర్థ్యాన్ని 2.7 గిగావాట్ల మాడ్యూళ్లు, 2 గిగావాట్ల సోలార్ సెల్స్ స్థాయికి విస్తరించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ సామర్థ్యాన్ని 3 గిగావాట్ల సోలార్ సెల్స్, 3.7 గిగావాట్ల మాడ్యూళ్లకు పెంచుకోవాలనుకుంటోంది.

డాక్టర్ రెడ్డీస్‌కు రూ.74 కోట్ల పన్ను నోటీసు

హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు జీఎస్‌టీ అధికారుల నుంచి రూ.74.22 కోట్ల పన్ను డిమాండ్ నోటీసు అందింది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను తప్పుగా ఉపయోగించుకున్నారనే పేరుతో హైదరాబాద్‌లోని అడిషనల్ కమిషనర్ (సెంట్రల్ టాక్స్) ఈ డిమాండ్ నోటీసు జారీ చేసినట్టు కంపెనీ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. వడ్డీ, పెనాల్టీతో కలిసి జీఎస్‌టీ అధికారులు ఈ నోటీసు జారీ చేశారు. త్వరలోనే దీనిపై అప్పీల్ ఫైల్ చేస్తామని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

లిఖితా ఇన్‌ఫ్రాకు రూ.106 కోట్ల ఆర్డర్

లిఖిత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు ప్రభుత్వ రంగంలోని హెచ్‌పీసీఎల్ నుంచి రూ.106.12 కోట్ల విలువైన ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ కింద హెచ్‌పీసీఎల్‌కు చెందిన హల్దియా-పనాగర్ పైప్‌లైన్ ప్రాజెక్టు కోసం స్టీల్ పైప్‌లైన్, దానికి సంబంధించిన పనులు 15 నెలల్లో పూర్తి చేయాలి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,260 ▼	60,740 ▼	79,500 ▲
ముంబై	65,566 ▼	60,059 ▼	72,675 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ		విజయవాడ	433
హైదరాబాద్	410	విశాఖపట్నం	450
13వ తేదీ		వరంగల్	412
చిత్తూరు	483		
గోదావరి	433	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	114	గోదావరి	106
వరంగల్	114	విజయవాడ	106
కరీంనగర్	114	గుంటూరు	111
మహబూబ్‌నగర్	114	ఒంగోలు	111
కర్నూలు	114	చిత్తూరు	125
విశాఖపట్నం	103		

స్వల్ప లాభాలతో సరి

సెన్సెక్స్ 165 పాయింట్లు అప్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం తీవ్ర ఒడుదుడుకులకు లోనైనప్పటికీ, స్వల్ప లాభాలతో ముగింపు పలికాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి దిగ్గజ షేర్ల కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ ఒక దశలో 501 పాయింట్లు ఎగబాకి 74,000 ఎగువకు చేరుకున్నప్పటికీ, చివర్లో 165.32 పాయింట్ల లాభంతో 73,667.96 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కేవలం 3.05 పాయింట్ల వృద్ధితో 22,335.70 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 22 నష్టపోగా.. ఎస్‌బీఐ 1.82 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది.

చిన్న షేర్లలో పోటెత్తిన అమ్మకాలు: చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలో మాత్రం అమ్మకాలు పోటెత్తాయి. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 2.11 శాతం పతనమవగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.31 శాతం నష్టపోయింది. అంతేకాదు, బీఎస్ఈలోని ఎస్ఎంఈ ఐపీఓ ఇండెక్స్ మరో 4.67 శాతం క్షీణించింది. చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలో బుడగ ఏర్పడుతోందని, ఈ విభాగ షేర్ల ధరల్లో అవకతవకలు సైతం చోటు చేసుకుంటున్నాయన్న సంకేతాలున్నాయని సెబీ ఛైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మంగళవారం ఓ సదస్సులో హెచ్చరించడం ఇందుకు కారణమైంది. రంగాల వారీ సూచీల్లోనూ ఐటీ మినహా అన్నీ నేలచూపులు చూశాయి. రియల్టీ ఏకంగా 3.53 శాతం నష్టపోగా.. ఇండస్ట్రియల్స్, కమోడిటీస్, సర్వీసెస్, యుటిలిటీస్, మెటల్ ఇండెక్స్‌లు ఒక శాతానికి పైగా తగ్గాయి. ఈ కారణంగా ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ మరో రూ.4.02 లక్షల కోట్లు తగ్గి రూ.385.64 లక్షల కోట్లకు (4.70 లక్షల కోట్ల డాలర్లు) పరిమితమైంది.

నిరాశపరిచిన ఆర్‌కే స్వామి షేర్ల లిస్టింగ్

ఇంటిగ్రేటెడ్ మార్కెటింగ్ సేవలందించే ఆర్‌కే స్వామి లిమిటెడ్ మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.288తో పోలిస్తే, ఎన్ఎస్ఈలో కంపెనీ షేరు 13.19 శాతం డిస్కౌంట్‌తో రూ.250 వద్ద లిస్టయింది. ఒక దశలో రూ.243 వద్దకు పతనమైన షేరు ధర.. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేసరికి 8.79 శాతం నష్టంతో రూ.261 వద్ద స్థిరపడింది. గత వారం ముగిసిన ఆర్‌కే స్వామి ఐపీఓకు 25.78 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

కేఫిన్ టెక్‌లో వాటా తగ్గించుకున్న కోటక్ బ్యాంక్

మ్యూచువల్ ఫండ్లు, ఇతర ఆర్థిక సేవల సంస్థలకు బ్యాక్ ఎండ్ సేవలందించే కేఫిన్ టెక్నాలజీస్‌లో 2.03 శాతం వాటాను కోటక్ మహీంద్రా బ్యాంక్ రూ.208 కోట్లకు విక్రయించింది. దాంతో కంపెనీలో కోటక్ బ్యాంక్ వాటా 9.80 శాతం నుంచి 7.77 శాతానికి తగ్గింది.

ఐటీసీలో 3.5 % వాటా విక్రయించనున్న బీఏటీ

దేశీయ వ్యాపార దిగ్గజం ఐటీసీ లిమిటెడ్‌లో 3.5 శాతం వాటాను విక్రయించాలనుకుంటున్నట్లు బ్రిటన్‌కు చెందిన బహుళజాతి సంస్థ బ్రిటిష్ అమెరికన్ టొబాకో (బీఏటీ) పీఎల్‌సీ తెలిపింది. ఈ వాటాను సంస్థాగత ఇన్వెస్టర్లకు ఓపెన్ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా విక్రయించనుంది. ఐటీసీలో బీఏటీ అతిపెద్ద వాటాదారు. మంగళవారం ఐటీసీ షేరు రూ.404.25 వద్ద ముగిసింది. ఈ లెక్కన కంపెనీలో బీఏటీ విక్రయించాలనుకుంటున్న వాటా విలువ సుమారు రూ.17,659 కోట్లు. ప్రస్తుతం ఐటీసీలో బీఏటీ 29 శాతం వాటా కలిగి ఉంది. ప్రతిపాదిత వాటా విక్రయం తర్వాత 25.5 శాతానికి తగ్గనుంది.

స్పోర్ట్స్



ఎలిస్ పెర్రీ (6/15)

ఆర్‌సీబీ ప్లేఆఫ్స్‌కు..

ముంబైపై ఘన విజయం

ఎలిస్ పెర్రీకి ఆరు వికెట్లు
మహిళల ప్రీమియర్ లీగ్

నేటి మ్యాచ్
ఢిల్లీ x గుజరాత్
రాత్రి 7.30 గం. నుంచి

న్యూఢిల్లీ: డబ్ల్యూపీఎల్ చరిత్రలోనే పేసర్ ఎలిస్ పెర్రీ (6/15) బెస్ట్ బౌలింగ్‌ను నమోదు చేయడంతో పాటు బ్యాటింగ్ (40 నాటౌట్)లోనూ చెలరేగింది. దీంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు సగర్వంగా ప్లేఆఫ్స్‌లో ప్రవేశించింది. మంగళవారం ముంబై ఇండియన్స్‌తో చావోరేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో నెగ్గిన ఆర్‌సీబీ.. 8 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఓవర్‌కు రెండేసి వికెట్లతో చెలరేగిన పెర్రీ ధాటికి ముంబై బ్యాటర్లు చకచకా పెవిలియన్‌కు క్యూ కట్టారు. దీంతో 19 ఓవర్లలో ఆ జట్టు 113 పరుగులకే కుప్పకూలింది. సజన (30), హేలీ మాథ్యూస్ (26) మాత్రమే రాణించారు. ఏడుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఆ తర్వాత స్వల్ప ఛేదనలో ఆర్‌సీబీ 15 ఓవర్లలో 3 వికెట్లకు 115 పరుగులు చేసి నెగ్గింది. ఓపెనర్లు మంధాన (11), మొలినెక్స్ (9), డివైన్ (4) విఫలమైనా.. ఎలిస్ పెర్రీ (40 నాటౌట్) బ్యాట్‌తోనూ అదరగొట్టింది. రిచా ఘోష్ (36 నాటౌట్)తో కలిసి నాలుగో వికెట్‌కు 76 పరుగులు జోడించడం విశేషం.

ఎలిస్ అదుర్స్: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ముంబైని పేసర్ ఎలిస్ ఓ ఆటాడుకుంది. ఇన్నింగ్స్ ఆరంభంలో ఓపెనర్లు సజన, మాథ్యూస్ మెరుగ్గానే రాణించారు. ఆరో ఓవర్‌లో మాథ్యూస్‌ను డివైన్ అవుట్ చేసినా, పవర్ ప్లేలో జట్టు 43 పరుగులతో పటిష్ఠంగానే కనిపించింది. కానీ ఆ తర్వాతే పెర్రీ షో ఆరంభమైంది. తన తొలి ఓవర్‌లో రెండు పరుగులే ఇవ్వగా.. అనంతరం వరుసగా వేసిన మూడు ఓవర్లలో సజన, హర్మన్ (0), కెర్ (2), అమన్‌జోత్ (4), వస్త్రాకర్ (6), సివర్ (10)ల పనిబట్టడంతో ముంబై చిగురుటాకులా వణికింది. ఇందులో నాలుగు బౌల్డ్, రెండు ఎల్బీలుండడం విశేషం. చివర్లో ప్రియాంక (19 నాటౌట్) ఆటతో స్కోరు వంద దాటింది.

సంక్షిప్త స్కోర్లు:
ముంబై: 19 ఓవర్లలో 113 ఆలౌట్ (సజన 30, మాథ్యూస్ 26; పెర్రీ 6/15);
బెంగళూరు: 15 ఓవర్లలో 115/3 (పెర్రీ 40 నాటౌట్, రిచా 36 నాటౌట్; మాథ్యూస్ 1/11)

సింధు ముందంజ

ప్రణయ్, శ్రీకాంత్, గాయత్రి జోడీకి నిరాశ



సింధు

ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్స్



ప్రణయ్

బర్మింగ్‌హామ్: భారత ఏస్ షట్లర్ పీవీ సింధు.. ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్స్ ప్రీక్వార్టర్స్‌కు చేరుకొంది. అయితే, వరల్డ్ నెం:8 హెచ్ఎస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్, ఆకర్షి కశ్యప్‌తోపాటు గాయత్రి జోడీ తొలి రౌండ్‌లోనే ఓడి ఇంటిముఖం పట్టింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో వరల్డ్ నెం:11 సింధు 21-10తో మొదటి గేమ్ నెగ్గి ఆధిక్యంలో ఉన్నప్పుడు.. ప్రత్యర్థి యొవన్నీ లీ (జర్మనీ) మ్యాచ్ మధ్యలో రిటైరైంది. రెండో రౌండ్‌లో చిరకాల ప్రత్యర్థి, టాప్ సీడ్ అన్ సి యంగ్ (కొరియా)తో సింధు తలపడే అవకాశాలున్నాయి. గతంలో సింధు..అన్ సి యంగ్‌తో ఆడిన ఆరుసార్లలో ఒక్కసారి కూడా గెలవలేకపోవడం ఆందోళన కలిగించే అంశం. ఇక ఆకర్షి కశ్యప్ 16-21, 11-21తో పై యు పొ (చైనీస్ తైపీ) చేతిలో ఓడింది. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి పుల్లెల 18-21, 12-21తో ఇండోనేసియా జంట అప్రియాని రహాను-సిటి ఫాడియా సిల్వ రమధంతి చేతిలో పరాజయం పాలైంది. తొలి గేమ్ ఆరంభంలో గాయత్రి ద్వయం 7-12తో వెనుకబడినా.. వరుసగా 5 పాయింట్లు సాధించి.. 12-12తో స్కోరు సమం చేసింది. ఆ తర్వాత ఆధిక్యం చేతులు మారుతూ 18-18తో మరోసారి సమమైంది. అయితే, వరుసగా మూడు పాయింట్లు స్కోరు చేసిన ఇండోనేసియా జోడీ గేమ్‌ను తమ ఖాతాలో వేసుకొంది. రెండో గేమ్‌లో ప్రత్యర్థి జోరు ముందు భారత ద్వయం నిలవలేక పోయింది.



శ్రీకాంత్

పోరాటమే లేకుండా..

పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ 21-14, 13-21, 13-21తో సు లి యంగ్ (చైనీస్ తైపీ) చేతిలో కంగుతిన్నాడు. తొలి గేమ్‌ను ప్రణయ్ సునాయాసంగా నెగ్గినా.. అదే జోరును కొనసాగించలేక పోయాడు. ఫ్రెంచ్ ఓపెన్ తర్వాత తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టడం ఇది వరుసగా రెండోసారి. మరో మ్యాచ్‌లో శ్రీకాంత్ 9-21, 9-21తో వరల్డ్ నెం:1 విక్టర్ అక్సెల్‌సెన్ (డెన్మార్క్) చేతిలో వరుస గేముల్లో చిత్తయ్యాడు. మొదటి గేమ్ ఆరంభంలో శ్రీకాంత్ పోటీ ఇచ్చే విధంగా కనిపించినా.. 5-7 స్కోరు వద్ద వరుసగా నాలుగు పాయింట్లు సాధించిన అక్సెల్‌సెన్ 11-5తో బ్రేక్‌కు వెళ్లారు. తిరిగి వచ్చిన తర్వాత మరింత దూకుడుగా ఆడి గేమ్‌ను సొంతం చేసుకొన్నాడు. రెండో గేమ్‌లో 4-11తో వెనుకబడిన శ్రీకాంత్.. ఏ దశలోనూ ప్రత్యర్థికి పోటీ ఇచ్చే విధంగా కనిపించలేదు. వీరిద్దరి ఓటమితో పురుషుల సింగిల్స్‌లో 2022 రన్నరప్ లక్ష్య సేన్, ప్రియాంశు రజావత్ మాత్రమే మిగిలారు. బుధవారం జరిగే తొలి రౌండ్ పోరులో మాగ్నస్ జొహాన్నెసెన్‌తో లక్ష్య తలపడనున్నాడు.

కోహ్లీకి చోటు కష్టమేనా?

టీ20 వరల్డ్‌కప్



న్యూఢిల్లీ: స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (36) లేకుండానే భారత జట్టు టీ20 ప్రపంచకప్‌లో పోటీ పడనుందా? జాతీయ సెలెక్టర్ల తీరు చూస్తుంటే..అవుననే అనిపిస్తోంది. మే మొదటి వారంలో అన్ని జట్లు తమ ప్రాథమిక ఆటగాళ్ల జాబితాలను ఐసీసీకి పంపాల్సి ఉంటుంది. జూన్ 2 నుంచి 29 వరకు కరీబియన్ దీవులు, అమెరికాలో జరిగే ఈ మెగా టోర్నీలో భారత జట్టు రోహిత్ నేతృత్వంలోనే ఆడనుందని బీసీసీఐ కార్యదర్శి జైషా ఇప్పటికే స్పష్టం చేశాడు. కానీ ఈ టీమ్‌లో విరాట్ కోహ్లీ ఉంటాడా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. 2013లో చాంపియన్స్ ట్రోఫీ తర్వాత టీమిండియా ఒక్క ఐసీసీ ట్రోఫీ కూడా గెలవలేకపోయింది. ఈ నేపథ్యంలో సెలెక్టర్లు కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కోహ్లీకి ఉద్వాసన కూడా ఇందులో భాగమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. టీ20 ఫార్మాట్‌లో విరాట్ ప్రదర్శనపై సెలెక్టర్లు సంతృప్తిగా లేరు. అలాగే విండీస్‌లో స్లో వికెట్ కోహ్లీ ఆటతీరుకు సరిపోదని, యువ ఆటగాళ్లకు అవకాశం ఇచ్చేందుకు స్వచ్ఛందంగా తప్పుకొనేలా అతడికి సర్దిచెప్పే బాధ్యతలను చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు అప్పజెప్పినట్టు సమాచారం. విరాట్ లేకుంటే మిడిలార్డర్‌లో సూర్యకుమార్, రింకూ సింగ్, తిలక్ వర్మ, దేవ్‌దత్ పడిక్కళ్‌లలో ఒకరిని బరిలోకి దించవచ్చు. కానీ ఐపీఎల్‌లో కోహ్లీ అంచనాలకు మించి రాణిస్తే మాత్రం సెలెక్టర్ల వైఖరిలో మార్పు వచ్చే అవకాశం లేకపోలేదు. ఏదేమైనా కోహ్లీపై వేటు అనేది చాలా సున్నితమైన వ్యవహారమని, తుది నిర్ణయాన్ని అజిత్ అగార్కర్‌కే వదిలేసినట్టు బోర్డు అధికారి ఒకరు పేర్కొన్నాడు. కాగా కోహ్లీ అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో 117 మ్యాచ్‌లాడి 51.75 సగటుతో 4037 పరుగులు చేశాడు. వీటిలో ఒక సెంచరీ, 37 అర్ధ సెంచరీలున్నాయి. టీ20ల్లో అత్యధిక పరుగుల వీరులలో కోహ్లీ, రోహిత్ శర్మ (151 మ్యాచ్‌ల్లో 3974), బాబర్ ఆజమ్ (109 మ్యాచ్‌ల్లో 3698) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

విదర్భ లక్ష్యం 538



ముషీర్ ఖాన్ (136)

• ప్రస్తుతం 10/0 • ముంబై 418 ఆలౌట్
• ముషీర్ సెంచరీ.. రాణించిన అయ్యర్

ముంబై: ముషీర్ ఖాన్ (136) శతకంతో.. విదర్భతో రంజీ ఫైనల్లో ముంబై ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. ఆటకు మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 141/2తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ముంబై 418 పరుగులకు ఆలౌటైంది. శ్రేయాస్ అయ్యర్ (95), రహానె (73), ములాని (50 నాటౌట్) రాణించారు. హర్ష్ దూబే 5 వికెట్లు పడగొట్టాడు. 119 రన్స్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి ముంబై మొత్తం 538 పరుగుల భారీ లక్ష్యాన్ని విదర్భ ముందుంచింది. ఛేదన కోసం దిగిన విదర్భ ఆట చివరికి వికెట్ నష్టపోకుండా 10 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 224 రన్స్ చేయగా.. విదర్భ 105 పరుగులకే కుప్పకూలింది. కాగా రంజీ ఫైనల్లో సెంచరీ చేసిన పిన్నవయసు ముంబై బ్యాటర్‌గా సచిన్ టెండూల్కర్ 29 ఏళ్ల రికార్డును 19 ఏళ్ల ముషీర్ అధిగమించాడు.

ఐపీఎల్‌కు పంత్ ఫిట్

పేసర్ ప్రసిద్ధ్ దూరం



న్యూఢిల్లీ: వికెట్ కీపర్ రిషబ్ పంత్ అభిమానులకు బీసీసీఐ శుభవార్త తెలిపింది. 14 నెలలుగా ఆటకు దూరంగా ఉన్న అతడు తిరిగి క్రికెట్ మైదానంలోకి అడుగు పెట్టనున్నాడు. 2022, డిసెంబరులో కారు ప్రమాదానికి గురైన పంత్ పూర్తిగా కోలుకున్నాడు. ఈమేరకు అతడికి బీసీసీఐ మెడికల్ టీమ్ క్లియరెన్స్ సర్టిఫికెట్ కూడా ఇచ్చింది. ప్రమాదంలో శరీరానికి అనేక చోట్ల గాయాలుకాగా.. పంత్ సుదీర్ఘ కాలంగా ఎన్‌సీఏ పునరావాస శిబిరంలో ఉండి కోలుకున్నాడు. 'రానున్న ఐపీఎల్‌లో పంత్ బ్యాటర్‌గానే కాకుండా వికెట్ కీపర్‌గానూ సేవలందించేందుకు ఫిట్‌గా ఉన్నాడు' అని బోర్డు పేర్కొంది. కాగా పేసర్లు ప్రసిద్ధ్ క్రిష్ణ (రాజస్థాన్), షమి (గుజరాత్) తమ గాయాలకు శస్త్ర చికిత్స చేయించుకుని కోలుకుంటుండడంతో ఐపీఎల్‌కు దూరం కానున్నారని బోర్డు తెలిపింది.

ఫెడరేషన్ చాంపియన్‌షిప్‌లో వినోద్‌కు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్ ఫెడరేషన్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ అథ్లెట్ బి.వినోద్ కుమార్ స్వర్ణం సాధించాడు. లఖ్‌నవూలో జరిగిన ఈ పోటీల్లోని 800 మీటర్ల పరుగును వినోద్ ఒక నిమిషం 51 సెకన్లలో రేసును పూర్తి చేశాడు. గచ్చిబౌలి స్టేడియంలోని శాట్స్ అథ్లెటిక్ కేంద్రంలో వినోద్ శిక్షణ తీసుకుంటున్నాడు. గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ వెంకటేశ్వరరావు, కోచ్ శ్రీనివాస్, వినోద్‌ను అభినందించారు.

అహ్మదాబాద్‌పై బెంగుళూరు గెలుపు



చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్ సూపర్-5లో అహ్మదాబాద్ డిఫెండర్స్‌కు బెంగుళూరు టోర్పెడోస్ షాకిచ్చింది. మంగళవారం ఇక్కడ జరిగిన పోటీల్లో బెంగుళూరు 3-2తో అహ్మదాబాద్‌పై గెలిచింది. తొలి రెండు సెట్లలో 14-16, 7-15తో ఓడిన బెంగుళూరు, ఆ తర్వాత పుంజుకొని అహ్మదాబాద్‌కు చుక్కలు చూపించింది. అనంతరం 16-14, 15-9, 15-13తో వరుసగా మూడు సెట్లు గెలిచి, మ్యాచ్‌లో విజయం సాధించింది.

● భారత హాకీ ర్యాంకు కిందికి...

న్యూఢిల్లీ: ఎఫ్ఐహెచ్ తాజా వరల్డ్ ర్యాంకింగ్స్‌లో భారత హాకీ జట్టు (2,761 పాయింట్లు) మూడు నుంచి నాలుగో స్థానానికి దిగజారింది. ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో అద్భుతంగా రాణించిన జర్మనీ జట్టు (2,786) మూడో స్థానానికి ఎగబాకింది. నెదర్లాండ్స్ (3,060) టాప్‌లో, బెల్జియం (2,848) రెండోస్థానంలో కొనసాగుతున్నాయి. మహిళల ర్యాంకింగ్స్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. నెదర్లాండ్స్ అగ్రస్థానంలో నిలవగా, అర్జెంటీనా, జర్మనీ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

విజిలెన్స్‌కు అపరిమిత అధికారాలొద్దు!

▸▸ హైకోర్టులో లోకేశ్ పిటిషన్

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏ కార్యాలయాన్నైనా, సంస్థనైనా సందర్శించేందుకు, తనిఖీ చేసి రికార్డులు జప్తు చేసేందుకు, వారెంట్ లేకుండానే అరెస్టు చేసేందుకు వీలుగా అపరిమిత అధికారాలు కల్పించాలని కోరుతూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కొల్లి రఘురామిరెడ్డి ప్రభుత్వానికి రాసిన లేఖను, దానికి అనుగుణంగా తీసుకున్న చర్యలను చట్ట, రాజ్యాంగవిరుద్ధమైనవిగా ప్రకటించాలని కోరుతూ టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. 'టీడీపీ నాయకులు, మద్దతుదారులను తప్పుడు కేసులలో ఇరికించాలనే ఉద్దేశంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అక్రమంగా అధికారాలు కట్టబెట్టబోతున్నారు' అని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల రఘురామిరెడ్డి రాసిన లేఖకు అనుగుణంగా ముఖ్యమంత్రి సహా సంబంధిత అధికారులు ఎలాంటి ఉత్తర్వులు, నోటీసులు, సర్క్యులర్లు, ఆర్డినెన్స్ తదితరాలు జారీ చేయకుండా నిషేధం విధించాలని కోరారు. రఘురామిరెడ్డి లేఖపై యథాతథస్థితి పాటించేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ జనరల్ అడ్మినిస్ట్రేషన్ (విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్)శాఖ, డైరెక్టర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ అడ్మినిస్ట్రేషన్ (విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) శాఖలను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు. సీఎం జగన్, ఐపీఎస్ కొల్లి రఘురామిరెడ్డిని వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారు.

పిటిషన్‌లో ఏమున్నదంటే..

"పిటిషనర్ పార్టీని, నాయకులను ఇబ్బంది పెట్టడం కోసమే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అక్రమంగా అధికారాలు కట్టబెట్టబోతున్నారు. ఇలాంటి చర్యలను అనుమతిస్తే పిటిషనర్ హక్కులను హరించడమే అవుతుంది. ఎన్నికల్లో పోటీ చేసే టీడీపీ నేతలను లక్ష్యంగా చేసుకొని, వారిపై బెదిరింపులకు పాల్పడేందుకు సీఎం తన నమ్మినబంటు అయిన రఘురామిరెడ్డిని వినియోగిస్తున్నారు. కార్యనిర్వహక అధికారాలను వినియోగించి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు అపరిమిత అధికారాలు కట్టబెట్టడానికి వీల్లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే ఏపీ జీఎస్టీ వ్యాట్, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్‌తో పాటు మొత్తం 13 చట్టాలను తమ పరిధిలోకి తీసుకురావాలని, ఆయా శాఖలలో తనిఖీలు చేసేందుకు అధికారాలు కల్పించాలని విజిలెన్స్ ఐజీ లేఖ రాయడం చట్ట నిబంధనలు అతిక్రమించడమే అవుతుంది" అని పేర్కొన్నారు.

టార్గెట్ 160

(మొదటి పేజీ తరువాయి)

సాధించడానికి శ్రమించాలని పార్టీ శ్రేణులకు పిలుపిచ్చారు. టీడీపీ క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయిల్లో వివిధ బాధ్యతల్లో ఉన్న 56 వేల మంది నేతలతో మంగళవారం సాయంత్రం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో పొత్తులు, వర్తమాన రాజకీయ అంశాలపై మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ గెలుపు చారిత్రక అవసరమన్నారు. పోలింగ్ ముగిసేవరకూ పార్టీ నేతలు, కార్యకర్తలు విశ్రమించరాదని సూచించారు. 'జగన్ విధ్వంస పాలన రాష్ట్రాన్ని ఇరవై ఏళ్లు వెనక్కి తీసుకెళ్లింది. ప్రతి రంగంలో పతనమే. దోచుకుని జేబులు నింపుకోవడం తప్ప అభివృద్ధి గురించి పట్టించుకున్న నాథుడు లేడు. ఏపీని మళ్లీ పైకి లేపడానికే మూడు పార్టీలు కలిసి పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నాయి' అని ఉద్ఘాటించారు. మూడు పార్టీల పొత్తు జగన్‌ను ఓడించడానికి కాదు.. రాష్ట్రాన్ని గెలిపించడానికేనన్నారు. ఆంధ్ర విస్తృత ప్రయోజనాల కోసమే 3 పార్టీలు చేతులు కలిపాయని చెప్పారు. 'నిజం గెలవాలి' పేరుతో భువనేశ్వరి చేస్తున్న పర్యటనలకు మంచి స్పందన లభిస్తోందని, ప్రతి బాధిత కుటుంబాన్ని ఆదుకునే వరకూ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే...

ప్రజాస్వామ్య వ్యవస్థలు నిర్వీర్యం

జగన్ రాష్ట్రాన్ని పూర్తిగా ధ్వంసం చేశాడు. ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేశాడు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి కేంద్రం సహకారం అవసరం. టీడీపీ గతంలో ఎన్డీయేలో భాగస్వామిగా ఉంది. పాతికేళ్ల కిందటే అందులో కీలక భాగస్వామిగా పనిచేసింది. టీడీపీ హయాంలో కేంద్ర నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ఈ రోజు గ్రామాల్లో కనిపిస్తున్న ప్రతి రోడ్డూ మన హయాంలో వేసినదే. రాష్ట్ర ప్రయోజనాలు తప్ప స్వప్రయోజనాలు ఆశించని పార్టీ టీడీపీ అని ప్రజలందరికీ తెలుసు. ఉన్నతాశయంతో మూడు పార్టీలు కలిసి పోటీచేస్తున్న విషయం దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలో పార్టీ నేతలు, కార్యకర్తలు కలిసి పనిచేయాలి. అభ్యర్థుల ప్రకటనతో పార్టీలో జోరు పెరిగింది. క్షేత్ర స్థాయిలో ఉత్సాహం వచ్చింది. పార్టీ ప్రకటించిన అభ్యర్థికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలి. టికెట్ పొందిన నేతల పనితీరును చివరి వరకూ సమీక్షిస్తుంటాం. ప్రజల్లో లేకపోయినా.. మంచి పేరు తెచ్చుకోకపోయినా మార్చడానికి వెనుకాడను.

అక్రమాలను నమ్ముకున్నాడు..

ముఖ్యమంత్రి జగన్ జనాన్ని నమ్ముకోలేదు. పోలింగ్ అక్రమాలను నమ్ముకున్నాడు. పార్టీ నేతలు, అభ్యర్థులు ప్రతి అంశాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తేవాలి. ప్రతి అభ్యర్థీ ఒక న్యాయవాదిని పెట్టుకుని ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలి. ఎన్నికల షెడ్యూల్ వచ్చి కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత వైసీపీ ఆగడాలు.. అధికార పార్టీకి తొత్తులుగా పనిచేస్తున్న అధికారుల ఆటలు సాగవు. ఇప్పటికే ఆర్టీసీ అధికారులు బస్సులు ఇవ్వడానికి అంగీకరించారు. మార్పు వస్తోందనడానికి ఇది నిదర్శనం. అధికారులు మనకు మద్దతుగా ఉండాలని మనం కోరడం లేదు. చట్ట ప్రకారం పని చేయాలని మాత్రమే కోరుతున్నాం.

- రివర్స్ పాలన, దుష్ట పాలనతో నష్టపోయిన రాష్ట్రం కోసం.. బాధ్యతతో కలిసి పనిచేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ నిర్ణయం తీసుకున్నాయి. ఈ పొత్తు ఆంధ్రకు లాభం చేకూరుస్తుంది.
- పోలవరం పూర్తి చేయడానికి.. రాజధాని నిర్మాణానికి.. పెట్టుబడులు, పరిశ్రమలు రాబట్టడానికి... మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర సాయం ఎంతో అవసరం.
- ప్రధాని మోదీ పాల్గొనే చిలకలూరిపేట సభను ఘనంగా జయప్రదం చేయాలి. విధ్వంస పాలనలో శిథిలమైన రాష్ట్రాన్ని నిలబెట్టడానికి ఈ ఉమ్మడి సభ తొలి అడుగు. - చంద్రబాబు

బీసీని మార్చేసి ఓసీకి!

వైసీపీలో మార్పులే మార్పులు!

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ వైసీపీ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలను నియమించడం.. పట్టుమని పది రోజులు కూడా కాకుండానే వారిని మార్చేయడం పార్టీ అధ్యక్షుడు, సీఎం జగన్‌కు రివాజుగా మారింది. తాజాగా మంగళవారం రాత్రి రెండు అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన మార్పులతో 13వ జాబితాను విడుదల చేశారు. దీని ప్రకారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గానికి గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడును, ఉమ్మడి విశాఖపట్నంలోని గాజువాక నియోజకవర్గం ఇన్‌చార్జిగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను నియమించారు. అయితే, ఈ నియామకాలపై సొంత పార్టీలోనే తీవ్ర అసంతృప్తులు, ఆగ్రహాలు పెల్లుబుకుతున్నాయి. చిలకలూరిపేట ఇన్‌చార్జిగా మల్లెల రాజేశ్‌ను నియమించారు. ఆయన గ్రాఫ్ సరిగా లేదని, ఎన్నికల్లో పోటీని తట్టుకుని నిలబడలేరని చెబుతూ కావటికి చాన్సిచ్చారు. ఇక, గాజువాకలో సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి బదులు యాదవ సామాజికవర్గానికి చెందిన బీసీ నేత ఉరుకూటి రామచంద్రరావును నియమించారు. ఇప్పుడు మళ్లీ కాపు సామాజికవర్గానికి(ఓసీ) చెందిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను సమన్వయకర్తగా నియమించారు. యాదవవర్గానికి ఉరుకూటి రామచంద్రరావును తొలగించి, అగ్రవర్ణానికి చెందిన గుడివాడను జగన్ అందలమెక్కించారని స్థానిక నేతలే ఆగ్రహిస్తున్నారు. అభ్యర్థుల విషయంలో సింగిల్ సింహం అయోమయానికి గురవుతోందని ఎద్దేవా చేస్తున్నారు.

పేట సభకు భారీ ఏర్పాట్లు

ఉమ్మడి కమిటీలతో లోకేశ్ భేటీ.. సభాస్థలికి నేడు భూమిపూజ

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాల్గొనే చిలకలూరిపేట బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య పొత్తు కుదిరిన తర్వాత రాష్ట్రంలో ప్రధాని పాల్గొనే తొలి సభ ఇదే కావడంతో ఈ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేస్తున్నారు. దీనికోసం 13 కమిటీలు వేశారు. ఈ కమిటీల్లో మూడు పార్టీల నేతలకు ప్రాతినిధ్యం కల్పించారు. ఆ కమిటీల్లో సభ్యులుగా ఉన్న నేతలతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ మంగళవారమిక్కడ ఉండవల్లిలో సమావేశం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కూడా పాల్గొన్నారు. 'రాతియుగం నుంచి స్వర్ణయుగం వైపు రాష్ట్రాన్ని నడిపించడానికి మూడు పార్టీలు పొత్తు పెట్టుకున్నాయి. వీటి ఆధ్వర్యంలో జరిగే ఈ సభ నవ శకానికి నాంది. మూడు పార్టీలు కలిసి రాష్ట్ర చరిత్రలో అద్భుతమైన ప్రభంజనం సృష్టించబోతున్నాయి. రాష్ట్రాన్ని కాపాడుకోవలసిన అవసరం ఉందని గుర్తించిన ప్రజలు ఈ పొత్తును స్వాగతిస్తున్నారు. చిలకలూరిపేట సభకు లక్షలాది మంది తరలిరావడానికి సిద్ధంగా ఉన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిద్దాం. సభకు వచ్చిన వారికి ఏ అసౌకర్యమూ కలుగకుండా ఏర్పాట్లు చేద్దాం' అని లోకేశ్ ఈ సందర్భంగా అన్నారు. సభ జరిగే బొప్పూడి గ్రామంలో బుధవారం ఉదయం సభాస్థలికి భూమి పూజ నిర్వహించనున్నట్లు చెప్పారు.

జనం డబ్బు జగన్ డప్పు!

(మొదటి పేజీ తరువాయి)

వీసీ, ఎండీ ప్రభుత్వాన్ని అడగడమే ఆలస్యం... రూ.20 కోట్లు ఇచ్చేశారు. దీనిపై జీవో కూడా వచ్చేసింది. అంటే.. డిజిటల్ మీడియా కార్పొరేషన్‌కు రూ.120 కోట్లు ధారపోశారన్న మాట! అంత డబ్బులు ఖర్చుపెట్టి ప్రజలకు ఏం ఒరగబెట్టిందో... చూద్దామంటే మచ్చుకు ఒక్క మేలూ కనపడదు. టీడీపీ హయాంలో ప్రభుత్వ శాఖలకు కంటెంట్ ఇవ్వడానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. దేశ, విదేశాల్లో రాష్ట్ర ప్రతిష్ఠను పెంచేందుకు అవసరమైన సమాచారం, సదస్సులు, సమావేశాల్లో ప్రధానంగా ప్రస్తావించాల్సిన అంశాల వివరాలను 'కంటెంట్ కార్పొరేషన్' అన్ని శాఖలకు అందించేది. దీనినే 2020లో జగన్ డిజిటల్ కార్పొరేషన్‌గా మార్చేశారు. దీని ద్వారా అన్ని జిల్లాల్లో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేస్తామని 2021లో ప్రకటించారు. ఇప్పటి దాకా కడపలో నమూనా డిజిటల్ లైబ్రరీ మాత్రమే ఏర్పాటు చేశారు. అంతకుమించి ఒక్క అడుగూ పడలేదు. మరి వందల కోట్ల డబ్బును డిజిటల్ కార్పొరేషన్ ఏం చేస్తున్నట్టు?

బాకా ఊదడం.. బురద చల్లడం!

ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో సుమారు 150 మంది పని చేస్తున్నారు. ప్రతినెలా వీరికి రూ.30వేల నుంచి లక్షన్నర దాకా చెల్లిస్తున్నారు. వీళ్లకు ఇచ్చేది జనం డబ్బులు. చేయించుకునేది సొంత పని! జగన్ భజన చేయడం, విపక్షాలపై బురదచల్లడం, విపక్షాలను సమర్థించే వారిని ట్రోల్ చేయడం! దీంతోపాటు... 'కూలి మీడియా'లా పని చేసే యూట్యూబ్ చానళ్లకు కూడా డిజిటల్ కార్పొరేషన్ ద్వారానే డబ్బులు అందుతాయి. జగన్‌కు బాకాలూదే ప్రైవేట్ వెబ్‌సైట్‌లు, యూట్యూబ్ చానళ్లకు యాడ్స్ రూపంలో కోట్లాది రూపాయలు దోచిపెడుతున్నారు. నిజానికి... వైసీపీ సోషల్ మీడియా, ఏపీ డిజిటల్ కార్పొరేషన్... రెండు కలగాపులగంలా కలిసిపోయాయి. అక్కడ పని చేసే వారే ఇక్కడా పని చేస్తారు. జగన్ సొంత మీడియా ఉద్యోగులు కొందరు సమాచార, పౌరసంబంధాల శాఖలో పాగా వేసినట్లు బలమైన ఆరోపణలున్నాయి. వీళ్లు కూడా ప్రభుత్వ ధనం తీసుకుంటూ... 'రోత పత్రిక' కోసం పని చేస్తుంటారనే విమర్శలున్నాయి. ప్రభుత్వ సంస్థ అయిన డిజిటల్ కార్పొరేషన్‌ను పూర్తిస్థాయిలో వైసీపీ సోషల్ మీడియా కోసం పనిచేసే వారితో నింపేశారనేది జగమెరిగిన సత్యం. ఎన్నికల నేపథ్యంలో జగన్ భజన, విపక్షాలపై ట్రోలింగ్ మరింత దూకుడుగా చేయాల్సి ఉందంటూ... ఇటీవల డిజిటల్ కార్పొరేషన్‌లో పనిచేసే సిబ్బంది జీతాలు బాగా పెంచారు. చెల్లింపులూ పెరగనున్న నేపథ్యంలోనే రూ.40 కోట్లు కావాలని కోరినట్లు తెలిసింది.

సొమ్ముల కోసం సాకులు

ఈ ఏడాది డిజిటల్ కార్పొరేషన్‌కు ఇచ్చిన వంద కోట్లలో రూ.18 కోట్లు సమాచార శాఖ పంపిన బిల్లులు చెల్లించడం కోసం వాడినట్టుగా జీవోలో చెప్పారు. ఈ బిల్లులు వైజాగ్‌లో జగన్ సర్కార్ నిర్వహించిన జీఐఎస్ సదస్సువని తెలిపారు. ఆ సదస్సు ద్వారా రాష్ట్రానికి రూపాయి పెట్టుబడి రాకపోగా ఖర్చుల పేరుతో ఖజానా నుంచి వందల కోట్లు మాయం చేశారు. సమాచార శాఖ, డిజిటల్ కార్పొరేషన్ పేరు ఏదైనా సొమ్ములు మాత్రం జనానివి. ప్రచారం మాత్రం వైసీపీకి!

అడ్డగోలు దోపిడీ

ఐడ్రీమ్ యూట్యూబ్ చానల్ యజమాని చిన్న వాసుదేవరెడ్డిని డిజిటల్ కార్పొరేషన్‌కు అధిపతిగా నియమించారు. ఒక ప్రభుత్వ సంస్థకు, అదే రంగంలోని ప్రైవేటు వ్యక్తిని అధిపతిని చేయడమంటే ప్రభుత్వ సంస్థను అణగదొక్కడమే. వైసీపీ ప్రభుత్వాన్ని, జగన్‌ను పొగిడేందుకు ఏపీడీసీ ప్రైవేట్ వెబ్‌సైట్ నిర్వాహకులను 2022 ఫిబ్రవరిలో పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి మరీ ఆహ్వానించింది. మీ వెబ్‌సైట్లలో ప్రభుత్వ విజయాలు ప్రచురిస్తే, యూనిక్ కస్టమర్ బేస్ ఆధారంగా ఫీజు చెల్లిస్తామని చెప్పింది. పదుల సంఖ్యలో వైసీపీ అనుకూల వెబ్‌సైట్‌లు, యూట్యూబ్ చానళ్లకు కాంట్రాక్టులు ఇస్తూ ఎంప్యానెల్ చేసుకుంది. ప్రభుత్వ యాడ్స్ ముసుగులో అస్మదీయులకు ప్రజల సొమ్మును వెదజల్లుతోంది.

టికెట్ ఇప్పిస్తానని రజిని 6.5 కోట్లు తీసుకున్నారు

▸▸ ఇప్పుడు 'పేట' నుంచి తప్పించారు

▸▸ సజ్జల వద్ద పంచాయితీ పెడితే 3.5 కోట్లు ఇచ్చారు: రాజేశ్‌నాయుడు

గుంటూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు వైసీపీలో ముసలం పుట్టింది. మంత్రి విడదల రజని ప్రాతినిధ్యం వహిస్తున్న చిలకలూరిపేట సీటు విషయమై వైసీపీలో దుమారం చెలరేగింది. మంత్రిగా తన చర్యలతో ఆ నియోజకవర్గంలో వ్యతిరేకత మూటగట్టుకున్న రజని.. ఓటమి భయంతో అక్కడ నుంచి గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి వచ్చారు. రానున్న ఎన్నికల్లో ఇక్కడ నుంచే ఆమె పోటీ చేయనున్నారు. అయితే, మంత్రి రజినిని గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జ్‌గా నియమించిన రోజే మల్లెల రాజేశ్ నాయుడును చిలకలూరిపేట వైసీపీ సమన్వయకర్తగా పంపారు. అప్పట్లో ఆయన అభ్యర్థిత్వాన్ని రజని సమర్థించారు. తాజాగా మల్లెలకు చిలకలూరిపేటలో గెలుపు అవకాశాల్లేవని భావించిన వైసీపీ అధిష్ఠానం ఆయన స్థానంలో గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడును బరిలో నిలిపింది. ఈ విషయాన్ని రెండు రోజుల కిందటే రాజేశ్‌నాయుడుకు చెప్పినట్లు సమాచారం. దీంతో ఆయన వీధికెక్కారు. సీఎం జగన్ వద్దకు తీసుకెళ్లి తనకు సీటు ఇప్పించినందుకు మంత్రి రజని రూ.6.5 కోట్లు తననుంచి వసూల్ చేశారని, తిరిగి తన డబ్బులు తనకు ఇచ్చేయమని అడిగితే తొలుత పట్టించుకోలేదని ఆరోపించారు. ఇదే విషయంపై సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వద్ద పంచాయితీ పెట్టగా రూ.3.5 కోట్లు ఇప్పించారని తెలిపారు. ఇంతటితో సర్దుకోమని చెప్పారని అన్నారు. పార్టీ తిరిగి బతకాలంటే మార్చాల్సింది అభ్యర్థులను కాదని, సలహాదారు సజ్జలనే మార్చాలని మల్లెల విరుచుకు పడ్డారు. తనను మార్చాలనుకునే పక్షంలో మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌కు సీటు ఇవ్వాలని అతనికి సీటిస్తే రూ.20 కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

డబ్బుతో 'సిద్ధం'.. ఓటరుకు రూ.వెయ్యి!

ఎంపీ ఎంవీవీ ఫొటోతో ఇంటింటికీ కార్డుల పంపిణీ

ఎంవీపీ కాలనీ (విశాఖపట్నం), మార్చి 12: విశాఖపట్నం తూర్పు నియోజకవర్గంలో ఓటర్లకు వైసీపీ నాయకులు తాయిలాలు తెగ అందిస్తున్నారు. మొన్నటికి మొన్న స్వీట్లు, నిన్న చీరలు, ప్రస్తుతం డబ్బు పంపిణీకి 'సిద్ధమ'య్యారు. ఇంతకు ముందు ప్రతి ఇంటికీ స్వీట్ ప్యాకెట్ పంచారు. ఆ తర్వాత, ఓటరు జాబితాలో ఉన్న మహిళలందరికీ చీరల పంపిణీ చేసిన నేతలు.. ఇప్పుడు పురుషుల వెంట పడ్డారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి వార్డులో 'సిద్ధం' పేరిట చిన్నపాటి సభ నిర్వహిస్తున్నారు. ఆ కార్యక్రమాని కంటే ముందు కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఫొటో ఉన్న ప్రచార కార్డును అందిస్తున్నారు. ఇంట్లో ఎందరు పురుష ఓటర్లు ఉంటే అన్ని కార్డులు ఇచ్చి, వారంతా కార్డులు పట్టుకుని వేదిక వద్దకు వస్తే రూ.వెయ్యి చొప్పున ఇస్తామని చెబుతున్నారు. ఈ ప్రక్రియను మంగళవారం 19వ వార్డులో పూర్తిచేశారు. రోజుకు రెండు, మూడు వార్డుల చొప్పున ఈ కార్డుల పంపిణీ చేపడుతున్నట్టు సమాచారం.

తిరగబడ్డ వలంటీరు!

▸▸ ఇంటి స్థలం ఇవ్వకుండానే..

ఇచ్చినట్లు కరపత్రంపై నిరసన

నాగలాపురం, మార్చి 12: 'ఇప్పటి వరకు మంజూరు కాని ఇంటి స్థలాన్ని అందించినట్లు.. ఆ దేవుడి దయతో మీ కుటుంబానికి లబ్ధి కలిగినందుకు సంతోషిస్తున్నా'నంటూ సీఎం జగన్ సంతకంతో కూడిన కరపత్రం చేతికి రావడంతో ఓ మహిళా వలంటీర్‌కు చిర్రెత్తుకొచ్చింది. కరపత్రంలో ముద్రించిన మేరకు తనకు ఇంటి స్థలం అందించాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. తిరుపతి జిల్లా నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లి సచివాలయంలో వలంటీర్ రాజ్యలక్ష్మికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఓ కరపత్రం అందింది. ఇందులో ఇంటి స్థలం అందించడం ద్వారా రూ.2 లక్షల లబ్ధి ఆమెకు కలిగిందని ముద్రించి ఉంది. దీంతో ఇంటి స్థలం ఇవ్వకనే కరపత్రంలో ఎలా ముద్రిస్తారని ఆమె సచివాలయ వీఆర్వో స్వాతిని ప్రశ్నించారు. ఇదే సచివాలయ పరిధిలో మరో ఇద్దరు లబ్ధిదారులు అయ్యప్ప, గీతకు కూడా ఇంటి స్థలం అందించకుండానే కరపత్రంలో ముద్రించడంపై వారు కూడా వలంటీర్ రాజ్యలక్ష్మికి తోడయ్యారు. ముగ్గురూ కలిసి సచివాలయం ఎదుట నిరసనకు దిగారు. వలంటీర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తనకు రెండో జాబితాలో మంజూరైన ఇంటి స్థలం కోసం నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్నానని చెప్పారు. జగనన్న సైనికులమైన తమకే ఈ పరిస్థితి అంటే సాధారణ ప్రజల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు.

సీఏఏ దరఖాస్తులకు వెబ్‌సైట్

ప్రారంభించిన కేంద్ర హోంశాఖ.. త్వరలోనే మొబైల్ యాప్ కూడా

న్యూఢిల్లీ, మార్చి 12: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)-2019 కింద భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులైన వారి కోసం కేంద్ర హోంశాఖ మంగళవారం ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. ఫోన్ల ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా సీఏఏ-2019 పేరుతో ఒక మొబైల్ యాప్‌ను కూడా త్వరలో అందుబాటులోకి తీసుకురానుంది. పాక్, అఫ్గాన్, బంగ్లాదేశ్ నుంచి.. 2014 డిసెంబరు 31కి ముందు ఇక్కడికి వలస వచ్చిన హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు, క్రైస్తవులు భారత పౌరసత్వం మంజూరు కోసం https:/indiancitizenshiponline.nic.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పాస్‌పోర్టు సైజు ఫొటోతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దర్యాప్తు సంస్థలు బ్యాక్‌గ్రౌండ్ పరిశీలన పూర్తిచేసిన తర్వాత వాటిని ప్రాసెస్ చేస్తారు. నిర్దేశిత అధికారి నేతృత్వంలోని జిల్లా స్థాయి కమిటీ ద్వారా సాధికార కమిటీకి ఈ దరఖాస్తును సమర్పిస్తారు. ఈ చట్టం ఎలాంటి పత్రాలు లేని వారి కోసం ఉద్దేశించినందున, దరఖాస్తుదారులు అంతకు ముందు తాము నివసించిన దేశాల్లో (పాక్, అఫ్గాన్, బంగ్లాదేశ్) అక్కడి ప్రభుత్వాలు జారీ చేసిన ఏవైనా పత్రాలను అప్‌లోడ్ చేయవచ్చు.

సమర్పించాల్సిన పత్రాలు

సీఏఏ నిబంధనల ప్రకారం... దరఖాస్తుదారులు ఆయా దేశాల్లో తమకు ప్రస్తుతం ఉన్న పౌరసత్వాన్ని వదులుకోవడంతో పాటు భారతదేశాన్ని శాశ్వత చిరునామాగా అంగీకరిస్తూ డిక్లరేషన్ ఇవ్వాలి. విధేయతతో కూడిన ప్రమాణం కూడా చేయాల్సి ఉంటుంది. అలాగే వారు హిందూ, సిక్కు, జైన, బౌద్ధ, పార్శీ, క్రైస్తవ మతాలకు చెందినవారని, ప్రస్తుతం ఆయా మతాల్లోనే కొనసాగుతున్నారని ధ్రువీకరిస్తూ గుర్తింపు పొందిన ఏదైనా స్థానిక సంస్థ జారీ చేసిన అర్హత సర్టిఫికెట్‌ను సమర్పించాలి. వీటితో పాటు పౌరసత్వం కోసం ఈ కింది పత్రాల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించవచ్చు. పాక్, అఫ్గాన్, బంగ్లాదేశ్ ప్రభుత్వం జారీ చేసిన పాస్‌పోర్ట్, జనన ధ్రువీకరణ పత్రం/ ఏదైనా లైసెన్స్/ భూమి లేదా కౌలు రికార్డులు, స్టడీ సర్టిఫికెట్లు, అక్కడి ప్రభుత్వాలు మంజూరు చేసిన మరేదైనా గుర్తింపు పత్రంతో పాటు దరఖాస్తుదారుని తల్లిదండ్రులు లేదా తాతలు, ముత్తాతల్లో ఒకరు ఆయా దేశాలకు చెందినవారని నిరూపించే ఏదైనా పత్రం, దరఖాస్తుదారులు ఆయా దేశాల నుంచి వచ్చినట్లు నిర్ధారించేందుకు అక్కడి ప్రభుత్వాలు లేదా ప్రభుత్వ సంస్థలు జారీ చేసిన ఏ పత్రాన్నయినా ఆమోదిస్తారు. ఒకవేళ వాటి కాలపరిమితి దాటినా కూడా అవి చెల్లుబాటు అవుతాయని నిబంధనల్లో పేర్కొన్నారు.

భారత్‌లో స్థానికత నిరూపణకు....

దరఖాస్తుదారుడు 2014, డిసెంబరు 31 కంటే ముందే భారతదేశంలోకి ప్రవేశించినట్లుగా రుజువు చేసేందుకు ఈ పత్రాల్లో ఏదో ఒకదాన్ని సమర్పించాల్సి ఉంటుంది. భారత్‌కు వచ్చిన సమయంలోని వీసా కాపీ, ఇమిగ్రేషన్ స్టాంప్ కాపీలు, గ్రామీణ, పట్టణ సంస్థలకు ఎన్నికైన సభ్యులు లేదా రెవెన్యూ అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రం, భారత్‌లో జన గణన సమయంలో ఎన్యూమరేటర్లు జారీ చేసిన స్లిప్, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, స్కూల్ టీసీ, విద్యార్హత సర్టిఫికెట్లు, వ్యాపార లైసెన్స్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

రెట్రోస్పెక్టివ్ విధానంలో పౌరసత్వం

పౌరసత్వ చట్టం-1955లోని సెక్షన్-6బీ కింద పౌరసత్వం పొందినవారిని దేశంలో ప్రవేశించిన తేదీ నుంచి భారత పౌరులుగా పరిగణించనున్నట్లు ఎంహెచ్ఏ వెబ్‌సైట్‌లో పేర్కొనడంపై కేంద్ర హోంశాఖ అధికారులు స్పందించారు. సీఏఏ కింద అర్హులైన వారికి చట్టంలో పేర్కొన్న ప్రకారం రెట్రోస్పెక్టివ్ విధానంలో పౌరసత్వం మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.

సీఏఏ అమలుపై స్టే ఇవ్వండి

హైదరాబాద్/చెన్నై, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సీఏఏ అమలుపై స్టే మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం సుప్రీంకోర్టులో వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్)తో పాటు, డెమొక్రాటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ)లు ఈ పిటిషన్లు వేశాయి. సీఏఏ-2019 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై తీర్పు వెలువరించే వరకు ఈ నిబంధనల అమలును వాయిదా వేయాలని ఐయూఎంఎల్ తన పిటిషన్‌లో కోరింది. పౌరసత్వం కోసం ముస్లింలు కూడా దరఖాస్తు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరింది. సీఏఏ అమలుకు వ్యతిరేకంగా తాము మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మజ్లిస్ అధ్యక్షుడు ఒవైసీ తెలిపారు. ఎన్నార్సీకి వ్యతిరేకంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో నడవాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా, సీఏఏను తమిళనాడులోని అధికార డీఎంకేతో సహా ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే, కమల్ హాసన్ మక్కల్ నీది మయ్యం, విజయ్ తమిళగ వెట్రి కళగం, వీసీకేతో పాటు మరికొన్ని పార్టీలు వ్యతిరేకించాయి.

రక్షణలో స్వావలంబన

దేశీయంగా రక్షణ పరికరాల తయారీ రెట్టింపు.. 'భారత్ శక్తి' విన్యాసాల్లో ప్రధాని వెల్లడి

- పోఖ్రాన్‌లో అబ్బురపరచిన 'స్వదేశీ' విన్యాసాలు
- రూ.85 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులకు మోదీ శ్రీకారం



పోఖ్రాన్‌లో సైనిక వాహనంలో తిరుగుతూ 'భారత్ శక్తి' విన్యాసాలను తిలకిస్తున్న ప్రధాని మోదీ

పోఖ్రాన్, మార్చి 12: రక్షణ రంగంలో స్వావలంబన సాధిస్తున్నామని ప్రధాని మోదీ అన్నారు. గత పదేళ్లలో దేశీయంగా రక్షణ పరికరాల ఉత్పత్తి రెట్టింపుపైనే ఉందని.. వాటి విలువ రూ.లక్ష కోట్లు దాటేసిందని తెలిపారు. ఈ విజయ సాధనలో యువతదే కీలక పాత్రగా పేర్కొన్నారు. మంగళవారం రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో త్రివిధ దళాలు నిర్వహించిన 'భారత్ శక్తి' విన్యాసాల్లో ప్రధాని పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రక్షణ రంగంలో 150కిపైగా స్టార్టప్‌లు ఏర్పాటయ్యాయని.. సాయుధ బలగాలు రూ.1,800 కోట్ల విలువైన ఆర్డర్లు వాటికిచ్చి చేయూతనిస్తున్నాయని తెలిపారు. రక్షణ రంగంలో స్వావలంబన త్రివిధ బలగాల్లో విశ్వాసం నింపుతుందన్నారు. పోఖ్రాన్‌ను భారత ఆత్మనిర్భరత, విశ్వాసం, ఆత్మగౌరవం అనే త్రిమూర్తిత్వానికి ప్రతీకగా అభివర్ణించారు. తొలి అణు పరీక్ష ఇక్కడే జరిగిందని గుర్తుచేసుకున్నారు. పోఖ్రాన్ గగనతలాన యుద్ధవిమానాల గర్జన.. భూతలంపై సాయుధ జవాన్ల విన్యాసాలు 'నవ భారత'నికి సంకేతమన్నారు.

స్వదేశీ విమానాలు, ఆయుధ సంపత్తి..

జైసల్మేర్‌కు వంద కిలోమీటర్ల దూరంలో పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ వద్ద 'భారత్ శక్తి' విన్యాసాలు జరిగాయి. మొదటిసారి పూర్తిస్థాయిలో స్వదేశీ తయారీ ఆయుధ సంపత్తి, యుద్ధవిమానాలు, క్షిపణులను ప్రయోగించారు. 50 నిమిషాలు జరిగిన ఈ విన్యాసాలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, త్రివిధ దళాధిపతులు, 30 మందికిపైగా విదేశీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు తిలకించారు. టీ-90 (ఐఎం) యుద్ధట్యాంకులు, కే-9 వజ్ర, ధనుష్, సారంగ్ ఆర్టిలరీ గన్ వ్యవస్థలు, ఆకాశ్ ఆయుధ వ్యవస్థ, పినాక శాటిలైట్ సిస్టమ్, లాజిస్టిక్స్ డ్రోన్లు, రోబోటిక్ మూల్స్, ఏఎల్‌హెచ్, మానవ రహిత ఏరియల్ వాహనాలను వినియోగించారు. భారత నౌకాదళం నౌకావిధ్వంసక క్షిపణులు, అటానమస్ కార్గో ఏరియల్ వాహనాలను, గగనతల లక్ష్యాలను ఛేదించే ఆయుధ వ్యవస్థలను.. వైమానిక దళం తేలికపాటి తేజస్ యుద్ధవిమానాలు, లైట్ యుటిలిటీ హెలికాప్టర్లు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లను ప్రదర్శించాయి. భారత యుద్ధసన్నద్ధతను చాటడం.. సమకాలీన, భావి సవాళ్లను స్వదేశీ పరిష్కారాలతో అధిగమించడం... భారత స్వదేశీ రక్షణ సామర్థ్యం, నైపుణ్యాలు, నవీన ఆవిష్కరణలను ప్రపంచానికి చూపడం ఈ విన్యాసాల పరమార్థమని రక్షణ శాఖ తెలిపింది.

వారసత్వాన్ని రక్షించుకోవాలి...

సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోలేని దేశానికి.. భవిష్యత్ కూడా ఉండదని ప్రధాని మోదీ అన్నారు. దేశ వారసత్వం పరిరక్షణకు గత ప్రభుత్వాలకు రాజకీయ సంకల్పం లేకపోయిందని విమర్శించారు. 1930 మార్చి 12న మహాత్మాగాంధీ చేపట్టిన దండియాత్ర వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సబర్మతీలో రూ.1,200 కోట్లతో రూపకల్పన చేసిన గాంధీ ఆశ్రమ్ స్మారకం మాస్టర్‌ప్లాన్‌ను మోదీ ఆవిష్కరించారు. పునరుద్ధరించిన కోచరబ్ ఆశ్రమ్‌ను ప్రారంభించారు. ఇదిలా ఉండగా, పాము కాట్లతో సంభవిస్తున్న మరణాలను 2030కల్లా సగానికి తగ్గించటం కోసం కేంద్రం జాతీయ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. దేశంలో ఏటా పాముకాటుతో 50 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

రైల్వే ట్రాక్‌పైనే నా జీవనం మొదలు

రైల్వే ట్రాక్‌పైనే తన జీవితం మొదలైందని.. అందుచేత గతంలో రైల్వేలు ఎలా ఉండేవో తనకు తెలుసని ప్రధాని మోదీ అన్నారు. మంగళవారం అహ్మదాబాద్ నుంచి దేశవ్యాప్తంగా రూ.85 వేల కోట్ల విలువ చేసే వివిధ రైల్వే ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పది నూతన వందేభారత్ రైళ్లను మోదీ ప్రారంభించారు. గత ప్రభుత్వాల స్వార్థాలకు రైల్వే బలైందన్నారు.

కుప్పకూలిన తేజస్ యుద్ధవిమానం

వైమానిక దళానికి చెందిన తేజస్(ఎల్‌సీఏ) యుద్ధవిమానం రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో కుప్పకూలింది. 2001లో ఈ యుద్ధవిమానాన్ని తయారుచేసిన తర్వాత 23 ఏళ్లకు చోటు చేసుకున్న తొలి ప్రమాదం ఇది. ప్రమాదం నుంచి పైలెట్ సురక్షితంగా బయటపడ్డాడు. 2016లో ఈ తేలికపాటి యుద్ధ విమానాన్ని వైమానిక దళంలో ప్రవేశ పెట్టారు. జైసల్మేర్‌లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఓ విద్యార్థుల హాస్టల్‌పై తేజస్ కుప్పకూలింది. శిక్షణ సమయంలో ఈ ప్రమాదం జరిగిందని, దీనికి కారణం తెలుసుకొనేందుకు విచారణ(కోర్టు ఆఫ్ ఎంక్వయిరీ)కు ఆదేశించినట్లు 'ఎక్స్'లో వైమానిక దళం పేర్కొంది. నేలకూలిన తర్వాత తేజస్ మంటల్లో చిక్కుకుంది. రాజస్థాన్‌లో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధ విన్యాసాల్లో ఈ యుద్ధవిమానం కూడా ఉందా... లేదా అన్న విషయంలో స్పష్టత లేదు.

ఎన్ని'కలల' డీఎస్సీ

(మొదటి పేజీ తరువాయి)

కొంత ముందుగానే నిర్వహిస్తున్న ప్రభుత్వం.. అదే డీఎస్సీని మాత్రం సరిగ్గా ఎన్నికల సమయంలో నిర్వహిస్తోంది. దీంతో ఈ డీఎస్సీ జరిగినట్టేనంటూ నిరుద్యోగులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

కోర్టు ఆదేశాలతో మార్పు

షెడ్యూలు ప్రకారం మార్చి 9 వరకు టెట్ పరీక్షలు జరగాలి. కానీ 6వ తేదీతోనే ముగిశాయి. అలాగే మార్చి 15 నుంచి డీఎస్సీ పరీక్షలు ప్రారంభం కావాలి. ముందుగా ఇచ్చిన షెడ్యూలు ప్రకారం చూస్తే టెట్ పరీక్షల ముగింపునకు, డీఎస్సీ పరీక్షల ప్రారంభానికి మధ్య ఆరు రోజులే వ్యవధి ఉంది. దీనిపై అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కనీసం 4 వారాల గడువు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. అయితే, కనీసం నాలుగు వారాలు అని చెప్పినా అంతకంటే ఎక్కువ ఇచ్చే అవకాశం ఉంది. కానీ.. ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా డీఎస్సీని ప్రకటించిన వైసీపీ ప్రభుత్వం సరిగ్గా పోలింగ్ సమయంలో కొత్త షెడ్యూలు ప్రకటించింది. ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 30 వరకు డీఎస్సీ పరీక్షలు జరుగుతాయని తాజా షెడ్యూలులో తెలిపింది. దాదాపుగా అదే సమయంలో అసెంబ్లీ, లోక్‌సభ పోలింగ్ జరిగే అవకాశం ఉంది. ఏప్రిల్ మాసం మూడో వారం నుంచి నెలాఖరులోగా పోలింగ్ జరిగే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అయినా.. సరిగ్గా అదే టైమ్ లో డీఎస్సీ పెడితే పరీక్షలు ఎలా రాస్తారు? ఆ సమయంలో పరీక్షా కేంద్రాలు చేరుకోవడానికి కూడా అనేక ఆంక్షలుంటాయి. ఇవన్నీ సాధ్యమేనా? అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

మెలికలు పెట్టిందెవరు?

పోనీ, ప్రభుత్వం అంతా సక్రమంగానే చేసిందని, అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లడం వల్లే షెడ్యూలు మార్చాల్సి వచ్చిందని భావిద్దామనుకున్నా అందులో చిత్తశుద్ధి కనిపించడం లేదు. ఎందుకంటే నోటిఫికేషన్‌లోనే పాఠశాల విద్యాశాఖ అనేక మెలికలు పెట్టింది. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను అర్హులుగా ప్రకటించి వివాదం కావడానికి పాఠశాల విద్యాశాఖ పునాది వేసింది. దానిపై అభ్యర్థులు న్యాయస్థానానికి వెళ్తారని తెలిసి కూడా సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా బీఈడీ అభ్యర్థులను ఎస్జీటీ పోస్టులకు అర్హులని పేర్కొంది. దీంతో వెంటనే అభ్యర్థులు కోర్టుకు వెళ్లడంతో నిర్ణయాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. ఇక గతంలో ఎప్పుడూ లేనివిధంగా వారం రోజులు కూడా వ్యవధి లేకుండా వరుసగా టెట్, డీఎస్సీలు నిర్వహిస్తామని ప్రగల్భాలు పలికింది. టెట్ రాశాక కొంత సమయం ఇస్తే అభ్యర్థులు పరీక్షలకు సన్నద్ధమవుతారు. కానీ అవేం తమకు పట్టవన్నట్టుగా ఆరు రోజుల వ్యవధిలో డీఎస్సీ పరీక్షలకు షెడ్యూలు ఇచ్చింది. ఇప్పుడు ఆ షెడ్యూలునూ మార్చుకోక తప్పలేదు.

భర్తీ ఇష్టం లేదు

జగన్ ప్రభుత్వం టీచర్ పోస్టుల భర్తీ విషయంలో తొలినుంచీ ఆసక్తి చూపలేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ మెగా డీఎస్సీ వేస్తానని హామీ ఇచ్చినా అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. అసలు టీచర్ పోస్టుల ఖాళీలే లేవని ప్రభుత్వం ప్రకటించింది. నిరుద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని గుర్తించిన ప్రభుత్వం హడావుడిగా 6,100 పోస్టులతో డీఎస్సీని గత నెలలో ప్రకటించింది. అంటే ఎన్నికలకు 2 నెలల ముందు నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ సమయంలో నోటిఫికేషన్ ఇస్తే పరీక్షల ప్రక్రియ సజావుగా సాగదని ప్రభుత్వానికీ తెలుసు.

30 నుంచి డీఎస్సీ పరీక్షలు

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షల షెడ్యూలును ప్రభుత్వం సవరించింది. కొత్త షెడ్యూలు ప్రకారం ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 30 వరకు డీఎస్సీ పరీక్షలు జరుగుతాయని మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదట ప్రకటించిన షెడ్యూలు ప్రకారం ఈ నెల 15న పరీక్షలు ప్రారంభం కావాలని, కానీ, పలు కారణాలతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. నెల వ్యవధిలో 14 రోజులు పరీక్షలు జరుగుతాయని, ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహిస్తామని వివరించారు. ఈ నెల 20 నుంచి అభ్యర్థులు పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసుకోవచ్చని, 25 నుంచి హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

హరియాణా సీఎంగా నాయబ్ సైనీ

ఖట్టర్ అనూహ్య రాజీనామా



నాయబ్ సైనీతో ప్రమాణం చేయిస్తున్న దత్తాత్రేయ

చండీగఢ్, మార్చి 12: ఉత్తరాది రాష్ట్రం హరియాణలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఒక్క రోజులోనే రాజకీయం మారిపోయింది. మనోహర్‌లాల్ ఖట్టర్ సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో కురుక్షేత్ర నియోజకవర్గం ఎంపీ నాయబ్ సింగ్ సైనీ(54) సీఎంగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సైనీ ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 90 అసెంబ్లీ స్థానాలున్న హరియాణలో 2019 అక్టోబరులో జరిగిన ఎన్నికల్లో బీజేపీ 41 సీట్లు గెలిచింది. సాధారణ మెజారిటీ(46)కి కొద్ది దూరంలో ఆగిపోయింది. దీంతో 10 సీట్లు నెగ్గిన దుష్యంత్ చౌతాలా నాయకత్వంలోని జననాయక్ జనతా పార్టీ (జేజేపీ)తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దుష్యంత్‌కు డిప్యూటీ సీఎంగా, ఆయన పార్టీకి చెందిన ఇద్దరికి మంత్రులుగా అవకాశం ఇచ్చింది. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై రెండు పార్టీల మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వంలో భారీ మార్పులు ఉంటాయంటూ మంగళవారం ఉదయం ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ఖట్టర్ సహా 13 మంది మంత్రులు రాజీనామాలు చేసేశారు. వీటిని గవర్నర్ దత్తాత్రేయ ఆమోదించారు. కొద్దిసేపటికి బీజేపీ శాసనసభాపక్షం సమావేశమై సైనీని తమ నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రాష్ట్రంలోని ఏడుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల్లో ఆరుగురు బీజేపీ సర్కారుకు మద్దతు ప్రకటించారు. దీంతో జేజేపీ మద్దతు లేకుండానే మెజారిటీ చేకూరింది. మంగళవారం సాయంత్రమే సైనీతో గవర్నర్ దత్తాత్రేయ ప్రమాణం చేయించారు. ప్రతిపక్ష కాంగ్రెస్‌కు 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. హరియాణ అసెంబ్లీకి ఈ ఏడాది అక్టోబరులో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఖట్టర్ 2014 నుంచి సీఎంగా కొనసాగారు. ఖట్టర్‌ను కర్నాల్ నుంచి ఎంపీగా బరిలో నిలిపే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఖట్టర్‌కు సన్నిహితుడు

నాయబ్‌సింగ్ సైనీ 1970 జనవరి 25న అంబాలా జిల్లా మిర్జాపూర్ మజ్రా గ్రామంలో జన్మించారు. 30 ఏళ్ల కింద బీజేపీలో చేరారు. ఆర్ఎస్ఎస్‌లో పనిచేసినప్పటి నుంచే ఖట్టర్‌కు సన్నిహితుడయ్యారు. నారాయణగఢ్ నియోజకవర్గం నుంచి 2014లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఖట్టర్ మంత్రివర్గంలోనూ పనిచేశారు. గత అక్టోబరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ నియమితులయ్యారు. హరియాణ జనాభాలో నాయబ్‌సింగ్ సామాజికవర్గమైన సైనీలు 8% ఉంటారు. రాష్ట్రంలో బలమైన జాట్‌లు కాంగ్రెస్, జేజేపీ, ఐఎన్ఎల్‌డీకి మద్దతుగా నిలుస్తుండడంతో.. ఓబీసీలు, ఇతర వర్గాలను ఆకర్షించేందుకు సైనీని బీజేపీ రాష్ట్ర చీఫ్‌గా నియమించింది. ఇప్పుడు ఏకంగా సీఎం బాధ్యతలు అప్పగించింది. కాగా, రాష్ట్రంలో పరిణామాల నేపథ్యంలో జేజేపీ నాయకత్వం తమ పదిమంది ఎమ్మెల్యేలను ఢిల్లీలో మంగళవారం భేటీకి పిలిచింది. ఐదుగురు ఎమ్మెల్యేలు దీనికి డుమ్మాకొట్టారు. ఈ నేపథ్యంలో పార్టీ చీలిపోతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. వీరంతా బీజేపీ వైపు వెళ్లే అవకాశం ఉంది.

అగ్రనేతల వారసులకు కాంగ్రెస్ టికెట్లు

న్యూఢిల్లీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల వారసులను బరిలోకి దించుతోంది. రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్ కుమారుడు వైభవ్ గహ్లోత్‌ను జాలోర్ నుంచి, మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ తనయుడు నకుల్‌నాథ్‌ను ఛింద్వారా స్థానం నుంచి బరిలోకి దింపాలని నిర్ణయించింది. ఇక అసోం మాజీ సీఎం, దివంగత తరుణ్ గొగోయ్ కుమారుడు, ప్రస్తుతం లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేతగా ఉన్న గౌరవ్ గొగోయ్ జోర్హాట్ నుంచి పోటీ చేయనున్నారు. ఈ మేరకు ఐదు రాష్ట్రాల్లోని 43 స్థానాలకు అభ్యర్థులతో కాంగ్రెస్ రెండో జాబితాను మంగళవారం విడుదల చేసింది. ఇందులో అసోం, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌తోపాటు కేంద్రపాలిత స్థానమైన డామన్ డయ్యూలోని స్థానాలున్నాయి. ఈ జాబితాలో తెలంగాణలోని ఏ స్థానానికి అభ్యర్థిని ప్రకటించలేదు. కాగా, మొత్తం 43 మంది అభ్యర్థుల్లో 10 మంది జనరల్, 13 మంది ఓబీసీ వర్గానికి చెందినవారు ఉండగా, ఎస్సీలు 10 మంది, ఎస్టీలు 9 మంది, ఒక ముస్లిం అభ్యర్థి ఉన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సోమవారం సమావేశమై.. ఈ అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ జాబితాను పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం ప్రకటించారు. కాగా, రాజస్థాన్‌లోని చురు ఎంపీ రాహుల్ కస్వాన్ సోమవారం బీజేపీకి రాజీనామా చేసి ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా.. ఆయనకు వెంటనే టికెట్ దక్కింది. ఇక ఇప్పటికే కాంగ్రెస్ తొలి జాబితాలో వివిధ రాష్ట్రాల్లోని 39 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే.



అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో ధర్నా, వైసీపీ మూకల దాడితో గాయపడిన మల్లికార్జునరావు

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకల దాడి

- నరసరావుపేటలో ఐదుగురికి గాయాలు
- రాళ్లు, సీసాలతో రెచ్చిపోయిన వైనం

నరసరావుపేట టౌన్, మార్చి 12: నరసరావుపేటలో వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. టీడీపీ కార్యకర్తలపై రాళ్లు, సీసాలతో మూకుమ్మడిగా దాడి చేశారు. మంగళవారం రాత్రి టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చదలవాడ అరవిందబాబు, కార్యకర్తలు ఐదో వార్డులో పర్యటిస్తున్నారు. ఈ సమయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా రెచ్చిపోయారు. రాళ్లు.. సీసాలతో దాడులకు తెగబడ్డారు. దాడిలో మల్లికార్జునరావు, మహేష్, కోటి, సైదులుతోపాటు మరో కార్యకర్తకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ దాడిని అరవిందబాబు తీవ్రంగా ఖండించారు. దాడికి నిరసనగా రాత్రి అంబేద్కర్ విగ్రహం సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేసి, అక్కడ ధర్నా చేపట్టారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటమి భయంతోనే వైసీపీ దాడులకు పాల్పడుతోందని మండిపడ్డారు.

దిగొచ్చిన ఎస్‌బీఐ

(మొదటి పేజీ తరువాయి)

తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించాల్సి ఉంది. కాగా, ఎన్నికల బాండ్ల వివరాలను ఈసీకి సమర్పించాలంటూ ఫిబ్రవరి 15న తాము ఇచ్చిన తీర్పు అమలుపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ చైర్మన్, ఎండీలను సుప్రీంకోర్టు సోమవారం విచారణ సందర్భంగా ఆదేశించిన సంగతి తెలిసిందే. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వారి అఫిడవిట్లు సిద్ధమయ్యాయిగానీ, ఇంకా కోర్టుకు సమర్పించలేదు. మరోవైపు.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై 'ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్' కోరాలంటూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ చీఫ్ ఆదీష్ సి అగర్వాలా... రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంగళవారం ఒక లేఖ రాశారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ అంశంపై మరోసారి విచారణ జరిపేదాకా తీర్పు అమల్లోకి రాకుండా చూడాలని అందులో కోరారు. వివిధ రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చిన కార్పొరేట్ల పేర్లను బయటపెట్టడం వల్ల ఆయా సంస్థలు ఇబ్బందిపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు తక్కువ విరాళాలిచ్చిన కంపెనీలను పార్టీలు చిన్నచూపు చూసి, హింసించే ప్రమాదం ఉందని.. తద్వారా విరాళాల రాక తగ్గిపోయే ముప్పుందని అంచనా వేశారు. సుప్రీం తీర్పు గతకాలానికి కూడా వర్తింపజేస్తూ సున్నితమైన సమాచారాన్ని విడుదల చేస్తే.. అంతర్జాతీయ సమాజంలో అది మన దేశ పరువును దెబ్బతీస్తుందన్నారు.

ఎన్నికల్లో ఫేక్ న్యూస్‌కు గూగుల్ బ్రేక్..!

న్యూఢిల్లీ, మార్చి 12: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు గూగుల్ తనవంతు సాంకేతిక సాయం అందించనుంది. ఎన్నికల సమయంలో తప్పుడు సమాచారం (ఫేక్ న్యూస్) వ్యాప్తి చెందకుండా నివారించడానికి, అధీకృత కంటెంట్‌ను ప్రోత్సహించడానికి, కృత్రిమ మేధ(ఏఐ) అందించే డేటాను ప్రజలకు చేరువచేయడానికి భారత ఎన్నికల కమిషన్‌తో గూగుల్ చేతులు కలిపింది. ఎన్నికలకు సంబంధించి వివిధ అంశాలపై అధికారిక సమాచారాన్ని అందించేలా తమ ఫీచర్లను రూపొందించినట్టు గూగుల్ ఇండియా మంగళవారం ప్రకటించింది. సోషల్ మీడియాలో కంటెంట్ క్రియేటర్లు ఎక్కువగా కృత్రిమ మేధను వినియోగిస్తున్నందున.. ఆ కంటెంట్‌లోని వాస్తవికతను గుర్తించడంలో ప్రజలకు సహాయపడేలా తాము కొన్ని చర్యలు చేపట్టినట్టు తెలిపింది. డీప్ ఫేక్, తప్పుదోవ పట్టించే కంటెంట్‌ల నుంచి తాము ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించింది. త్వరలోనే యూట్యూబ్ కూడా కంటెంట్ క్రియేటర్లు తమ వాస్తవిక కంటెంట్‌ను ఎప్పుడు సృష్టించారో వెల్లడిస్తుందని తెలిపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్ కలెక్టర్ పరిశీలన

గన్నవరం: వచ్చే ఎన్నికల్లో ఈవీఎంల భద్రత ఎంతో ముఖ్యమని అందుకు తగిన సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. స్థానిక బాలుర హైస్కూల్‌లోని డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని మంగళవారం జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే జిల్లా గోడౌన్ నుంచి మొదటి స్థాయి ర్యాండమైజేషన్ ద్వారా ఈవీఎంలు వివిధ నియోజకవర్గాలకు పంపుతామన్నారు. వాటిని స్ట్రాంగ్ రూము ల్లో భద్రపరిచేందుకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించినట్టు తెలిపారు. పోలింగ్‌కు ముందు సెకండ్ లెవెల్ రాండమైజేషన్ నిర్వహించి పోలింగ్ కేంద్రాలకు పంపుతామని, పోలింగ్ పూర్తయ్యాక మళ్లీ స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి కౌంటింగ్ సమయంలో మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తామన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నమీమ్ అస్మి మాట్లాడుతూ ఈవీఎంల భద్రతకు స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జేసీ గీతాంజలి శర్మను నియమించినట్టు తెలిపారు. తహసీల్దార్ పవన్‌కుమార్, ఎంపీడీవో సత్యకుమార్ పాల్గొన్నారు.

రూ.2 లక్షల చొప్పున ఇద్దరికి ఆర్థిక సాయం

● కలెక్టర్ చేతులమీదుగా చెక్కుల పంపిణీ

కృష్ణలంక: సీఎం ఆదేశాల మేరకు లబ్ధిదారుల అవసరాలను తీర్చేందుకు మంగళవారం సాయంత్రం కలెక్టర్ ఢిల్లీరావు క్యాంపు కార్యాలయంలో ఇద్దరికి రూ.2 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో పలువురు తమ సమస్యలు చెప్పుకొన్నారని, ఆయన తక్షణమే స్పందించి ఆర్థిక భరోసా కల్పించాలని కోరుతూ ఆదేశాలిచ్చారన్నారు. ఇందులో భాగంగా ఇద్దరికీ రూ.2లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేసినట్టు తెలిపారు.

దుర్గగుడికి సరుకుల సరఫరా టెండర్లలో ఇద్దరు కాంట్రాక్టర్లు

వన్‌టౌన్: దుర్గగుడిలో లడ్డూ, పులిహోర, ప్రసాదాలు, అన్నదానానికి అవసరమైన సరుకులు సరఫరాకు అధికారులు మంగళవారం నిర్వహించిన టెండర్లలో ఇద్దరు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో కోసూరుకు చెందిన సాయిమణికంఠ ఏజెన్సీ, విశాఖపట్నానికి చెందిన సూర్యకుమారి ఏజెన్సీ ధరలను కోట్ చేశారు. ఈవో కేఎస్ రామారావు ఒకటి, రెండ్రోజుల్లో రివర్స్ టెండరింగ్ నిర్వహించనున్నారు. తరువాత రీజనల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ), సివిల్ సప్లయ్ అధికారి, దుర్గగుడి కమిటీలో ఇద్దరు మెంబర్లు, ఈవో కమిటీగా ఏర్పడి డిజిటల్ కీతో ఇద్దరు కాంట్రాక్టర్లు ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో కోడ్ చేసిన ధరలను పరిశీలించనున్నారు. మార్కెట్ ధరలు, ఇతర ఆలయాల్లోని ధరలు, ప్రస్తుతం దుర్గగుడిలో ఉన్న ధరలతో ఒక నివేదిక తయారు చేసి కమిటీకి ఇవ్వనున్నారు. కమిటీ నిబంధనల ప్రకారం కమిషనర్‌కు తెలియపరచనున్నారు. ప్రొసీజర్ ప్రకారం ఆమోదించే అవకాశం ఉంది.

డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక: విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్టు ఆ శాఖ సంచాలకులు బి.రవిప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టు బీసీ (ఏ) కేటగిరీకి రిజర్వ్ చేయడం జరిగిందని, అభ్యర్థులు 42ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణత, కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంగ్లీషులో ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. అర్హత కలిగినవారు తమ బయోడేటా, విద్యార్హతలు, ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసిన అనుభవ పత్రాలు జతపరిచి ఈ నెల 20లోగా దరఖాస్తులను సంచాలకుల వారి కార్యాలయం, విభిన్నప్రతిభావంతుల హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, డోర్ నెం.74-14-2, రాజన రేంద్ర బిల్డింగ్ మొదటి అంతస్తు, యనమలకుదురు రోడ్డు, కృష్ణనగర్, విజయవాడ-520007 చిరునామాకు మార్చి 20లోగా సమర్పించాలని కోరారు.

ప్రైవేట్ విద్యాసంస్థలో పేద విద్యార్థులకు 25శాతం ప్రవేశాలివ్వాలి

వన్‌టౌన్: విద్యాహక్కుచట్టం సెక్షన్ (1) (సీ) అనుసరించి ఈ ఏడాది 25 శాతం పేద విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టం కింద పేద విద్యార్థులు కార్పొరేట్ స్కూల్‌లో చదువుకునే అవకాశం ఉందన్నారు. ముందుగానే ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఒకటో తరగతిలో ప్రవేశాలకు విడుదలైన షెడ్యూలు మేరకు ఫిబ్రవరి 23నుంచి ఈనెల 30వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చనన్నారు ఇప్పటివరకు 763 మంది దరఖాస్తు చేసుకోగా, 558 మంది తమ సమీప పాఠశాలలకు ఆన్‌లైన్‌లో ఆప్షన్‌లు ఇచ్చారన్నారు.


చాంపియన్ షిప్‌కు ఎంపికైన విద్యార్థినులు

బాల్ బ్యాడ్మింటన్ ఫర్ ఇండియాకు సిద్ధార్థ కాలేజీ విద్యార్థినుల ఎంపిక

ప్రభుత్వాసుపత్రి, మార్చి 12: ఈనెల 21 నుంచి 25 వరకు తమిళనాడులోని దిండిగల్‌లో జరగనున్న బాల్ బ్యాడ్మింటన్ ఫర్ ఇండియా ఉమెన్ చాంపియన్ షిప్‌కు సిద్ధార్థ మెడికల్ కాలేజీ విద్యార్థినులు ఎంపికయ్యారు. నగరంలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో మంగళవారం జరిగిన సెలక్షన్లలో ఎంపికైన క్రీడాకారులను వైస్ చాన్స్‌లర్ కె.బాబ్జి, ప్రిన్సిపల్ కె.సుధాకర్, ఫిజికల్ డైరెక్టర్ జె.రాములు అభినందించారు.

పశ్చిమ టీడీపీలో ప్రక్షాళన!

● 16 డివిజన్లకు నూతన అధ్యక్షుల నియామకం ● కేశినేని నాని నియమించిన కమిటీల తొలగింపు

విజయవాడ - ఆంధ్రజ్యోతి: పశ్చిమ నియోజకవర్గ టీడీపీలో ప్రక్షాళన జరిగింది. ఎంపీ కేశినేని నాని గతంలో టీడీపీలో ఉన్న సమయంలో నియమించిన డివిజన్ కమిటీలను తొలగించి వాటికి కొత్త అధ్యక్షులను నియమించారు. మొత్తం 22 డివిజన్లలో 16 డివిజన్లకు కొత్త అధ్యక్షులను నియమించారు. నాని నియమించిన కమిటీల్లో ఎక్కువ మంది ఆయన కోవర్టులుగా టీడీపీలో పనిచేస్తున్నారన్న ఆరోపణలు రావడంతో చాలాకాలంగా ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో వీటి ప్రక్షాళనకు టీడీపీ అధిష్ఠానం నడుం బిగించింది. పార్టీ పెద్దల ఆదేశాలతో మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం కొత్త కమిటీ అధ్యక్షులను నియమించారు. పశ్చిమలోని కీలక నేతలుగా ఉన్న బుద్ధా వెంకన్న, నాగుల్ మీరా వంటి వారిని టార్గెట్ చేయాలన్న ఉద్దేశంతో టీడీపీలో ఉన్న సమయంలో కేశినేని నాని పశ్చిమ సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్నారు. ఆ హోదాలో 22 డివిజన్లలో పలు డివిజన్‌లకు కమిటీలను నియమించారు.

కొత్తగా నియమితులైన ఇన్‌చార్జులు వీరే..

టీడీపీ అధిష్ఠానం ఆదేశాలతో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ 16 డివిజన్లకు అధ్యక్షులను నియమించారు. 34వ డివిజన్ అడ్డూరి కొండ, 35వ డివిజన్ బూదాల నందకుమారి, 38వ డివిజన్ పితాని పద్మ, 39వ డివిజన్ రేగళ్ల లక్ష్మణరావు, 41వ డివిజన్ పత్తి నాగేశ్వరరావు, 42వ డివిజన్ ముదిరాజు శివాజీ, 43వ డివిజన్ మోరబోయిన రాంబాబు, 45వ డివిజన్ పేరం సత్యనారాయణ, 46వ డివిజన్‌కు ధీటి ప్రభుదాస్, 47వ డివిజన్ నాగోతి రామారావు, 48వ డివిజన్ పేరాబత్తుల రమణ, 49వ డివిజన్ బడుగు వెంకన్న, 51వ డివిజన్ కుంచం దుర్గారావు, 52వ డివిజన్ ఈగల సాంబ, 55వ డివిజన్ మహమ్మద్ జహీద్, 56వ డివిజన్ మురుగుర్తి ఈశ్వర్‌ను అధ్యక్షులుగా నియవిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. వీరు తమ సమయాన్ని పూర్తి స్థాయిలో పార్టీ కోసం వినియోగించి రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని రఘురాం కోరారు. గతంలో డివిజన్ ఇన్‌చార్జులుగా ఉన్న 13 మందిని జిల్లాస్థాయిలో వివిధ అనుబంధ సంఘాల్లో నియమించారు.

అక్రమంగా అపార్టుమెంట్‌కు తాగునీరు

● పైప్‌లైన్ ఏర్పాటుపై జేసీకి ఫిర్యాదు ● నిలిపేయకుంటే ఆందోళన.. టీడీపీ, సీపీఎం

గన్నవరం, మార్చి 12: పట్టణ ప్రజలకు నీళ్లిచ్చే పరిస్థితిలో లేని పంచాయతీ అధికారులు శివారులో నిర్మించిన ప్రైవేటు అపార్టుమెంట్‌కు నీళ్లు ఎలా ఇస్తారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ ప్రశ్నించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో దొంతు చిన్న, శ్రీధర్ మాట్లాడారు. ఎలాంటి అనుమతులు లేకుండా చంద్రిక అయోధ్య అపార్టుమెంట్‌కు మంచి నీటి పైప్‌లైన్ వేస్తున్నారని దాని వెనుక రూ.కోటి చేతులు మారినట్టు ఆరోపణలు వస్తున్నాయన్నారు. పంచాయతీ పరిధిలో 25వేల మంది పైగా జనాభా ఉన్నారని, రూ.5కోట్ల వరకూ ఆదాయం వస్తుందన్నారు. వేసవిలో ప్రజలకు తాగునీరందటం లేదన్నారు. స్థానిక కోనాయి చెరువు పైలెట్ ప్రాజెక్టు నుంచి అపార్టుమెంట్ వరకూ ఆర్‌అండ్‌బీ రోడ్డును పగులకొట్టి మరీ పైప్‌లైన్ వేస్తున్నారన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ పాలకవర్గ అనుమతి లేకుండానే ఎన్నికల కోడ్ వస్తుందని హడావిడిగా పనులకు సిద్ధపడుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. పైలెట్ ప్రాజెక్టు స్కీమ్‌లో ఇప్పటికే నీరు లేకుండా పోయిందని, వచ్చే వేసవిలో ప్రజలకు నీరందించటం ప్రశ్నార్థకమేనన్నారు. ఈ అపార్టుమెంట్‌కు మంచినీళ్ల ప్రస్తుతం ఇవ్వకూడదని పంచాయతీ పాలకవర్గం గతంలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కూడా అనుమతులివ్వలేదన్నారు. ఈమేరకు జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతిపత్రాన్ని అందజేశారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, మాజీ ఎంపీపీ తుల్లివల్లి ఝాన్సీ, జనసేన జిల్లా జాయింట్ సెక్రటరీ చిమటా రవివర్మ, బడుగు ఝాన్సీ దేవినేని సులోచన, మహ్మద్ రఫీ, చిమట శ్రీనివాసరావు, జాస్తి తాతారావు, బుస్సే నాగ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ ఆలోచనను విరమించుకోకపోతే ఆందోళన చేపడతామని సీపీఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు ఒక ప్రకటనలో హెచ్చరించారు.


జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతి పత్రాన్ని అందజేసి సమస్యను వివరిస్తున్న టీడీపీ నేతలు

విరాళాల సద్వినియోగానికే కొత్త ఆఫీస్

● నగరాల నిత్యాన్నదాన వసతి సత్రం కమిటీ

చిట్టినగర్, మార్చి 12: తమ కమిటీకి ప్రధాన కార్యదర్శిగా ఉన్న కొరగంజి జగన్నాథరావు నియంతృత్వ పోకడలు పెరిగిపోవడం, కమిటీకి వచ్చిన విరాళాలు సద్వినియోగం చేయాలన్న ఉద్దేశంతోనే కొత్త కార్యాలయం ప్రారంభించామని శ్రీశైల క్షేత్ర భ్రమరాంబిక మల్లికార్జున స్వామి నగరాల కులస్థుల నిత్యాన్నదాన వసతిసత్రం అధ్యక్షుడు నల్లాన సూర్యారావు వెల్లడించారు. చిట్టినగర్‌లోని సాయిరామ్ థియేటర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. జగన్ నియంతృత్వ పోకడలతో సభ్యులు విసిగిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకోసం 18 మంది వ్యవస్థాపక సభ్యుల్లో 14 మంది కలిపి ప్రత్యేకంగా ఒక కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. సత్రం కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లలనే ఇలా చేశామన్నారు. ఎమ్మెల్యే, మేయర్, బాయన వెంకటరావు, పోతిన వెంకటేశ్వరస్వామి సమక్షంలో నగరాల సీతారామస్వామి, మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానంలో ఒక గదిని ఇవ్వాలని జగన్‌ను అడిగామన్నారు. ఆయన 3 సార్లు తిప్పించుకుని గది ఇవ్వడం కుదరదన్నారన్నారు. ఈ పరిస్థితుల్లో సాయిరామ్ థియేటర్ వద్ద జేపీ హోం రెండో అంతస్తులో పాలనా కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. ఈనెల 8న మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణకు దాతల నుంచి సేకరించిన విరాళాలతో శ్రీశైలం వెళ్లామని, సత్రం నిర్మాణం పూర్తికాకపోవడంతో పక్కనే ఉన్న సత్రంలో బస చేసి అన్నదానానికి ఏర్పాటు చేశామన్నారు. దాతలిచ్చిన వస్తువులు ఇవ్వమని కేర్ కేటర్‌ను అడగ్గా జగన్ ఇవ్వొద్దన్నారని చెప్పాడన్నారు. తాము సభ్యులమేనని చెప్పి పాత్రలు తీసుకుని అన్నప్రసాద వితరణ పూర్తయ్యాక ఆ పాత్రలను అప్పగించామన్నారు. సంఘ నేతలు తమ్మిన హేమంత్, ముదిలి మోహనరావు, పిళ్లా విజయ్‌కుమార్, జగుపిళ్ల దుర్గామహేష్, ఈది బాబూరావు, గరె సోమవెంకట ప్రసాద్, దుక్కా కృష్ణ, పణుకు రమేష్‌బాబు పాల్గొన్నారు.

కోరంలేక కమిటీ సమావేశం వాయిదా

వన్‌టౌన్, మార్చి 12: శ్రీశైల క్షేత్ర నగరాల కులస్థుల నిత్యాన్నదాన వసతి సత్రం శాశ్వత సభ్యుల కమిటీ సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఇటీవలే విడిపోయిన 13మంది సభ్యుల్లో ఏ ఒక్కరూ హాజరు కాలేదు. 18 మంది సభ్యుల్లో 13 మంది ఒక వర్గంగా, మరో ఐదుగురు ఇంకో వర్గంగా చీలింది. ఈ నేపథ్యంలో తాజా పరిణామాలపై చర్చించేందుకు మంగళవారం సాయంత్రం కమిటీ కేంద్ర కార్యాలయంలో అధ్యక్షుడు నల్లాన సూర్యారావు సూచనలతో ఫౌండర్, ప్రధాన కార్యదర్శి కొరగంజి జగన్నాథరావు (జగన్) నిర్వహణలో శాశ్వత సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. కేవలం ఐదుగురు మాత్రమే పాల్గొనడంతో కోరం లేక వాయిదా పడింది. ఏవైనా తీర్మానాలు చేయాలంటే నిబంధనల ప్రకారం కనీస సభ్యుల సంఖ్య ఉండాలి. ఈ సమావేశంలో సభ్యుల సహకారం, అధ్యక్షుడి అనుమతితో 9 అంశాలను ఏజెండాగా పెట్టుకున్నారు. అయితే సభ్యులెవరూ సమావేశానికి హాజరుకాకపోవడంతో కమిటీ సమావేశం మరుసటి తేదీ వరకు వాయిదా పడింది. ఈ సమావేశంలో ఫౌండర్ సెక్రటరీ కొరగంజి జగన్, సభ్యులు డాక్టర్ మరుపిళ్ల హనుమంతరావు, ఇల్లిపిల్లి రంగనాయకమ్మ, భోగవల్లి రామకృష్ణ పాల్గొన్నారు. కాగా నల్లాన సూర్యారావు వ్యతిరేక వర్గ నేతగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ నెల 6న నోటిమాటగా ఫోన్‌లో సమావేశం జరపమని చెప్పిన మీదట మంగళవారం సమావేశం నిర్వహించారు. కానీ నల్లాన సూర్యారావు వర్గం సమావేశానికి హాజరు కాలేదు.



సీఏఏ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా లెనిన్ సెంటర్‌లో సీపీఐ, సీపీఎం నేతల నిరసన ప్రదర్శన

ప్రజల్లో చిచ్చురగిల్చేందుకే సీఏఏ

● సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

గవర్నర్‌పేట, మార్చి 12: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సీఏఏ నోటిఫికేషన్లు జారీచేసి ప్రజల మధ్య చిచ్చు రగిల్చే ప్రయత్నం బీజేపీ చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. సీఏఏకు వ్యతిరేకంగా సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం లెనిన్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన జరిగింది. కమ్యూనిస్టు పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొని సీఏఏకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సీఏఏ నోటిఫికేషన్లు జారీ రాజ్యాంగ విరుద్ధమని, ప్రజల మధ్య మతాల పేరుతో చిచ్చుపెట్టి, విద్వేషాలు రెచ్చగొట్టి బీజేపీ పబ్బం గడుపుకునేందుకు చూడటం దుర్మార్గమన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ నచ్చినవారికి పౌరసత్వం ఇవ్వడం, నచ్చని వారికి ఇవ్వకపోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీతో జత కట్టడాన్ని తప్పుపట్టారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఎం నేత దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షత వహించగా ఏఐటీయూసీ నేత జి. ఓబులేసు, సంఘాల, పార్టీల నేతలు కేవీ భాస్కరరావు, ఎన్ వీరభద్రరావు, పి. దుర్గాంబ, బి. సత్తిబాబు, భూపలి రమణారావు, కె. దుర్గారావు, కె. సరోజ, వై. సుబ్బారావు, బాలబొమ్మ లక్ష్మణ, సూరిబాబు పాల్గొన్నారు.

గుడివాడ రైల్వే స్టేషన్లో ఒకే స్టేషన్-ఒకే ఉత్పత్తి షాపు

గుడివాడ : చేతివృత్తుల వారిని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రధాన మోదీ విశ్వకర్మ యోజన పథకం కింద ప్రతి రైల్వేస్టేషన్‌లో చేతి వృత్తుల తయారీ వస్తువుల అమ్మకానికి దుకాణాలను ప్రారంభిస్తున్నారని బీజేపీ నేత దావులూరి సురేంద్ర అన్నారు. రైల్వేస్టేషన్‌లో ఒకే స్టేషన్-ఒకే ఉత్పత్తి కార్యక్రమంలో భాగంగా రైల్వే అధికారులతో కలిసి దుకాణాన్ని ప్రారంభించారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఎర్రపోతు అర్జున్, గుడివాడ రైల్వేస్టేషన్ మాస్టర్ డి.రమేష్‌బాబు, సీసీఐ భగవాన్ నాయక్, కొత్త కిరణ్, రాంప్రసాద్, వెంకటరమణ పాల్గొన్నారు.



నారాయణం విజయలక్ష్మీకి మొల్ల పురస్కారం

గుడివాడ/గుడ్లవల్లేరు : తెలుగు భాషా వికాస సమితి సమన్వయకర్త డిఆర్‌బి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి నారాయణం విజయలక్ష్మీకి కవయిత్రి మొల్ల పురస్కారాన్ని మంగళవారం ప్రదానం చేశారు. గుడివాడలోని షాగులాబ్ చంద్ గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి టూటౌన్ సీఐ దుర్గారావు పాల్గొన్నారు. మొల్ల రచించిన రామాయణం ఎంతో ప్రసిద్ధి గాంచిం దన్నారు. తాడిపర్తి సునీత, నారాయణం శ్రీనివాసమూర్తి, జె.వి.కుమారి, గ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు టీడీపీ నేతల యత్నం

● అడ్డుకున్న పోలీసులు


ముఖ్యమంత్రి వద్దకు వెళ్లకుండా టీడీపీ నేతలను అడ్డుకున్న పోలీసులు.

రాణిగారితోట, మార్చి 12: కృష్ణానది రిటైనింగ్‌వాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కలిసి టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం ఇస్తామన్న టీడీపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. కనకదుర్గ వారధి వద్ద రిటైనింగ్ వాల్‌తో పాటు రాణిగారితోట వద్ద రిటైనింగ్ వాల్ పక్కన ఏర్పాటు చేసిన పార్క్‌ను ప్రారంభించడానికి సీఎం జగన్‌మోహనరెడ్డి మంగళవారం ఉదయం వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ 18వ డివిజన్ అధ్యక్షుడు వేములు దుర్గారావు ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నేతలు సీఎంను కలిసి టిడ్కో ఇళ్లు ఇంకా అనేక మంది లబ్ధిదారులకు ఇవ్వలేదని వెంటనే మంజూరు చేయాలని వినతిపత్రం ఇచ్చేందుకు సిద్ధమవగా విషయం తెలుసుకున్న పోలీసులు డివిజన్‌లోని పార్టీ కార్యాలయం వద్దకు వచ్చి అడ్డుకున్నారు. సీఎం వెళ్లేవరకు టీడీపీ నేతలు ఎటూ వెళ్లకుండా అక్కడి ఉన్నారు. ఈ సందర్భంగా వేములు దుర్గారావు మాట్లాడుతూ సీఎంను కలిసి వినతి పత్రం ఇచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామ్యకమని, ప్రజాస్వామ్యంలో సీఎంకు సమస్యలు తెలిపే హక్కుంటుందని, ఈ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం లేదన్నారు. ఏళ్ల తరబడి టిక్కో ఇళ్ల లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని ప్రభుత్వం వెంటనే వాటిని అందించాలని డిమాండ్ చేశారు. పీరుబాబు, కాశి విశ్వేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

గోపాలపురం టీడీపీ అభ్యర్థి మార్పు

▸▸ మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వైపు మొగ్గు.. వెంకటగిరిలో కురుగొండ కోడలికి

▸▸ దర్శి బరిలో మాజీ మంత్రి శిద్దా?.. అనంత, పుట్టపర్తిపైనా కసరత్తు

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పలు కీలక స్థానాల్లో అభ్యర్థుల ఖరారుపై టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టి సారించారు. సర్వేలు, పార్టీ నేతలు, శ్రేణుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని.. ఆశావహులకు నచ్చజెప్పి మరీ నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజాగా రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం పరిధిలోని గోపాలపురం (ఎస్సీ) నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిని మార్చనున్నారు. ఇప్పటివరకూ ఈ నియోజకవర్గానికి పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న మద్దిపాటి వెంకటరాజు అభ్యర్థిత్వంపై పార్టీ శ్రేణుల్లో భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. దీంతో అధినాయకత్వం ఇటీవల సర్వేలు చేయించింది. మంగళవారం ఆ నియోజకవర్గ నేతలను చంద్రబాబు ఇక్కడి ఉండవల్లి నివాసానికి పిలిపించి మాట్లాడారు. వెంకటరాజుకు అవకాశం ఇవ్వలేకపోతున్నామని ఆయన సూచనప్రాయంగా చెప్పినట్లు సమాచారం. 'ఆయనకో అవకాశం ఇచ్చాం. కానీ ఆయన అందరినీ కలుపుకొని వెళ్లలేకపోయారు. అందువల్ల అక్కడ మార్పు చేయాలని నిర్ణయించాం' అని ఆయన వారితో చెప్పారు. అక్కడ మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అయితే అక్కడ విజయావకాశాలు బాగుంటాయని టీడీపీ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. ఆ నియోజకవర్గంలో వైసీపీ తరఫున హోం మంత్రి తానేటి వనిత పోటీ చేస్తున్నారు. ఈ సమావేశానికి వెంకటరాజు, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, మండల పార్టీ అధ్యక్షులను పిలిపించారు. ఇదే లోక్‌సభ స్థానం పరిధిలోని కొవ్వూరు నియోజకవర్గ నేతలతో కూడా చంద్రబాబు మంతనాలు జరిపారు. గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడిని తమ వద్ద పోటీ చేయించాలని వారు కోరారు. వీలుకాని పక్షంలో కొత్త అభ్యర్థికి ఎవరికి అవకాశం ఇచ్చినా గెలిపించుకొని తీసుకొస్తామని చెప్పారు. రెండు, మూడు పేర్లపై టీడీపీ అధిష్ఠానం ఇక్కడ పరిశీలన జరుపుతోంది. మాజీ మంత్రి జవహర్ ఇక్కడ రేసు నుంచి వైదొలగినట్లే కనిపిస్తోంది. తాజాగా పరిశీలిస్తున్న ముగ్గురి పేర్లలో ఆయన కుమారుడి పేరు కూడా ఉంది. ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం జరిగే అవకాశం ఉంది. కాగా.. నెల్లూరు జిల్లా వెంకటగిరి స్థానంలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె సాయి లక్ష్మీప్రియకు అవకాశమివ్వాలని చంద్రబాబు నిర్ణయించినట్లు చెబుతున్నారు. కురుగొండ్ల వియ్యంకుడు గంగాప్రసాద్‌ను ఆయన మంగళవారం ఉండవల్లి పిలిపించి మాట్లాడారు. తర్వాత సాయి లక్ష్మీప్రియ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. అన్నమయ్య జిల్లా రాజంపేట నేత బత్యాల చెంగల్రాయులు చంద్రబాబుతో సమావేశమై టికెట్‌పై చర్చించారు. ప్రకాశం జిల్లా దర్శి స్థానానికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావుతో పాటు ఆయన కోడలి పేరు కూడా పరిశీలనలో ఉంది. అనంతపురం అర్బన్ టికెట్‌పై కసరత్తు కొనసాగుతోంది.

2 పార్లమెంటు, 15 అసెంబ్లీ స్థానాల్లో పోటీ

▸▸ సీట్ల సర్దుబాటుపై చర్చలు సాగుతున్నాయి: రామకృష్ణ

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో రెండు పార్లమెంటు, 15 అసెంబ్లీ స్థానాల నుంచి మా పార్టీ అభ్యర్థులను పోటీలో నిలపాలనుకుంటున్నాం' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ వెల్లడించారు. 'విశాఖపట్నం, విజయనగరం, గుంటూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో మా పార్టీకి బలమైన కేడర్ ఉంది. ఈ ఐదు పార్లమెంటు స్థానాల్లో 2 చోట్ల నుంచి సీపీఐ పోటీ చేస్తుంది. మా పార్టీకి బలమున్న 15 అసెంబ్లీ స్థానాల్లోనూ అభ్యర్థులను నిలపాలనుకుంటున్నాం. ఈ సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో వామపక్షాల పొత్తు నేపథ్యంలో సీట్ల సర్దుబాటుపై చర్చలు కొనసాగుతున్నాయి. ఏ పార్టీ, ఏ స్థానాల్లో పోటీ చేస్తుందనేది ఈనెల 15లోపు స్పష్టత వస్తుంది' అని రామకృష్ణ తెలిపారు.

జగన్ ఓ మానవ మృగం: నారాయణ

'సీఎం జగన్‌రెడ్డి ఎక్కడకు వెళ్తుంటే అక్కడ రక్షణ చర్యల సాకుతో పచ్చని చెట్లు నరికేస్తున్నారు. జగన్ మానవ మృగమని చెప్పడానికి ఇదే నిదర్శనం' అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మండిపడ్డారు. "నిజాం పాలనలో కూడా ఇంత దుర్మార్గం చూడలేదు. రాష్ట్రంలో టీడీపీ ఒంటరిగా పోటీ చేస్తేనే గెలిచే అవకాశాలున్నాయి. అయితే ఆ పార్టీని నాశనం చేయడానికే బీజేపీ బలవంతంగా పొత్తు పెట్టింది. 'మా పార్టీతో పొత్తు పెట్టుకుంటారా? జైలుకు వెళతారా?' అంటూ చంద్రబాబును బీజేపీ పెద్దలు భయపెట్టారు' అన్నారు.

అనుమతులు లేకున్నా.. ప్రారంభోత్సవాలా?

▸▸ ఓటమి భయంతోనే కార్యక్రమాలు: బీటెక్ రవి

పులివెందుల టౌన్, మార్చి 12: కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే మెడికల్ కళాశాల ప్రారంభించామంటూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి మంగళవారం అన్నారు. ముఖ్యమంత్రి పులివెందులలో ప్రారంభించిన అన్ని నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయని, ఓడిపోతామన్న భయంతో అసంపూర్తి నిర్మాణాలనే సీఎం ప్రారంభించారని తెలిపారు. కాగా, మిత్రుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నామని రవి చెప్పారు.

మేం మహీధరరెడ్డి వెంటే!

▸▸ వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతల తీర్మానం

కందుకూరు/వలేటివారిపాలెం, మార్చి 12: కందుకూరు ఎమ్మెల్యే మనుగుంట మహీధరరెడ్డి మాటే తమబాట అని, అవసరమైతే వైసీపీకి మూకుమ్మడిగా రాజీనామాలు చేసేందుకు సిద్ధంగా ఉందామని ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్థాయిలోని ముఖ్యనేతలు ఏకగ్రీవంగా తీర్మానాలు చేస్తున్నారు. మహీధరరెడ్డి నిర్ణయం తేలేవరకు వైసీపీ కార్యక్రమాలకు హాజరు కాకూడదని మూడురోజుల క్రితం కందుకూరు మండల నాయకులు తీర్మానించగా మంగళవారం గుడ్లూరు, వలేటివారిపాలెం మండలాల్లోని ప్రజా ప్రతినిధులు, నాయకులు సమావేశమై మహీధరరెడ్డి నిర్ణయం మేరకే వచ్చే ఎన్నికల్లో పనిచేయాలని, అవసరమైతే వైసీపీకి మూకుమ్మడిగా రాజీనామాలు చేసేందుకు సిద్ధమని తీర్మానం చేశారు. ఉలవపాడు, లింగసముద్రం, కందుకూరు మున్సిపాలిటీలోనూ ఇదే తరహా సమావేశాలకు మహీధరరెడ్డి అనుచరులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. గుడ్లూరు మండలం సమావేశానికి ఎంపీపీ పులి రమేశ్‌తో పాటు ఏఎంసీ మాజీ చైర్మన్ చెరుకూరి సూర్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు హాజరయ్యారు.

జగన్ వచ్చారంటే 'జామ్'!

▸▸ విజయవాడ-గుంటూరు మధ్య స్తంభించిన ట్రాఫిక్


విజయవాడ రామలింగేశ్వరనగర్ స్క్రూబ్రిడ్జి వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

అమరావతి, విజయవాడ, మార్చి 12((ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన ఉందంటే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. ఆయన ఎటు నుంచి ఎటు అడుగులు వేసినా.. ఆ మార్గాల్లో వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విజయవాడలో కృష్ణలంకలో కృష్ణా నది ఒడ్డున నిర్మించిన రిటైనింగ్‌వాల్, దాన్ని ఆనుకుని అభివృద్ధి చేసిన పార్కు(కృష్ణమ్మ జలవిహారం)ను జగన్ మంగళవారం ప్రారంభించారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఆయన బయలుదేరడానికి ముందు నుంచే వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. కృష్ణా నదిపై ఉన్న రెండు వంతెనల మీద నుంచీ వాహనాలను అనుమతించలేదు. విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్లే వాహనాలను స్క్రూబ్రిడ్జి వద్ద నిలిపివేశారు. గుంటూరు నుంచి విజయవాడ వైపు వచ్చే వాహనాలను తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లే మార్గం తర్వాత నిలిపివేశారు. గుంటూరు-విజయవాడ మధ్య రాకపోకలకు వారధి, ప్రకాశం బ్యారేజ్ కీలకం. ఈ రెండు మార్గాల్లోనూ ట్రాఫిక్ నిలిపివేయడంతో జాతీయ రహదారిపై ఖాజా టోల్‌గేటు వరకు వాహనాలు ఆగిపోయాయి. 3గంటలపాటు ట్రాఫిక్ ఆగిపోయింది.

మత్స్యకారులకు ప్రభుత్వం అండ: సీఎం

మత్స్యకారులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని సీఎం జగన్ అన్నారు. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఓఎన్జీసీ పైపులైన్ వల్ల ఉపాధి కోల్పోయిన 23,458 మంది మత్స్యకార కుటుంబాలకు మంగళవారం తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ నుంచి సీఎం బటన్ నొక్కి రూ.161.86 కోట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మత్స్యకారులను ఆదుకునే విషయంలో ఓఎన్జీసీ కూడా సాకులు చెప్పకుండా ముందుకు వచ్చిందన్నారు. 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, 4 పోర్టులు కడుతున్నామని, తీర ప్రాంతంలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని, వీటన్నింటికీ రూ.20వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నామని వివరించారు.

జువ్వలదిన్నె హార్బర్ ప్రారంభోత్సవం వాయిదా

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభోత్సవం వాయిదా పడింది. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం దీనిని ప్రారంభిస్తారని అధికారులు తొలుత ప్రకటించారు. కానీ పబ్లిసిటీ ఉండాలనే ఉద్దేశంతో.. స్వయంగా వెళ్లి ప్రారంభిస్తానని సీఎం చెప్పారు.

ఇంటర్ అడ్మిషన్లు చేపడితే చర్యలు

షెడ్యూలు ఇచ్చాకే చేర్చుకోవాలి.. ఇంటర్ విద్యామండలి హెచ్చరిక

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్మిషన్లపై ఇంటర్ విద్యామండలి కార్యదర్శి సౌరబ్ గౌర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పదో తరగతి పరీక్షలు ప్రారంభం కూడా కాకుండానే 2024-25 విద్యా సంవత్సరానికి పలు కాలేజీలు అడ్మిషన్లు తీసుకుంటున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇంటర్ విద్యా మండలి అడ్మిషన్లకు షెడ్యూలు విడుదల చేయకుండా ప్రవేశాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఇప్పటికే విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసి ఉంటే వాటిని వెంటనే వెనక్కి ఇచ్చేయాలని సూచించారు. కాలేజీలు నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే అఫిలియేషన్ కూడా రద్దుచేస్తామని మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

నకిలీ జనన, మరణ పత్రాలను నియంత్రించాలి: సీఎస్

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో జనన, మరణ నమోదు(సవరణ చట్టం-2023)పై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. గ్రామ, మున్సిపల్, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల స్థాయిలో జరిగే జనన, మరణ నమోదు ప్రక్రియ సకాలంలో, సక్రమంగా జరిగేలా సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. నకిలీ పత్రాల నియంత్రణకు వీలుగా పాత రికార్డుల డేటా బేస్ అంతా డిజిటలైజేషన్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జనన, మరణ నమోదు సవరణ చట్టం మార్గదర్శకాల నోటిఫికేషన్ వచ్చేలోగా క్షేత్ర స్థాయి అధికారులందరికీ ఈ చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యమిత్రల ద్వారా జనన, మరణాలు విధిగా నమోదయ్యేలా వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షించాలని సీఎస్ ఆదేశించారు.

ముస్లింలకు బాబు రంజాన్ మాసం శుభాకాంక్షలు

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): దివ్యఖురాన్ అవిర్భవించిన పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు టీడీపీ అధినేత చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. 'నెల రోజుల ఉపవాస దీక్షను విజయవంతంగా కొనసాగించేలా మీకు శక్తిని, ఆరోగ్యాన్ని ప్రసాదించాలని అల్లాను ప్రార్థిస్తున్నా' అని మంగళవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చంద్రబాబు పేర్కొన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఓడిపోయే అభ్యర్థికి టికెట్టా?!: రాపాక

అమలాపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): "రాజోలులో ఇప్పటికే రెండుసార్లు వైసీపీ ఓటమి చవిచూసింది. ఇప్పుడు కూడా ఓడిపోయే అభ్యర్థికే సీఎం జగన్ టికెట్ ఇచ్చారు. ఈ విషయంపై పునరాలోచించాలి" అని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ పరిధిలోని మలికిపురంలో మంగళవారం జరిగిన వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజోలులో మరోసారి సర్వే నిర్వహించి గెలిచే వ్యక్తికి ఎవరికైనా టికెట్ ఇవ్వాలన్నారు. రాజోలులో నమ్మిన కర్తగా నియమించిన అభ్యర్థికి ఓటమి తెలిసిన ప్రజలు ... వైసీపీ ఓటమి పాలైందని తెలిపారు.

అసైన్డ్ భూముల కేసు ఎన్నికల స్టంట్: మర్రెడ్డి

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై అసైన్డ్ భూముల కేసు సీఎం జగన్‌రెడ్డి ఎన్నికల స్టంట్ మాత్రమేనని తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాజధానిలో ఇన్‌సైడ్ ట్రేడింగ్ జరిగిందన్న వైసీపీ నేతలు ఐదేళ్లలో ఒక్క ఆధారం చూపలేకపోయారు. జగన్ తన వైఫల్యాలు, వివేకా కేసు ప్రస్తావన వచ్చినప్పుడల్లా ప్రజల దృష్టిని మళ్లించడానికి చంద్రబాబుపై ఆరోపణలు చేస్తున్నారు. చంద్రబాబుపై ఆరోపణలు చేసే ముందు నిప్పుకు చెదలు పట్టవని జగన్ గ్రహించాలి' అని హితవు పలికారు.

ఓటమి భయంతోనే శవ రాజకీయాలు: జీవీరెడ్డి

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ 'ఫేక్ ప్రచారం'లో జగన్‌రెడ్డి ప్రభుత్వ మోసం చేస్తున్నాడని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్‌కు ఎన్నికల్లో ఓడిపోతాననే భయం పట్టుకుంది. అందుకే గీతాంజలి మరణంపైనా శవ రాజకీయాలు చేస్తున్నారు. రక్తపు మరకలు టీడీపీ, జనసేనకు అంటించాలని చూస్తున్నారు' అని జీవీ రెడ్డి అన్నారు. తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, 'శవ రాజకీయాలు చేస్తున్న వైసీపీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు' అని హెచ్చరించారు.

కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఉచిత కుట్టు శిక్షణ

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుప్పంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా నారా భువనేశ్వరి కుప్పం మహిళలతో ముఖాముఖీ నిర్వహించిన సందర్భంలో మహిళల స్వయం ఉపాధికి ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చింది. అనుభవజ్ఞులైన ట్రైనర్లతో కుట్టు శిక్షణపై ఆసక్తి ఉన్న మహిళలు కుప్పంలోని శ్రీశక్తి స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని సంప్రదించాలని ట్రస్ట్ సూచించింది.

విజయనగరంలో టీడీపీ భారీ రోడ్ షో

విజయనగరం రూరల్, మార్చి 12: విజయనగరం పసుప దండు కదిలింది. జనసేన తోడైంది. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతిరాజును గెలిపించాలని కోరుతూ నగరంలోని 20, 21, 22, 23, 24 టీడీపీ డివిజన్ కమిటీలు, టీడీపీ నాయకులు మంగళవారం భారీ రోడ్ షో నిర్వహించారు. అదితి గజపతిరాజు నగర, మండల, నియోజకవర్గ నాయకులు స్వాగతం పలికారు. ప్రజలంతా బయటకు వచ్చి అదితి గజపతిరాజుకు హారతులు పట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా ముందుకొచ్చాయని, మద్దతు ఇచ్చి చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని కోరారు.

తెలంగాణలో బీజేపీకి.. 12 ఎంపీ సీట్లు పక్కా!

మరింత కష్టపడితే 15 వచ్చే ఛాన్సు: అమిత్‌షా

హైదరాబాద్‌లో కార్యకర్తలు, నేతలతో భేటీ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి దేశవ్యాప్తంగా 400 సీట్లు రావాలని కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా ఆకాంక్షించారు. తెలంగాణలో 12 కమలాలను గెలిపించి ఢిల్లీకి పంపాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. లోక్‌సభ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా మంగళవారం ఇక్కడకు చేరుకున్న ఆయన.. సికింద్రాబాద్‌లో బీజేపీ సోషల్ మీడియా కార్యకర్తలతో, ఎల్బీ స్టేడియంలో విజయ సంకల్ప సమ్మేళనం 'పేరిట పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశాల్లో ప్రసంగించారు. రాత్రికి ఐటీసీ కాకతీయలో బీజేపీ రాష్ట్ర పార్టీ ముఖ్యులతో దాదాపు అరగంటసేపు మాట్లాడారు. 'సర్వే ప్రకారం తెలంగాణలో 12 స్థానాల్లో మనం గెలుపొందుతాం. మరింత కష్టపడితే 15 స్థానాలు గ్యారెంటీ' అని స్పష్టం చేశారు. మోదీ పట్ల, బీజేపీ పట్ల సానుకూల వాతావరణం ఉందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ ఆత్మగౌరవం పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ రూ.4 వేల కోట్ల మియాపూర్ భూముల కుంభకోణం, ఓఆర్ఆర్ కుంభకోణం సహా రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కేసీఆర్ కుమార్తె కవిత ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కుపోయారని గుర్తు చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కోల్ బ్లాక్స్, కామన్వెల్త్, 2జీ, శారదా చిట్ ఫండ్, ఐఎన్ఎక్స్ మీడియా, ఏయిర్‌సెల్, ఆగస్టా వెస్ట్‌ల్యాండ్, బోఫోర్స్, లెంటి కుంభకోణాలకు పాల్పడిందని, 12 లక్షల కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. ఆ పార్టీ అవినీతిపై ఇక్కడి సీఎం సమాధానమివ్వాలని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి డిమాండ్ చేశారు. 'వారి అవినీతి జాబితా అంతా ...' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల ఎజెండా ఒక్కటేనని, మజ్లిస్ ఎజెండానే కారు, హస్తం మూలం చేస్తున్నాయని దుయ్యబట్టారు. 'సీఏఏతో ఎవరి పౌరసత్వానికి ఇబ్బంది ఉండదు. ఆ చట్టంతో మైనారిటీలు పౌరసత్వం కోల్పోతారంటూ రాహుల్‌గాంధీ, అసదుద్దీన్ ఒవైసీ తప్పుడు ప్రచారం చేస్తున్నారు' అని మండిపడ్డారు. సీఏఏ పౌరసత్వాన్ని ఇచ్చే చట్టమేగానీ.. తొలగించడానికి తెచ్చింది కాదన్నారు.



స్వాధీనం చేసుకున్న చిరుతపులి చర్మం

చిరుతపులి చర్మం స్వాధీనం

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

సిరిపురం (విశాఖపట్నం), మార్చి 12: చిరుతపులి చర్మాన్ని విక్రయించేందుకు యత్నిస్తున్న ముఠాను డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. చిరుత పులి చర్మంతో కొంతమంది వ్యక్తులు నగరంలోకి ప్రవేశించినట్టు అందిన సమాచారంతో డైరెక్టర్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో నగరంలోని దసపల్లా ప్రాంతంలో గల ఓ హోటల్‌లో ఈ ముఠాను గుర్తించారు. వారి నుంచి చిరుత పులి చర్మాన్ని స్వాధీనం చేసుకుని, అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. డబ్బు సంపాదించాలనే ఆశతో చిరుతపులిని వేటాడి, చర్మాన్ని విక్రయించేందుకు ఈ ముఠా సభ్యులు విశాఖ వచ్చినట్టు భావిస్తున్నారు. నిందితుల్లో ఇద్దరు ఒడిశాకు చెందిన వారు కాగా మరో ఇద్దరు విశాఖ వాసులు. నిందితుల నుంచి చిరుతపులి చర్మంతో పాటు ఒక కారు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని అధికారులు వివరించారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం చిరుతపులిని వేటాడటం, చంపడం, చర్మాన్ని అమ్మడం చట్టరీత్యా నేరమని, దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తామన్నారు.

హవ్వా.. ఫీజులు నొక్కేశారా?

టెట్ ఫీజులు వెనక్కి ఇవ్వని పాఠశాల విద్యాశాఖ

ఎస్జీటీకి అర్హత మార్కులతో 51వేల మందికి అనర్హత

వారు కట్టిన ఫీజుల విలువ రూ.3.87 కోట్లు

వెంటనే వెనక్కి ఇస్తామని టెట్‌కు ముందు హామీ

టెట్ ముగిసినా వెనక్కిరాని ఫీజులు

డీఎస్సీలోనూ మొదటిసారి ఫీజులు సర్కారుకే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయిస్తున్న దుస్థితి చూస్తున్నాం.! మద్యం ఆదాయాన్ని తనఖా పెట్టిన దౌర్భాగ్యాన్నీ చూశాం.! సచివాలయాన్ని తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడాన్నీ చూశాం.! కానీ.. నిరుద్యోగులు కట్టిన ఫీజులను ఓ ప్రభుత్వం దారిమళ్లించుకోవడం ఎప్పుడైనా చూశారా..? దేశంలో మరే ఇతర రాష్ట్ర ప్రభుత్వమైనా ఇలాంటి పనిచేసి ఉండదు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా గతంలో ఏ ప్రభుత్వమూ ఇంతలా కక్కుర్తి పడలేదు. కానీ, జగన్ ప్రభుత్వం మాత్రం నిరుద్యోగులు కట్టిన పరీక్ష ఫీజులను దారిమళ్లించింది. అసలే ఉద్యోగాల్లేక కటకటలాడుతున్నాం.. అనుకుంటే ఏమోగానీ టెట్ కోసం అభ్యర్థులు కట్టిన ఫీజులు వెనక్కిస్తామన్న ప్రభుత్వం ఆ మాట మర్చిపోయింది. కాదు కాదు.. మర్చిపోయినట్టు నటిస్తోంది! తర్వాత ఇద్దాంలే అన్నట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

ఫీజులు వెనక్కి ఎందుకు?

ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం అందులో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులకు బీఈడీ చదివిన వారు అర్హులని పేర్కొంది. గతేడాది ఎన్సీటీఈ ఎస్జీటీ పోస్టులకు డీఈడీ అభ్యర్థులు మాత్రమే అర్హులని రాజస్థాన్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. జగన్ ప్రభుత్వం ఆ తీర్పుకు విరుద్ధంగా బీఈడీ వారినీ అర్హులను చేసింది. ఆ మేరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. దీంతో 3,19,176 మంది టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మధ్యలో ఎస్జీటీ పోస్టులకు బీఈడీ వారిని అర్హులను చేయడంపై కొందరు హైకోర్టులో సవాలు చేశారు. సుప్రీం తీర్పును ఉటంకిస్తూ హైకోర్టు ఆదేశించింది. దీంతో బీఈడీ చదివిన వారిని ఎస్జీటీ పోస్టులకు సంబంధించిన టెట్ పేపర్-1కు అనర్హులుగా ప్రకటించింది. అప్పటికే వారు రూ.750 చొప్పున ఫీజులు చెల్లించారు. ఆ నగదును తిరిగి వారి ఖాతాల్లో జమచేస్తామని పాఠశాల విద్యాశాఖ టెట్‌కు ముందు ప్రకటించింది. టెట్ పరీక్షలు మార్చి 27న ప్రారంభమై, ఈ నెల 6తో ముగిశాయి. టెట్ ప్రారంభానికి ముందే ఫీజులు వెనక్కి ఇస్తామన్న పాఠశాల విద్యాశాఖ పరీక్షలు ముగిసిపోయినా ఇంతవరకు వాటిని తిరిగి జమ చేయలేదు. 5,617 మంది అభ్యర్థులు రూ.750 చొప్పున 3.87కోట్లు ప్రభుత్వానికి చెల్లించారు. వారి డబ్బులు వారికి ఇవ్వడానికి పాఠశాల విద్యాశాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. అయితే డబ్బులను ప్రభుత్వం వాడుకుందనే ప్రచారం జరుగుతోంది. అందుకే డబ్బులను వెనక్కి ఇవ్వలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఐడీల మాయతో జేబుకు చిల్లు

ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే నిరుద్యోగుల జేబులకు చిల్లు పెట్టేలా పాఠశాల విద్యాశాఖ వ్యవహరించింది. డీఎస్సీకి ఒక్కో అభ్యర్థి సబ్జెక్టుల వారీగా రెండు నుంచి మూడు పేపర్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో పేపర్‌కు రూ.750 చొప్పున రూ.2వేలపైగా చెల్లించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు వివరాలు నమోదు చేసి, నగదు చెల్లిస్తే అభ్యర్థులకు ఐడీ నంబరు వస్తుంది. కానీ డీఎస్సీ వెబ్‌సైట్ ఆశక మందికి నగదు చెల్లించినా ఐడీ నంబర్లు జనరేట్ చేయలేదు. దీంతో చాలా మంది రెండు సార్లు, కొందరైతే మూడు సార్లు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఐడీ నంబరు జనరేట్ కాని సందర్భాల్లో చెల్లించిన నగదు తిరిగి అభ్యర్థుల ఖాతాల్లో జమవుతాయి. కానీ ఇంతవరకూ ఒక్క రూపాయి కూడా తిరిగి రాలేదు. దీనిపై టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే పాఠశాల విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదు. నిరుద్యోగుల నుంచి రూ.2వేలు చొప్పున ప్రభుత్వం అన్యాయంగా తీసుకుందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అసలు ఆ డబ్బులు ఇస్తారో లేదో కూడా చెప్పడం లేదని అంటున్నారు.

ప్రజాస్వామ్య భారతం నియంతృత్వంలోకి

2018 నాటికే ఎలక్టోరల్ ఆటోక్రసీ..

వీడెమ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 12: నియంతృత్వం వరంగా భారత్ ప్రపంచదేశాల్లో విశ్వగురు స్థానంలో ఉందని 'వెరైటీస్ ఆఫ్ డెమోక్రసీ' (వీ-డెమ్) తాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వం కింద మగ్గుతున్న 280 కోట్ల మందిలో సగం జనాభా భారత్‌లోనే ఉందని పేర్కొంది. 2013 నుంచి భారత్‌లో ప్రజాస్వామ్యం పెద్ద ఎత్తున పెరిగిపోయిందని, 2018 నాటికి దేశం ఎలక్టోరల్ ఆటోక్రసీ (ఎన్నికల జరిగే నియంతృత్వ దేశం) స్థాయికి పడిపోయిందని తెలిపింది. 'భారత్ అసలు ప్రజాస్వామ్య దేశంగానే లేదు' అని తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. భారత్‌తోపాటు మొత్తం 42 దేశాల్లో నియంతృత్వం ఉందని వీ-డెమ్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణులు పెరిగిపోతున్నాయని, మొత్తం 179 దేశాల్లో ప్రజాస్వామ్య పరిస్థితిని ఈ నివేదికలో సమీక్షించారు. భారత్ 0.28 స్కోర్‌తో 104వ స్థానంలో నిలిచింది. కాగా, పాకిస్థాన్ 0.21 స్కోర్‌తో 119వ ర్యాంకులో ఉంది. స్వీడన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ గుటెన్‌బర్గ్ పొలిటికల్ సైన్స్ విభాగంలో ఏర్పాటైన వీ-డెమ్ ఇన్‌స్టిట్యూట్ ఏటా ప్రపంచ దేశాల్లో ప్రజాస్వామ్య పరిస్థితులపై నివేదికను విడుదల చేస్తోంది.

మోదీ హయాంలో హక్కుల అణిచివేత

భారత్‌లో 2008 నుంచే నియంతృత్వం దిశగా అడుగులు మొదలయ్యాయని పేర్కొన్న వీ-డెమ్... మీడియా స్వతంత్రతను హరించటం, సోషల్ మీడియాపై ఉక్కుపాదం, ప్రభుత్వాన్ని విమర్శించే జర్నలిస్టులపై వేధింపులు మోదీ హయాంలో పెరిగిపోయాయని విమర్శించింది. గత ఐదేళ్లుగా ఇంటర్నెట్ షట్‌డౌన్ల రాజధానిగా భారత్ కొనసాగుతుందని వ్యాఖ్యానించింది.

ఉక్కు ఉత్పత్తి డీలా!

మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ఫలితం శూన్యం

అధికారులకు ఇంకా అందని జీతాలు

ఎప్పుడు ఇస్తామో చెప్పలేమన్న సీఎండీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



ఉక్కు కర్మాగారం (ఫైల్)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును ప్రైవేటుపరం చేయబోమని, అడుకుంటామని బీజేపీ నాయకులు చెబుతున్నా, యాజమాన్యం మాత్రం ప్లాంటును మూసివేత దిశగా తీసుకువెళుతోంది. అన్ని రకాల ప్రభుత్వ అనుమతులు ప్లాంటు కోసం ఉన్నప్పటికీ, ఉత్పత్తిని పైకి చెబుతున్నప్పటికీ.. లోపల మాత్రం ఆర్థికంగా కుదేలైపోయి, ఉత్పత్తి కుదించుకుపోతోంది. ముడి పదార్థాల కొనుగోలుకు నిధులు లేక ఒక బ్లాస్ట్ ఫర్నేస్ (బీఎఫ్)ను రెండేళ్ల క్రితం మూసేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం సీఎండీ ఉన్న డాల్ స్టీల్ నుంచి ఆర్థిక సాయం తీసుకొని గత డిసెంబరులో దానిని వినియోగంలోకి తీసుకువచ్చారు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడిపిస్తామన్నారు, ఇక తిరుగులేదని అన్నారు. కానీ ఉత్పత్తి చూస్తే చెప్పుకునేలా లేదు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లతో రోజుకు సగటున 21 వేల టన్నుల ఉత్పత్తి చేయవచ్చు. కానీ మూడింటికీ సరిపడా ముడి పదార్థాలు లేకపోవడంతో వారంలో మూడు, నాలుగు రోజులు ఏదో ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌ను డౌన్ చేస్తున్నారు. అలాగని మిగిలిన రెండింటిలోనూ పూర్తి ఉత్పత్తి జరుగుతోందా అంటే అదీ లేదు. గత ఫిబ్రవరిలో సగటున రోజుకు 14,086 టన్నులు ఉత్పత్తి చేశారు. అంటే 2/3 వంతు మాత్రమే ఉత్పత్తి తీశారు. ఇప్పుడు మార్చిలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మార్చి 11వ తేదీ వరకు అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం రోజుకు 21వేల టన్నులు ఉత్పత్తి చేయాల్సి ఉండగా.. 12,559 టన్నులు మాత్రమే ఉత్పత్తి అయింది. అంటే గత నెల కంటే ఉత్పత్తి ఇంకా పడిపోయింది. బ్లాస్ట్ ఫర్నేస్-2ను తాత్కాలికంగా షట్‌డౌన్ చేశారు. ఈ 11 రోజుల్లో ఇప్పటివరకు 1,38,150 టన్నులు మాత్రమే ఉత్పత్తి వచ్చింది. వాస్తవిక సామర్థ్యం ప్రకారం 2.31 లక్షల టన్నులు రావాలి. కానీ లక్ష టన్నులు తక్కువగా చేశారు. ఆర్థిక సంవత్సరం ఆఖరు నెలలో ఎక్కువ ఉత్పత్తి చేసి, అమ్మకాలు కూడా ఎక్కువగా చేస్తారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జిందాల్ చేసిన ఆర్థిక సాయం కూడా బూడిదలో పోసిన పన్నీరైంది.

ఇప్పటికీ జీతాలు లేవు

12వ తేదీ ముగిసినా ఫిబ్రవరి నెల జీతాలు ఇప్పటికీ ఎగ్జిక్యూటివ్‌లకు ఇవ్వలేదు. సుమారు రూ.40 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఆ దిశగా ఉద్యోగ సంఘాలు సీఎండీని కలిసి జీతాలు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించగా ఆయన ఆనతిక... బ్యాంకులకు చెల్లింపుల కట్టాల్సి ఉందని సమాధానం చెప్పారే తప్ప, ఫలానా తేదీన ఇస్తామని గ్యారంటీ ఇవ్వలేదు. అంటే ఈ నెల జీతాలు కూడా ఎప్పుడు చూడవచ్చని సూచన చేసినట్టుగా ఉంది. ఈ నెలాఖరుకి మరిన్ని ఉద్యోగులు వాపోతున్నారు. స్టీల్‌ప్లాంటును గట్టెక్కిస్తున్నామని బయట ప్రచారం చేస్తూ.. లోపల మాత్రం దానిని ఆర్థికంగా దివాళా తీయిస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. తమ వసతిని బిలా లేకపోవడం వల్లే జరిగిందని ప్రచారం చేసి ప్రైవేటుకు అప్పగించడమే దీని వెనుక కుట్ర అని ఉద్యోగులు, కార్మికులు మండిపడుతున్నారు.

వయసు నిర్ధారణకు ప్రామాణికం స్కూల్ సర్టిఫికెట్లే

అవి లేనప్పుడే వైద్య పరీక్షలు: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, మార్చి 12: వయసు నిర్ధారణకు పాఠశాలలు ఇచ్చే ధ్రువపత్రాలనే ప్రామాణికంగా తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అవి ఇచ్చే జనన ధ్రువ పత్రాలకే విలువ ఎక్కువని తెలిపింది. అవేవీ లేనప్పుడు మాత్రమే వయసు నిర్ధారణ కోసం వైద్యులు ఇచ్చే పత్రాలను పరిగణించాల్సి ఉంటుందని తెలిపింది. 1982లో జరిగిన హత్య కేసులోని ముద్దాయి పెట్టుకున్న దరఖాస్తుపై విచారణ జరిపిన కోర్టు తీర్పు వెలువరించింది. పాఠశాలలు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు ఇచ్చే డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లను ప్రామాణికమైనవిగా చూడాలని, అవి అందుబాటులో లేనప్పుడు వైద్యులు ఇచ్చే ఆసిఫికేషన్ టెస్ట్ సర్టిఫికెట్లను పరిశీలించాలని తెలిపింది. 1982 సెప్టెంబరు 10న జరిగిన హత్యలో ప్రస్తుత కేసు పిటిషనర్ వినోద్ కటారాతో పాటు మరో మగ్గురికి ట్రయల్ కోర్టు 1986లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. మరోవైపు శిక్షలు పడిన ముద్దాయిల్లో కొందరు షెనర్లుగా ఉన్నారేమో పరిశీలించాలని అలహాబాద్ హైకోర్టులో 'పిల్' దాఖలయింది. 2021లో దోషులను పరిశీలించిన మధుర జైలు మెడికల్ బోర్డు వినోద్ కటారా వయసు 2021 డిసెంబరు 10 నాటికి 56 ఏళ్లు ఉంటుందని నిర్ధారించింది. దీని ప్రకారం హత్య జరిగిన 1986 సెప్టెంబరు 10 నాటికి తన వయసు సుమారుగా 15 ఏళ్లు ఉంటుందని వినోద్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. దీనిపై సుప్రీంకోర్టు వినోద్ వయసుపై నివేదిక ఇవ్వాలని ఆగ్రా జిల్లా కోర్టు జడ్జిని 2022లో ఆదేశించింది. స్కూల్ సర్టిఫికెట్లతో పాటు పలు పత్రాలను పరిశీలించిన ఆ జడ్జి.. నేరం జరిగినప్పుడు వినోద్ మైనరేనని తేల్చారు.

ప్రజల ఆకాంక్షలతో బీజేపీ మేనిఫెస్టో

మూడు పార్టీల కలయికతో కదులుతున్న తాడేపల్లి పునాదులు: సీఎం రమేశ్



విశాఖపట్నం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలతోనే బీజేపీ మేనిఫెస్టో తయారుచేస్తుందని రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ పేర్కొన్నారు. వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విశాఖపట్నం వచ్చిన ఆయన మాట్లాడారు. 'ఎవరైనా ఏదైనా అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టాలని భావిస్తే 9090902024 నంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వండి. బీజేపీ హయాంలో అభివృద్ధి వేగవంతమైంది. ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి ఎన్నికల్లో పనిచేయాలనే నిర్ణయానికి నుంచి తాడేపల్లి పునాదులు కదులుతున్నాయి. డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీ పెద్దలు దోచుకున్న ప్రజాధనం ప్రజలకు పంపిణీ చేస్తాం. జగన్ తాడేపల్లిలో కూర్చొని అబద్ధాలు మాట్లాడుతున్నారు' అని రమేశ్ విమర్శించారు. 'ఈసారి జరిగే ఎన్నికల్లో విశాఖపట్నం లోక్‌సభకు పోటీ చేస్తానని సీఎం రమేశ్ చెప్పారు. అధిష్ఠానానికి తన మనసులో మాట చెప్పానని, వారు ఎలా చెబితే అలా చేస్తానన్నారు. కడపలో స్టీల్‌ప్లాంటు కోసం 12 రోజులు పోరాటం చేశానని, విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ప్రైవేటుపరం కాకుండా అధిష్ఠానాన్ని ఒప్పిస్తామన్నారు.

ఆ ఎంపీలు ఎందుకు వెళ్లిపోయారో చెప్పరేమి?

వైసీపీ నుంచి ఇటీవల వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, లావు కృష్ణదేవరాయలు, బాలశౌరి తదితర ఎంపీలు బయటకు వెళ్లిపోయారని, దానికి కారణాలు ఏమిటో వైసీపీ తన పత్రికలో, టీవీ ఛానల్‌లో ఎందుకు కథనాలు వేయడం లేదని ప్రశ్నించారు. వారి కారణాలను కూడా సాక్షిలో ప్రచురిస్తే ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత వారికి లేదా?..అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, పార్టీ నాయకులు సురేంద్రమోహన్, సుహాసినీ, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



సీఈవో మీనాకు వినతిపత్రం ఇస్తున్న వర్ల రామయ్య

ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల ప్రచారమా..!

జగన్‌రెడ్డి అడ్డదారిలోనే అధికారులు...

బరితెగించిన వెంకట్రామిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

సీఈవో మీనాకు వర్ల రామయ్య ఫిర్యాదు

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి జగన్ తరఫున ఎన్నికల ప్రచారం చేస్తున్న సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనాను కలసి ఫిర్యాదు చేశారు. అనంతరం వర్ల మాట్లాడారు. 'అన్ని వ్యవస్థలను నాశనం చేసిన జగన్‌రెడ్డి దారిలోనే కొంత మంది ప్రభుత్వ అధికారులు నడుస్తున్నారు. వైసీపీ రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తుంది. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి జగన్ తరఫున ఎన్నికల ప్రచారం చేస్తున్న వెంకట్రామిరెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలి. జగన్ మరలా అధికారంలోకి రాకపోతే ఉద్యోగులకు చాలా ఇబ్బందులు ఉంటాయని, రావాల్సిన రాయితీలు రావని సచివాలయ ఉద్యోగులను భయపెడుతున్నారు. ఉద్యోగులు సంఘాల నాయకులైనా రాజకీయ నేరుగా ఎన్నికల ప్రచారం చేయకూడదు.' ... 'ఈ విషయంపై ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు లేఖ రాశారు. అయినా చర్యలు లేవు. అందుకే మీనాను కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశాం. ఇప్పటికైనా వెంకట్రామిరెడ్డిని సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించాలి' అని డిమాండ్ చేశారు.

మత వైషమ్యాలను రెచ్చగొడుతున్న జగన్ మేనత్త...

'వైఎస్ జగన్ మేనత్త విమలారెడ్డి అన్ని క్రైస్తవ మత బోధకురాలు ఊరూరా పాస్టర్లతో సమావేశం అవుతున్నారు. పాస్టర్లకు బహుమతులు, డబ్బులు ఎర చూపి జగన్‌రెడ్డికి ఓటు వేయాలని కోరుతున్నారు. ఇతర మతాల నుంచి క్రైస్తవ మతాన్ని కాపాడుకోవాలంటే జగన్‌రెడ్డికే ఓటు వేయాలని ఆమె ప్రచారం చేయడం చట్టరీత్యా నేరం' అని వర్ల అన్నారు. ఆమెకు అన్ని ఆధారాలతో ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశాం. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరాం. కాగా, కొంతమంది... వాలంటీర్లు, అధికారులు, సెక్రటేరియట్ ఉద్యోగులకు, ఓటర్లకు బహిరంగంగా బహుమతులు ఇస్తున్నారు. ఎక్కడెక్కడ వైసీపీ నాయకులు బహిరంగంగా బహుమతులు, డబ్బులు పంచారో వాటి వివరాలతో సహా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశాం. పోలీసులు ఇలాంటి వాటిని అరికట్టకుండా పోయి కొన్ని చోట్ల వారే పంపిణీ చేస్తున్నారు. అవకాశం లేదు కానీ డీజీపీ కూడా వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారం చేసేవారు. బహుమతుల పంపిణీపై కూడా చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరాం' అని వర్ల తెలిపారు.

పునీత్‌ను అరెస్టు చేయొద్దు!

తొందరపాటు చర్యలు వద్దు.. ఆరు వారాల వరకు ఆగండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఆర్డీసీ పన్నుల ఎగవేత కేసులో మధ్యంతర ఉత్తర్వులు జారీ

నారాయణ అల్లుడికి ఊరట



అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి నారాయణ అల్లుడు కొతపా పునీత్‌కు హైకోర్టులో ఊరట లభించింది. బస్సుల కొనుగోలు వ్యవహారంలో పన్నులు కట్టకుండా, ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చారనే ఆరోపణలతో నమోదు చేసిన కేసులో అరుచాలపాటు పునీత్‌ను అరెస్ట్ చేయవద్దని, ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోకూడదని నెల్లూరు పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. అయితే, కేసుపై దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. నెల్లూరుజిల్లా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెల్లూరు, బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ ఎన్‌సైరా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ కొతపా పునీత్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. బస్సుల కొనుగోలు వ్యవహారంలో పిటిషనర్‌కు ఎలాంటి ప్రమేయం లేదన్నారు. కేవలం రాజకీయ కారణాలతో పిటిషనర్‌ను కేసులో ఇరికించారని తెలిపారు. పన్ను చెల్లించలేదని జీఎస్టీ అధికారులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు. పోలీసుల తరఫున ప్రత్యేక అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తూ.. ఎన్‌సైరా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ సంస్థ మొత్తం 92 బస్సులు కొనుగోలు చేసిందని, పోర్జరీ దాఖ్యుమెంట్లు పెట్టి బెనిఫిట్ పొంది ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చిందన్నారు.

ఏపీ ఎన్నికలపై కేఏ పాల్ వినతిని పరిశీలించండి!

ఈసీకి హైకోర్టు ఆదేశం..తాము నేరుగా ఆదేశాలివ్వలేమని స్పష్టీకరణ

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఏపీలో ఎన్నికలను చివరి దశలో నిర్వహించి, తక్షణం ఓట్ల లెక్కింపు జరిపేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని(ఈసీ) ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన కోర్టు.. పిటిషనర్ వినతిని పరిగణనలోకి తీసుకుని తగిన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. అయితే, ఫలానా సమయంలో ఎన్నికలు నిర్వహించాలని ఈసీకి ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేస్తూ వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి. నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశాలిచ్చింది.

మాల్దీవుల నుంచి భారత సైన్యం వెనక్కి

మాలె/బీజింగ్, మార్చి 12: మాల్దీవుల నుంచి సైన్యం ఉపసంహరణ ప్రక్రియను భారత్ మొదలుపెట్టింది. మాల్దీవుల్లో విమానం విధులు నిర్వహిస్తున్న 25 మంది భారతీయ సైనికులు ఆదివారం స్వదేశానికి వెళ్లిపోయారని మాల్దీవుల పత్రిక మిహారు ప్రచురించింది.

ఉచితంగా ఆధార్ అప్‌డేట్‌కు గడువు పెంపు

న్యూఢిల్లీ, మార్చి 12: ఆధార్ వివరాలను ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్‌డేట్ చేసుకోవడానికి గడువును జూన్ 14 వరకు పొడిగిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గతంలో ఈ గడువు మార్చి 14 వరకు ఉండగా, దానిని మరో మూడు నెలలు పొడిగించింది. 'మై ఆధార్ పోర్టల్'లో ఉచితంగా వివరాలను నమోదు చేసుకోవచ్చని పేర్కొంది. ఆధార్ కేంద్రాలకు వెళ్లి వివరాలను అప్‌డేట్ చేసుకోవాలంటే రూ.50 చెల్లించాల్సి ఉంటుంది.

గుజరాత్ తీరంలో రూ.480 కోట్ల డ్రగ్స్ సీజ్

న్యూఢిల్లీ, మార్చి 12: పెద్దమొత్తంలో మాదక ద్రవ్యాలతో భారత్‌లోకి ప్రవేశించబోయిన పాకిస్థాన్ బోటును గుజరాత్ తీరంలో అధికారులు పట్టుకున్నారు. అందులోని రూ.480 కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేశారు. బోటులోని ఇద్దరు పాక్ సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. భారత కోస్ట్‌గార్డ్ (ఐసీజీ), గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను నిర్వహించాయి.

ఆంధ్రజ్యోతి దిక్సూచి

భవిష్యత్తుకు బాటలు వేసే బోర్డు పరీక్షల్లో మొదటిది టెన్త్ ఎగ్జామ్. అన్ని పరీక్షల మాదిరిగానే ఇదీ ఒకటి. అయితే ఈ పరీక్ష కెరీర్‌ను నిర్దేశిస్తుంది, అందుకు అవకాశాలను మెరుగుపరుస్తుంది. అసలు పరీక్ష అంటేనే విద్యార్థుల్లో ఎంతో కొంత ఒత్తిడి ఉంటుంది. పేషెన్స్, కమిట్‌మెంట్‌తో ఒత్తిడిని అధిగమించాలి. బోర్డు ఏదైనప్పటికీ టెన్త్ పరీక్షలకు సంబంధించిన వ్యూహం ఈ విధంగా ఉంటే పర్ఫార్మెన్స్ మెరుగ్గా ఉంటుంది.

టెన్త్ సక్సెస్



పదిలో పదికి పదునైన వ్యూహం

పొమొడొరొ (పీఓఎంఓడిఓఆర్ఓ) టెక్నిక్

ఇదో టైమ్ మేనేజ్‌మెంట్ టెక్నిక్. ఇది బాగా పనిచేస్తుంది. ఉన్న సమయం, అవసరమైన వేగానికి మధ్య సమన్వయానికి తోడ్పడుతుంది. ఈ పద్ధతిలో అతి పెద్ద చాప్టర్‌ను చిన్న చిన్న ముక్కలుగా విభజించుకుని ప్రతి దానికి అర్ధ గంట నుంచి గంట సేపు సమయం కేటాయించుకోవాలి. మధ్యలో అయిదు - పది నిమిషాల బ్రేక్‌తో కనీసం రెండు సార్లయినా రిపీట్ చేసుకోవాలి. తదుపరి కనీసం అరగంట సేపు బ్రేక్ తీసుకోవాలి. అలా టైమ్ నిర్దేశించుకోగలిగితే అనుకున్న సమయంలోనే టాస్క్ పూర్తవుతుంది. అదే మున్ముందు మరింత ప్రొడక్టివ్‌గా రూపొందుతుంది. తద్వారా టైమ్ మేనేజ్‌మెంట్ స్కిల్స్ పెరుగుతాయి.

నెమోనిక్స్

సెల్ఫ్ నోట్స్‌లోని అందాన్ని గుర్తించాలి. సొంతంగా రూపొందించుకున్న నోట్స్ మైండ్‌కు కనెక్ట్ అవుతుంది. అంతకు మించి స్టోర్ అవుతుంది. మళ్ళీ జ్ఞాపకం చేసుకోవడం కూడా సులువు. ట్రిగ్నామెట్రీ, జెనెటిక్స్, కార్బన్ అండ్ ఇట్స్ కాంపౌండ్స్ వంటి టాపిక్స్‌ను రివిజన్ చేసేందుకు కూడా ఈ టెక్నిక్ బాగా ఉపయోగపడుతుంది. డయాగ్రమ్స్, ఫ్లోచార్టులు/ షార్ట్‌కట్స్, నెమోనిక్స్(గుర్తుంచుకునే విధంగా చదువుకునే విధానం)తో రూపొందించుకున్న సమాచారాన్ని మర్చిపోవడం కుదరదు. ఈ పద్ధతి విద్యార్థిలో భయాన్ని తగ్గిస్తుంది. అదే సమయంలో ప్రిపరేషన్‌కు సంబంధించి వేగం పెరుగుతుంది. ఉదాహరణకు ప్లీజ్ స్టాప్ కాలింగ్ మి ఎ కేర్‌లెస్ జీబ్రా(Please Stop Calling Me A Careless Zebra) పొటాషియం, సోడియం, కాల్షియం, మెగ్నీషియం, అల్యూమినియం, కార్బన్, జింక్ - ఇది కెమిస్ట్రీ రియాక్టివిటీ సిరీస్ ఆర్డర్. ఇదే గుర్తుంచుకునేందుకు ఏర్పాటు చేసుకున్న విధానం - నెమోనిక్స్). ఇలాంటి బండ గుర్తులను టీచర్లు కూడా చెబుతారు. కొందరు విద్యార్థులు తమకు తాము రూపొందించుకుంటారు. సులువుగా గుర్తుంచుకునేందుకు ఇంకా బాగా చెప్పాలంటే అస్సలు మర్చిపోకుండా ఉండేందుకు ఇలాంటి టెక్నిక్స్ ఉపయోగపడతాయి.

డెఫినెట్

'హ్యాంగింగ్ ఫ్రూట్స్'. చెట్టుకింద నిలబడి చేతికి అందిన పండ్లను తెంపుకోవడం. పరీక్ష సమీపిస్తున్న ఈ సమయంలో కచ్చితంగా, ఉజ్జాయింపుగా, వచ్చే అవకాశం అంటూ విడగొట్టుకుని స్టడీ చేయడం అన్నమాట. పరీక్షలు అంటే పుస్తకంలోని మొదటి నుంచి చివరి పేజీ వరకు అన్నింటిని నేర్చుకోవాల్సిన అవసరం ఉండదు. ఇక్కడ ఎగ్జామ్ బ్లూప్రింట్‌కు బదులు మార్కుల స్కీమ్‌లో కచ్చితత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇది ఎలా పనిచేస్తుందంటే, మొదట చాప్టర్లు అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలి. వీటిలో ఎగ్జామినర్ల కంటిలో పడేవి కొన్ని ఉంటాయి. వాటి జాబితాను సిద్ధం చేసుకోవాలి. అలా ప్రశ్నలు తప్పకుండా అడిగే చాప్టర్లు ఏవీ అన్నది తెల్సుకోవాలి. ఉదాహరణకు కార్బన్ అండ్ ఇట్స్ కాంపౌండ్ - మళ్ళీ అందులో కెమికల్ ప్రాపర్టీస్ లేదా సోప్ యాక్షన్ మెకానిజం; ట్రయాంగిల్స్ - బీపీటీ/ థేలస్ థీరమ్ ప్రూఫ్, పైథాగరస్ థీరమ్ వంటివి తీసుకోవాలి.మార్కులకు వీలు కల్పించే చాప్టర్లు అన్నింటినీ ప్రతి సబ్జెక్టు నుంచి గుర్తించాలి. ఆపై కాన్ఫిడెన్స్ ఉన్న వాటితో ప్రిపరేషన్ మొదలుపెట్టుకోవాలి.

పాత ప్రశ్నపత్రాలు


కొన్ని టాపిక్స్ చాలా కష్టం అనిపిస్తాయి. ఒకపట్టాన కొరుకుడు పడవు. పైపెచ్చు వీటి నుంచి కనీసం ఇరవై నుంచి ఇరవై అయిదు మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. అప్పుడు ఏమి చేయాలి, ఆ మార్కులను ఎలా పొందాలి అన్నది ప్రశ్న. వరల్డ్ ఆఫ్ లివింగ్(సైన్స్), ఆల్జీబ్రా (మేథ్స్) చాలా మందికి కష్టం. ఇక్కడ స్కోర్ కోసం మొదట పాత ప్రశ్నపత్రాలను తిరగేయాలి. తద్వారా తరచూ అడుగుతున్న ప్రశ్నలను తెలుసుకోవాలి. వాటిని ప్రిపేరైతే చాలు, కష్టం అనిపించే టాపిక్స్‌లోనూ మంచి స్కోరింగ్‌కు అవకాశం ఉంటుంది.

బ్లండర్ నోట్స్

ప్రిపరేషన్‌లో ఎక్సలెన్స్ కోసం ఇదో పద్ధతి. చేసిన తప్పులను ఒక దగ్గర రాయాలి. దీన్నే 'బ్లండర్ నోట్స్' అంటారు. చేసిన తప్పు, కరెక్ట్ చేసుకున్న విధం పరీక్షలో ఒక ప్రశ్నకు జవాబు రాస్తున్నప్పుడు గుర్తుకు వస్తే చాలు. ఆటోమేటిక్‌గా కరెక్ట్‌గా జవాబు రాయడానికి దోహదపడుతుంది. ఒక రకంగా ఇది ఎర్రర్ ఫ్రీ సొల్యూషన్. తప్పిదాల నుంచీ నేర్చుకోవడంగానూ చెప్పుకోవచ్చు. అసలు ఫన్ లేకుండా మార్కులు వస్తాయనుకోవడమే తప్పు. సమయాన్ని సరిగ్గా సద్వినియోగం చేసుకుంటే సరిపోతుంది. ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో చక్కగా గడపాలి. ఆ సమయంలో ఆనందంగా ఉండేలా చూసుకుంటే మరింత ఉత్సాహంగా ఉండగలుగుతారు. ఆరోగ్యంపై కూడా దృష్టిసారించాలి. అన్నింటికి ప్రాధాన్యం ఇస్తూ, చదువుకోవడంలో మమేకం కావాలి. అలా పరీక్షలు రాసేందుకు సన్నద్ధమైతే చాలు, మొత్తం ఎపిసోడ్ ఫలితాన్నిచ్చేదిగా మారుతుంది. సదా నేర్చుకోవడమే సరైన పద్ధతి.

- మానికా గౌతమ్

నోటిఫికేషన్స్



టీఎస్ పీఈసెట్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్‌ఈ)- 'తెలంగాణ స్టేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్(టీఎస్ పీఈసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఈ టెస్ట్ ద్వారా రెండేళ్ల వ్యవధిగల బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ప్రైవేట్/ అనుబంధ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: బీపీఈడీ కోర్సులో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జులై 1 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి.

- డీపీఈడీ కోర్సులో ప్రవేశానికి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జులై 1 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి.

టీఎస్ పీఈసెట్ వివరాలు: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ ఉంటుంది. దీనికి 400 మార్కులు కేటాయించారు. పురుషులకు 100 మీటర్ల పరుగు, 800 మీటర్ల పరుగు, 6 కేజీల పుట్టింగ్ ద షాట్, లాంగ్ జంప్/హై జంప్; మహిళలకు 100 మీటర్ల పరుగు, 400 మీటర్ల పరుగు, 4 కేజీల పుట్టింగ్ ద షాట్, లాంగ్ జంప్/హై జంప్ ఉంటాయి. ఒక్కో ఈవెంట్‌కు 100 మార్కులు నిర్దేశించారు. రెండో పార్ట్‌లో స్కిల్ టెస్ట్ ఉంటుంది. బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, వాలీబాల్ క్రీడల్లో ఒకదానిలో అభ్యర్థి క్రీడానైపుణ్యాన్ని పరీక్షిస్తారు. దీనికి 100 మార్కులు ఉంటాయి. హార్ట్ సంబంధిత సమస్యలు ఉన్నవారు, గర్భిణులు ఈ టెస్టులలో పాల్గొనడానికి అనర్హులు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** మార్చి 14 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, స్కిల్ టెస్ట్ తేదీలు:** జూన్ 10 నుంచి 13 వరకు
- **వెబ్‌సైట్:** pecet.tsche.ac.in

ఏపీ ఈఏపీ సెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ)- ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ ఈఏపీసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే) నిర్వహిస్తోంది. ఈ టెస్ట్‌ను 'ఇంజనీరింగ్'; 'అగ్రికల్చర్& ఫార్మసీ' స్ట్రీమ్‌లలో నిర్వహిస్తారు. వీటి ద్వారా ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, బీటెక్ (డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చర్ ఇంజనీరింగ్/ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ), బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్), బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ, బీఫార్మసీ, ఫార్మాడీ, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ(సీఏ&బీఎం) ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. అభ్యర్థులు సాధించిన ర్యాంక్ ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ ప్రొఫెషనల్ కళాశాలలో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష సిలబస్, మోడల్ పేపర్ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

అర్హత: కనీసం 45శాతం మార్కులతో మేథమెటిక్స్/ బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇంజనీరింగ్ డిప్లొమా/ఒకేషనల్ కోర్సు(ఇంజనీరింగ్, టెక్నాలజీ) పూర్తిచేసినవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులకు అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి. ఫార్మాడీ కోర్సుకు మాత్రం 17 ఏళ్లు నిండి ఉండాలి. బీటెక్ (డెయిరీ టెక్నాలజీ/ అగ్రికల్చర్ ఇంజనీరింగ్/ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ), బీఎస్సీ(అగ్రికల్చర్) కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య. బీఎస్సీ నర్సింగ్ కోర్సుకు 17 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.

ఏపీ ఈఏపీ సెట్ వివరాలు: దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు ఉద్దేశించిన పరీక్షలో మొత్తం 160 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ నుంచి 80, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌లో కూడా 160 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. బోటనీ నుంచి 40, జువాలజీ నుంచి 40, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ప్రశ్నలను ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. ఈ టెస్ట్‌లో అర్హత పొందాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; బీసీ అభ్యర్థులకు రూ.550; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 4 నుంచి 6 వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 7 నుంచి
- **ఏపీ ఈఏపీ సెట్ తేదీ:** ఇంజనీరింగ్ అభ్యర్థులకు మే 13 నుంచి 16 వరకు; అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ అభ్యర్థులకు మే 17 నుంచి 19 వరకు
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

SCHOLARSHIP ALERT

The Cadence Scholarship Program 2024-25

Description: Cadence Design Systems Private Limited & Concern India Foundation invites applications from students pursuing undergraduate or postgraduate courses in the Delhi NCR, Bangalore, Pune, or Ahmedabad regions to continue their education.

Eligibility: Open to applicants residing and studying in Delhi NCR, Bangalore, Pune, or Ahmedabad (Indian nationals only) pursuing undergraduate and postgraduate courses.

Prizes & Rewards: Financial support for key educational expenses

Last Date to Apply: 30-05-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/TCSP4

National AIDS Control Organisation (NACO) Internship Programme

Description: National AIDS Control Organisation (NACO) Internship Programme 2024 is an opportunity offered by the Ministry of Health & Family Welfare, Government of India for students pursuing undergraduate, postgraduate, M.Phil and Ph.D. degree courses in various disciplines.

Eligibility: Open for Indian nationals pursuing undergraduate, postgraduate, M.Phil, and Ph.D. degree courses in specified disciplines.

Prizes & Rewards: A monthly stipend of 8,000 and a completion certificate

Last Date to Apply: Round The Year

Application mode: via post or email at: Deputy Secretary National AIDS Control Organisation (NACO) 9th Floor, Chandralok Building, 36, Janpath, New Delhi – 110001

Email ID: naco.internship@gmail.com ***Short Url:*** www.b4s.in/aj/NACO1

National Institute of Public Cooperation and Child Development Internship

Description: National Institute of Public Cooperation and Child Development Internship 2024 is an opportunity offered by the National Institute of Public Co-operation and Child Development (NIPCCD), New Delhi, for postgraduate and research students. This programme aims to familiarise interested and motivated students with the overall process of training and research in Women & Child Development schemes and programs.

Eligibility: Open for postgraduate or research students pursuing studies at various universities and recognized research institutes.

Prizes & Rewards: A monthly honorarium of up to 5,000 and other incentives

Last Date to Apply: 31-03-2024

Application mode: via email or post to: NIPCCD, Coordination Unit, 5 Siri Institutional Area, Hauz Khas New Delhi - 110016

Email ID: pu-nipccd@gov.in

Short Url: www.b4s.in/aj/NIPC1

buddy4study.com

విండర్స్



మీకు తెలుసా?

- చైనాలోని పెంగజువాంగ్ పట్టణంలో పుచ్చకాయ మ్యూజియం నాలుగువేల స్క్వేర్ ఫీట్స్‌లో ఉంది. దీన్ని 2002 సంవత్సరంలో నిర్మించారు. దీనిపేరు ఫ్లయింగ్ వాటర్‌మెలన్.
- పుచ్చకాయ మ్యూజియం లుక్ దగ్గరనుంచి లోపలకి వెళ్తే నియాన్ లైట్ల మధ్య పుచ్చకాయ రంగులతో తళుకులీనుతుంటుంది. ముఖ్యంగా ప్రతి పుచ్చకాయపై వాటి పుట్టు పూర్వోత్తరాల గురించి సమాచారం ఉంటుంది.
- ఆఫ్రికాలో ఉండే పుచ్చకాయల దగ్గరనుంచి.. ప్రపంచంలో దొరికే పుచ్చకాయల కథ అంతా ఈ మ్యూజియంలో తెలుస్తుంది.
- ఒకప్పుడు చైనా సాహిత్యంలో పుచ్చకాయల ప్రస్తావనం ఉండేదట.
- మ్యూజియం లోపల 300 ఫొటోలు ఉన్నాయి. వీటిని ఎక్కడ సాగు



చేస్తారు? ఎలా చేస్తారు? అనే సమాచారం ఇక్కడ దొరుకుతుంది.
- ఇక్కడి స్టాచూస్ వాక్స్ బొమ్మలే. చైనాలోని ఓల్డెస్ట్ వాటర్‌మెన్ కల్చర్‌ను వివరిస్తారిక్కడ. ఒక్క చైనాలోనే 170 రకాల వాటర్‌మెలన్‌లు ఉన్నాయట.
- ఇక్కడ సమాచారం ఇంగ్లీషులో ఉండదు. చైనాభాషలోనే ఉంటుంది. విషయమేంటంటే.. బొమ్మలు చూస్తూనే విషయం అర్థం అవుతుంది. ఈ మ్యూజియం చూడటానికి కనీసం నాలుగు గంటలు పడుతుంది.
- 5 వేల సంవత్సరాల కితమే ఈజిప్టులో పుచ్చకాయలను పండించినట్లు ఇక్కడ సమాచారం ఉంది.


సరైన నీడ ఏది?



6 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 253

	2		7	3				
3	4	7			2		6	
								7
4		8		5		2	3	
	6	5		1		7		8
1								
	7		4			5	1	9
				9	3		7	

సుడోకు - 252 సమాధానం

1	8	4	3	6	7	9	5	2
7	5	6	1	9	2	3	8	4
2	3	9	5	4	8	7	6	1
5	9	3	2	1	4	6	7	8
4	6	7	8	5	9	1	2	3
8	2	1	6	7	3	5	4	9
9	7	2	4	3	6	8	1	5
6	1	8	9	2	5	4	3	7
3	4	5	7	8	1	2	9	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.